






# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 11 సంచిక : 254 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ బుధవారం 21 మే 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :254 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA WED 21 MAY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada, Visakhapatnam, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


# పేర్లు రాసిపెట్టుకోండి... సినిమా చూపిస్తాం

## మరోసారి వార్నింగ్ ఇచ్చిన జగన్

- కూటమి ప్రభుత్వం, అధికారులకు జగన్ తీవ్ర హెచ్చరిక
- అన్యాయాలు చేస్తే ఎవరినీ వదిలేది లేదని వార్నింగ్
- రాష్ట్రంలో ప్రస్తుతం రాక్షస పాలన సాగుతోందని విమర్శ



**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ అధినేత జగన్ మరోసారి కూటమి ప్రభుత్వం, కొందరు అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అన్యాయాలకు పాల్పడే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, సమయం వచ్చినప్పుడు కచ్చితంగా "సినిమా చూపిస్తాం" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాక్షస ప్రభుత్వం నడుస్తోందని జగన్ ఆరోపించారు. "కలియుగంలో రాజకీయాలు చేయాలంటే భయం ఉండకూడదు. కేసులకు, జైళ్లకు బెదిరిపోకూడదు. అలా అయితేనే రాజకీయాలు చేయగలం. చంద్రబాబు చేస్తున్న రాజకీయాలు ఆ విధంగానే ఉన్నాయి" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే ఖూనీ చేస్తున్నారని, ముఖ్యంగా స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ఇది స్పష్టంగా కనిపిస్తోందని దుయ్యబట్టారు. తిరువూరు వంటి ప్రాంతాల్లో వైసీపీకి సంఖ్యాబలం ఉన్నప్పటికీ, టీడీపీ పోటీకి దిగడం, వైసీపీ ఆధిక్యం ఉంటే ఎన్నికలను నిలిపివేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పోలీసులు కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తూ వైసీపీ వారిని అరెస్టులు చేస్తూ, టీడీపీ వారిని

వివరాలు 2లో..

## జగన్ రెడ్డి రాజకీయ లబ్ధి కోసం ఏ గడ్డి కరవడానికైనా సిద్ధపడతారు

- తిరుపతి విద్యార్థి ఘటనను జగన్ రాజకీయం చేస్తున్నారు: లోకేశ్
- టీడీపీపై దుష్ప్రచారానికి సాక్షి పత్రికను వాడుకుంటున్నారని ఆరోపణ
- జేమ్స్‌పై దాడి నిందితులు వైసీపీ నేతల అనుచరులేనని వెల్లడి
- జగన్‌దే రక్తచరిత్ర అని విమర్శలు



పెన్ పవర్ డెస్క్:తిరుపతిలో ఓ దళిత విద్యార్థిపై జరిగిన దాడి ఘటనను అడ్డం పెట్టుకుని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని రాష్ట్ర విద్య, ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఈ ఘటనలో నిందితులుగా ఉన్నవారు

వివరాలు 2లో..

## నేపాల్ లో భూకంపం

- నేపాల్‌లో మళ్ళీ భూ ప్రకంపనలు
- రిక్టర్ స్కేలుపై 4.7 తీవ్రత నమోదు
- వారం రోజుల్లో ఇది రెండో సారి భూ ప్రకంపనలు



పెన్ పవర్ డెస్క్:హిమాలయ దేశం నేపాల్‌లో మరోసారి భూమి కంపించింది. మంగళవారం సంభవించిన ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.7గా నమోదైనట్లు జాతీయ భూకంప పర్యవేక్షణ, పరిశోధన కేంద్రం

వివరాలు 2లో..

## వాళ్ల కంటే మిన్నగా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి



- సరిహద్దుల్లో సైనికుల కంటే ఎక్కువగా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్న పవన్
- ఉగ్రవాదులకు దక్షిణాది రాష్ట్రాలు సున్నిత లక్ష్యాలని వ్యాఖ్య
- డీజీపీకి లేఖ రాసి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరానని వెల్లడి
- తీరంలో కొత్త వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశం

వివరాలు 2లో..

## బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ దోచుకుంటోంది

- అపార ఖనిజ సంపద ఉన్నా అభివృద్ధి శూన్యమన్న హిమంత
- దశాబ్దాలుగా ఆర్థిక, రాజకీయ దోపిడీకి గురవుతోందని వెల్లడి
- మౌలిక వసతులు కూడా కరవయ్యాయని ఆవేదన
- పాలకుల నిర్లక్ష్యమే కారణమని హిమంత విశ్లేషణ

పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో నెలకొన్న పరిస్థితులపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్పందించారు. అపారమైన సహజ వనరులు, ఖనిజ సంపద ఉన్నప్పటికీ పాకిస్థాన్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని ఆయన అన్నారు.

వివరాలు 2లో..



## అదే జరిగితే గాజాలో 48 గంటల్లో 14 వేల శిశువుల ప్రాణాలకు ముప్పు

- గాజాలో 14,000 మంది శిశువుల ప్రాణాలకు తీవ్ర ముప్పు
- 48 గంటల్లో సాయం అందకపోతే మరణించే అవకాశం
- ఇజ్రాయెల్ దిగ్బంధనంపై మిత్రదేశాల నుంచి తీవ్ర ఒత్తిడి
- సోమవారం గాజాకు చేరినవి కేవలం 5 ట్రక్కుల సాయం
- కనీస సాయానికి ఇజ్రాయెల్ అంగీకారం
- శిశువుల ఆహారం, పోషకాహారం కోసం ఐరాస ప్రయత్నాలు ముమ్మరం



పెన్ పవర్ డెస్క్:యుద్ధంతో అతలాకుతలమవుతున్న గాజాలో మానవతా సంక్షోభం రోజురోజుకూ తీవ్రతరమవుతోంది. రాబోయే 48 గంటల్లోపు తక్షణమే మరిన్ని సహాయక చర్యలు చేపట్టకపోతే, దాదాపు 14,000 మంది పసికందులు మరణించే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి (ఐరాస) తీవ్ర ఆందోళన

వివరాలు 2లో..

## 'డీడీ నెక్ట్స్ లెవల్ చిత్రం'పై చట్టపరమైన చర్యలు

### టీటీడీ పాలకమండలి నిర్ణయం

- టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం
- సోషల్ మీడియాలో వివరాలు వెల్లడించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు
- శ్రీవారి నామావళిని రీమిక్స్ చేసిన సినిమా బృందంపై చర్యలకు ఆమోదం
- తిరుమల కొండల్లో పచ్చదనం 80 శాతానికి పెంపు
- స్విమ్స్‌కు అదనపు చేయూత ఇవ్వాలని నిర్ణయం



పెన్ పవర్ డెస్క్:తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ధర్మకర్తల మండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఈ ఉదయం జరిగిన సమావేశంలో భక్తుల సౌకర్యాలు, ఆలయాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, వైద్య సేవలు, భద్రతాంశాలపై విస్తృతంగా చర్చించి పలు తీర్మానాలకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా, శ్రీవారి నామావళిని రీమిక్స్ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన 'డీడీ నెక్ట్స్ లెవల్' చిత్రబృందంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ వివరాలను బీఆర్ నాయుడు

వివరాలు 2లో..

## గ్యాస్ రాయితీ ఇక ముందుగానే లబ్ధిదారుల ఖాతాల్లోకి

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం ఇ-క్యాబినెట్ భేటీ
- దీపం-2 పథకం పురోగతిపై మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి
- తొలి విడతలో సుమారు లక్ష మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు
- రెండో విడత కోసం ఇప్పటికే 70 లక్షల మంది దరఖాస్తు
- మూడో విడతలో గ్యాస్ రాయితీ ముందే లబ్ధిదారుల ఖాతాల్లో జమ

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో 'దీపం-2' పథకం కింద మూడో విడత లో గ్యాస్ సిలిండర్ రాయి తీ సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో ముందు గానే జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల

వివరాలు 2లో..



## మన బ్రహ్మోస్ సత్తా చాటింది

- పాక్‌పై 'ఆపరేషన్ సిందూర్'లో భారత ఆయుధాల విజయవంతం
- "మేడ్ ఇన్ ఇండియా" ఆయుధాల సామర్థ్యం రుజువు: రాయబారి వినయ్ కుమార్
- భారత్-రష్యా మధ్య మరింత బలపడుతున్న రక్షణ ఒప్పందాలు
- బ్రహ్మోస్ సహా స్వదేశీ ఆయుధాల పనితీరుపై ప్రశంసలు
- కశ్మీర్ అంశం ద్వైపాక్షికమేనని రష్యాకు స్పష్టం
- ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు చర్చలకు భారత్ మద్దతు

వివరాలు 2లో..




## గ్రేటర్ విశాఖ డిప్యూటీ మేయర్ పదవి కూటమి వశం

- డిప్యూటీ మేయర్ గా జనసేన కార్పొరేటర్ దల్లి గోవింద్ రెడ్డి
- ఏకగ్రీవంగా ఎన్నికైన గోవింద్ రెడ్డి
- ఇప్పటికే మేయర్ పదవిని చేపట్టిన టీడీపీ

పెన్ పవర్ డెస్క్:ఏపీలో మరో పదవి వైసీపీ చేజారింది. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) డిప్యూటీ మేయర్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుంది. విశాఖలోని 64వ డివిజన్ కు చెందిన జనసేన కార్పొరేటర్ దల్లి గోవింద్ రెడ్డి డిప్యూటీ మేయర్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వివరాలు 2లో..



## ముందుగానే వచ్చేస్తున్న నైరుతి రుతుపవనాలు... నాలుగు రోజుల్లో కేరళలోకి ఎంట్రీ



- ప్రస్తుతం అండమాన్, శ్రీలంకలో విస్తరించిన రుతుపవనాలు
- సుమారు 10 రోజుల ముందుగానే కేరళను తాకనున్న వైనం
- జులై 8 నాటికి దేశమంతా విస్తరిస్తాయన్న అధికారులు

పెన్ పవర్ డెస్క్:దేశ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లని కబురు అందించింది. మరో నాలుగైదు రోజుల్లోనే నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు స్పష్టం చేశారు. తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వార్తతో ఉపశమనం లభించనుంది. భారత వాతావరణ

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# భయపడితే రాజకీయాలు చేయలేం..

### జైళ్లకు వెళ్లడానికి సిద్ధం కావాల్సిందే

భయపడితే నేడు రాజకీయాలు చేయలేమని వైసీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. ఈ కాలంలో రాజకీయాలంటే అన్నింటికీ తెగించాలని అన్నారు. జైళ్లకు వెళ్లాలన్నా, కేసులు పెడతారన్నా ఎలాంటి భయం లేకుండా ముందుకు సాగితేనే రాజకీయం చేయగలమని చెప్పారు. రామచంద్రాపురం, పార్వతీపురం మున్సిపాలిటీ, శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లతో, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో ఈరోజు వైయస్ జగన్ సమావేశం అయ్యారు.

**ధైర్యంగా ఉంటేనే...**

ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగుతుందని, అందుకు అనుగుణంగా మానసికంగా సిద్ధమవ్వాలని జగన్ పిలుపు నిచ్చారు. భయపడి సరెండర్ అయితే రాజకీయ భవిష్యత్ మాత్రం ఉండదని కూడా జగన్ తెలిపారు. ధైర్యంతో పాటు తెగించి పోరాడగలిగితేనే రాజకీయంగా మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. లేకపోతే రాజకీయం అనేది చేయలేమని అన్నారు. చంద్రబాబు నాయుడు చేస్తున్న రాజకీయాలు ప్రస్తుతం అలాగేఉన్నాయని జగన్ అన్నారు. అవసరమైతే జైళ్లకు వెళ్లాలని, బెయిల్ వస్తుందని, కేసులకు భయపడి పోతే మాత్రం రాజకీయాలు చేయలేమన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు.

**ఈసారి కార్యకర్త నెంబరు వన్...**

మళ్లీ వైసీపీ అధికారంలోకి రావడం ఖాయమన్న జగన్ ఈసారికార్యకర్త నెంబర్ వన్ స్థానంలో ఉంటారని చెప్పారు. జగన్ 2.%వా%లో కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుదని జగన్ మరోసారి స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త కష్టాన్ని తాను చూస్తున్నానని, అధికారంలోకి రాగానే వారికి న్యాయం చేస్తానని జగన్ భరోసా ఇచ్చారు. తప్పుడు కేసులు పెట్టినా పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని చెప్పారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అన్యాయం చేసిన వారికి ఖచ్చితంగా సినిమా చూపించడం ఖాయమని కూడా జగన్ అన్నారు. మనకూ టైం వస్తుందన్న జగన్ అప్పటి వరకూ వెయిట్ చేయాలంటూ నేతలకు జగన్ భరోసా ఇచ్చారు.

## గ్రేటర్ విశాఖ డిప్యూటీ మేయర్ పదవి కూటమి వశం

- మొదటి పేజీ తరువాయి

గోవిందరెడ్డి నాయకత్వాన్ని ఎమ్మెల్యే గణబాబు ప్రతిపాదించగా... మరో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు బలపరిచారు. వైసీపీ ఈ ఎన్నికకు దూరంగా ఉండటంతో గోవిందరెడ్డి నామినేషన్ మాత్రమే దాఖలయింది. దీంతో, గోవిందరెడ్డి డిప్యూటీ మేయర్ గా ఏకగ్రీవంగా గెలుపొందినట్టు జాయింట్ కలెక్టర్ ప్రకటించారు.

మేయర్ పదవిని ఇప్పటికే టీడీపీ చేపట్టింది. వైసీపీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పై కూటమి కార్పొరేటర్లు ఇటీవల అవిశ్వాస తీర్మానం పెట్టారు. అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో డిప్యూటీ మేయర్ ఎన్నిక తప్పనిసరి అయింది. ఈ క్రమంలో జీవీఎంసీలో కూడా వైసీపీ అధికారాన్ని కోల్పోయినట్టయింది.

## ముందుగానే వచ్చేస్తున్న నైరుతి రుతుపవనాలు...

### నాలుగు రోజుల్లో కేరళలోకి ఎంట్రీ

- మొదటి పేజీ తరువాయి

విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం, నైరుతి రుతుపవనాలు ప్రస్తుతం శ్రీలంక, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. ఇవి చురుగ్గా కదులుతూ, రాబోయే నాలుగు లేదా ఐదు రోజుల్లో కేరళ రాష్ట్రంలో ప్రవేశించేందుకు అన్ని అనుకూల పరిస్థితులు ఉన్నాయని ఐఎండీ అధికారులు తెలిపారు. సాధారణంగా జూన్ మొదటి వారంలో కేరళను తాకే రుతుపవనాలు, ఈ ఏడాది మే నెలాఖరులోనే పలకరించనున్నాయి. రుతుపవనాల కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నామని, ఇవి జులై 8వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా విస్తరిస్తాయని అంచనా వేస్తున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. ఈ ఏడాది రుతుపవనాల ఆగమనం ముందుగానే ఉండటంతో, వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తొలకరి వర్షాలు సరైన సమయంలో కురిస్తే పంటలకు మేలు జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మన బ్రహ్మోస్ సత్తా చాటింది

**పెన్ పవర్ డెస్క్:** భారత్, రష్యాల మధ్య రక్షణ రంగంలో సహకారం అంతకంతకూ బలపడుతోందని, ముఖ్యంగా పాకిస్థాన్‌పై చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో 'మేడ్ ఇన్ ఇండియా' రక్షణ పరికరాల సమర్థత నిస్సందేహంగా రుజువైందని రష్యాలో భారత రాయబారి వినయ్ కుమార్ స్పష్టం చేశారు. ఓ రష్యన్ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక విషయాలను వెల్లడించారు. "ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత దృఢపడ్డాయి. మనం కేవలం సైనిక పరికరాలను కొనడం, అమ్మడం మాత్రమే కాదు, రక్షణ ఉత్పత్తుల సంయుక్త అభివృద్ధి మరియు ఉత్పత్తిలోనూ పాలుపంచుకుంటున్నాం. భారత్‌లో తయారైన బ్రహ్మోస్ (రష్యా-భారత్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన సూపర్‌సోనిక్ యాంటీ-షిప్ క్షిపణి) వంటి ఆయుధాలు తమ సామర్థ్యాన్ని అనేకసార్లు నిరూపించుకున్నాయి. ముఖ్యంగా మే 7 నుంచి 10వ తేదీ మధ్య జరిగిన ఆపరేషన్ సమయంలో ఇది స్పష్టమైంది. కాబట్టి, ఈ రంగంలో మన సంబంధాలు మరింత వృద్ధి చెందుతాయని నేను నమ్ముతున్నాను" అని అంబాసిడర్ వినయ్ కుమార్ 'ఇజ్వెస్తియా' పత్రికకు తెలిపారు. రష్యా నుంచి భారత్‌కు కొత్త రక్షణ పరికరాల సరఫరా గురించి చర్చలు జరుగుతున్నాయా అన్న ప్రశ్నకు, సైనిక మరియు సైనిక-సాంకేతిక సహకారానికి సంబంధించిన అన్ని అంశాలపై ఇరు దేశాలు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయని, ఇది ద్వైపాక్షిక సంబంధాలలో కీలకమైన భాగంగా కొనసాగుతోందని కుమార్ నొక్కిచెప్పారు. పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ), భారత డీజీఎంఓకు ఫోన్ చేసిన తర్వాతే ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ద్వైపాక్షిక ప్రాతిపదికన కుదిరిందన్న న్యూఢిల్లీ వైఖరిని ఆయన మరోసారి పునరుద్ఘాటించారు. "పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి అనంతరం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్‌లతో సహా పలువురు నేతలు భారత ప్రతినిధులతో మాట్లాడారు. అయితే, కశ్మీర్ అంశం ఇరు దేశాలకు సంబంధించిన విషయమని, మూడో పక్షం మధ్యవర్తిత్వానికి ఆస్కారం లేదనే విధానాన్ని భారత్ స్థిరంగా అనుసరిస్తోంది. ఈ వైఖరి ఇప్పటికీ కొనసాగుతోంది" అని కుమార్ ప్రముఖ రష్యన్ వార్తాపత్రికకు వివరించారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో మతపరమైన గుర్తింపును నిర్ధారించుకున్న తర్వాత 26 మంది పర్యాటకులపై అతి సమీపం నుంచి కాల్పులు జరిపిన ఉగ్రదాడికి భారత్ ప్రతిస్పందించినప్పుడే పాకిస్థాన్‌తో ప్రస్తుత ఉద్రిక్తతలు తలెత్తాయని రాయబారి గుర్తుచేశారు. ఉక్రెయిన్ వివాదానికి శాంతియుత పరిష్కారం కోసం ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునివ్వడం, అందుకు సహాయం చేయడానికి సుముఖత వ్యక్తం చేయడంపై అడిగిన ప్రశ్నకు, కుమార్ స్పందిస్తూ.. వివాదానికి ముగింపు పలికేందుకు సంబంధిత పక్షాల మధ్య చర్చలకు భారత్ మద్దతిస్తుందని అన్నారు. "చర్చలను, శాంతియుత పరిష్కారాన్ని ప్రోత్సహించడానికి మేమేమైనా చేయగలిగితే, అందుకు మేం సిద్ధంగా ఉంటాం" అని ఆయన జోడించారు.

# పేర్లు రాసిపెట్టుకోండి... సినిమా చూపిస్తాం

- మొదటి పేజీ తరువాయి

వదిలేస్తున్నారని విమర్శించారు. "మీరు ఏ పుస్తకంలోనైనా పేర్లు రాసుకోండి. అన్యాయం చేయాలనుకుంటే చేయమనండి, కొడతానంటే కొట్టమనండి. కానీ, మాకూ సమయం వస్తుంది. అప్పుడు అన్యాయాలు చేసిన ప్రతి ఒక్కరికీ సినిమా చూపిస్తాం. రిటైర్ అయిన వారిని కూడా లాక్కొచ్చి తీరుతాం. దేశం విడిచి పారిపోయినా రప్పిస్తాం" అని జగన్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. చంద్రబాబు నాటిన విత్తనాలే ప్రస్తుత పరిస్థితులకు కారణమని, మహిళలని కూడా చూడకుండా నెలల తరబడి జైళ్లలో పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒక కేసులో బెయిల్ వస్తే, వెంటనే మరో కేసు నమోదు చేస్తున్నారని, వల్లభనేని వంశీ విషయంలోనూ ఇలాగే వ్యవహరించారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. దళితుడైన నందిగం సురేష్‌ను కూడా అన్యాయంగా నెలన్నరకు పైగా జైల్లో ఉంచి, బయటకు వచ్చిన తర్వాత మళ్లీ కేసు పెట్టి జైలుకు పంపారని మండిపడ్డారు. రేపు కచ్చితంగా వైసీపీ కార్యకర్తే నంబర్ వన్ అవుతాడని, కార్యకర్తలకు అండగా నిలబడతామని ఆయన భరోసా ఇచ్చారు. అన్యాయాలకు పాల్పడిన వారికి తగిన శాస్తి తప్పదని పునరుద్ఘాటించారు.

# జగన్ రెడ్డి రాజకీయ లబ్ధి కోసం ఏ గడ్డి కరవడానికైనా సిద్ధపడతారు

- మొదటి పేజీ తరువాయి

వైసీపీ నేతల అనుచరులేనని, అయినప్పటికీ టీడీపీపై బురద చల్లేందుకు జగన్, ఆయన కరపత్రిక సాక్షి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఈ నెల 15వ తేదీ రాత్రి తిరుపతిలో జేమ్స్ అనే దళిత విద్యార్థిని కిడ్నాప్ చేసి, దాడి చేసిన ఘటనపై మంత్రి లోకేశ్ స్పందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏ-1 యశ్వంత్, ఏ-2 కిరణ్, ఏ-3 జగ్గ, ఏ-4 లలిత్, ఏ-5 సాయి గౌడ్, ఏ-6 వంశీ, ఏ-7 రూపేష్‌లతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారని తెలిపారు. వీరిలో జగదీష్ అలియాస్ జగ్గ, లలిత్ అలియాస్ లలిత్ గోపాల్, నాని, సాయి గౌడ్‌లు మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరులని ఆరోపించారు. అలాగే, ఉండు రూపేష్ రెడ్డి అలియాస్ రూపి, సాయి కిరణ్ కుమార్ రెడ్డిలు భూమన అభినయ్ రెడ్డి వద్ద పనిచేసేవారని, వంశీ అలియాస్ చోటా బ్లేడ్ ఎంపీ గురుమూర్తి అనుచరుడని లోకేశ్ పేర్కొన్నారు. "వాస్తవాలు ఇలా ఉంటే, టీడీపీ వారే జేమ్స్‌ను కిడ్నాప్ చేసి దాడి చేశారంటూ సాక్షిలో తప్పుడు కథనాలు రాయించారు. రాజకీయ లబ్ధి కోసం ఏ గడ్డి కరవడానికైనా సిద్ధపడే జగన్ రెడ్డి, విద్యార్థుల మధ్య జరిగిన వ్యక్తిగత గొడవను మా పార్టీపై రుద్ది పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. దళిత సోదరులను రెచ్చగొట్టేలా తమ కరపత్రిక సాక్షిలో తప్పుడు రాతలతో విషం చిమ్ముతున్నారు" అని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. తిరుపతి ఘటనలో ఇప్పటికే కొందరిని అరెస్టు చేశారని, మిగిలిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారని, నిందితులు ఎవరైనా, ఎంతటివారైనా కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని ఆయన స్పష్టం చేశారు. "రాజకీయంగా జగన్ రెడ్డి గారి హిస్టరీ యావత్తు ఆసాంతం రక్తచరిత్రే. బాబాయిని బాత్రూమ్‌లో గొడ్డలివేటుతో లేపేసి, బాబుగారి చేతిలో కత్తి పెట్టి, నాడు అవినీతి విషపుత్రిక సాక్షిలో అడ్డగోలు రాతలు రాయించారు. అసలు నిజమేంటో సొంత చెల్లెళ్లతో సహా రాష్ట్ర ప్రజలంతా ఆలస్యంగా తెలుసుకున్నారు" అని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉండగా డాక్టర్ సుధాకర్ మొదలు డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు దళిత సోదరులను ఊచకోత కోసిన జగన్, ప్రతిపక్షంలోనూ అవే పోకడలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తిరుపతి ఘటనలో వాస్తవాలను, జగన్ రెడ్డి కుట్రలను గుర్తించి యావత్ దళిత సమాజం అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

# బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ దోచుకుంటోంది

- మొదటి పేజీ తరువాయి

దశాబ్దాలుగా బలూచిస్థాన్ ఆర్థికంగా, రాజకీయంగా దోపిడీకి గురవుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు సీఎం హిమంత తన 'ఎక్స్' ఖాతా ద్వారా పలు కీలక విషయాలను వెల్లడించారు. "బలూచిస్థాన్ ప్రావిన్స్ అపారమైన ఖనిజ సంపదకు నిలయం. అయినా తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. దశాబ్దాలుగా ఆ ప్రాంతంలో ఆర్థిక, రాజకీయ దోపిడీ రాజ్యమేలుతోంది" అని హిమంత తన పోస్టులో పేర్కొన్నారు. పాకిస్థాన్ మొత్తం ఖనిజ సంపదలో 80 శాతానికి పైగా బలూచిస్థాన్‌లోనే ఉన్నప్పటికీ, అక్కడి ప్రభుత్వం ఆ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు.

"ఆ ప్రాంతంలో భారీగా రాగి, బంగారు నిక్షేపాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇంకా వెలికితీయని సుమారు 5.9 బిలియన్ టన్నుల ఖనిజాలు, 41.5 మిలియన్ ఔన్సుల బంగారం, 35 మిలియన్ టన్నుల రాగి నిల్వలు బలూచిస్థాన్‌లో ఉన్నాయి" అని హిమంత వివరించారు. బలూచిస్థాన్‌లోని సుయ్ ప్రాంతంలో 1952లోనే గ్యాస్ నిక్షేపాలను కనుగొన్నారని, 2020 నాటికి పాకిస్థాన్ దేశానికి అవసరమైన సహజ వాయువులో దాదాపు 56 శాతం ఇక్కడి నుంచే సరఫరా అవుతోందని హిమంత బిశ్వ శర్మ గుర్తు చేశారు. గ్వాదర్ ఓడరేవు, 770 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఉన్నా, ఆ ప్రాంత ప్రజలకు కనీసం స్వచ్ఛమైన తాగునీరు, విద్యుత్, మౌలిక సదుపాయాలు కూడా అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ ఉద్యోగాల్లో కూడా బలూచిస్థాన్ ప్రావిన్స్ వాటా చాలా తక్కువగా ఉందని ముఖ్యమంత్రి హిమంత అన్నారు. అపారమైన వనరులున్న ప్రాంతంలో నివసిస్తున్నప్పటికీ, అక్కడి ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారని ఆయన తెలిపారు. "బలూచిస్థాన్‌లో వనరులకు కొరత లేదు. కానీ పాలకుల నిర్లక్ష్యం, రాజకీయ దోపిడీ విపరీతంగా ఉంది" అని హిమంత ఆరోపించారు.

# అదే జరిగితే గాజాలో 48 గంటల్లో 14 వేల శిశువుల ప్రాణాలకు ముప్పు

- మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేసింది. ఇజ్రాయెల్ అధికారులు 11 వారాల సంపూర్ణ దిగ్బంధనం తర్వాత, అమెరికా, కెనడా, ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్ వంటి మిత్రదేశాల నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు పాలస్తీనా భూభాగంలోకి పరిమితంగానే సహాయ సామగ్రిని అనుమతిస్తున్నారు.

ఐరాస మానవతా వ్యవహారాల చీఫ్ టామ్ ఫ్లెచర్ మాట్లాడుతూ, సోమవారం నాడు కేవలం ఐదు ట్రక్కుల మానవతా సహాయం మాత్రమే గాజాలోకి ప్రవేశించిందని, ఇందులో శిశువులకు అవసరమైన ఆహార పదార్థాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఇన్ని వారాల ఇజ్రాయెల్ దిగ్బంధనం తర్వాత ఇది "సముద్రంలో కాకి రెట్ట వంటిది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కొద్దిపాటి సహాయం కూడా ఇంకా అవసరమైన వారికి చేరలేదని ఆయన పేర్కొన్నారు. "మనం వారిని చేరుకోలేకపోతే రాబోయే 48 గంటల్లో 14,000 మంది పసికందులు ప్రాణాలు కోల్పోతారు... పోషకాహార లోపంతో బాధపడుతున్న తల్లులకు, తమ పిల్లలకు పాలు పట్టలేని నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి శిశువుల ఆహారాన్ని చేరవేయడానికి మేం అన్ని రకాల సవాళ్లను ఎదుర్కొంటున్నాం" అని ఫ్లెచర్ బీబీసీ రేడియో 4కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. గాజాలో ఇజ్రాయెల్ దాడులను బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా దేశాధినేతలు సోమవారం తీవ్రంగా ఖండించారు. మానవతా సహాయంపై ఆంక్షలు ఎత్తివేయకపోతే సంయుక్త చర్యలు తప్పవని హెచ్చరించారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, కెనడా ప్రధాని మార్క్ కార్నీలు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో, ఇజ్రాయెల్ సహాయాన్ని అడ్డుకోవడం, నెతన్యాహు ప్రభుత్వంలోని మంత్రులు పాలస్తీనియన్లను సామూహికంగా నిర్వాసితులను చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడటాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఇజ్రాయెల్ మిత్రదేశాల ఈ చర్యను "గట్టి మాటలు" అని అభివర్ణించిన ఫ్లెచర్, అంతర్జాతీయ సమాజం తన వైఖరిని కఠినతరం చేయడం స్వాగతించదగిన విషయమన్నారు. ఈరోజు మరో 100 ట్రక్కుల నిండా శిశువుల ఆహారం, పోషకాహార పదార్థాలను గాజాకు చేరవేయాలని ఐరాస ఆశిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. "రాబోయే 48 గంటల్లో ఈ 14,000 మంది శిశువులలో వీలైనంత ఎక్కువ మందిని కాపాడాలని మేం కోరుకుంటున్నాం" అని ఆయన అన్నారు.

# గ్యాస్ రాయితీ ఇక ముందుగానే లబ్ధిదారుల ఖాతాల్లోకి

- మొదటి పేజీ తరువాయి

శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం నాడు సచివాలయంలో జరిగిన ఇ-క్యాబినెట్ సమావేశం అనంతరం ఆయన సచివాలయం నాలుగో బ్లాక్‌లోని ప్రచార విభాగంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, "దీపం-2 పథకం మూడో దశ అమలులో భాగంగా, లబ్ధిదారులు గ్యాస్ బుక్ చేసుకోకముందే వారి ఖాతాల్లో రాయితీ సొమ్ము జమ అయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నాం" అని స్పష్టం చేశారు. ఈ విధానం ద్వారా లబ్ధిదారులకు మరింత సౌలభ్యంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

పథకం అమలు తీరును వివరిస్తూ, "దీపం-2 పథకం మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 99,700 మంది ఉచిత గ్యాస్ సిలిండర్ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. ప్రస్తుతం అమలవుతున్న రెండో

విడతలో భాగంగా, ఇప్పటికే దాదాపు 70 లక్షల మంది ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం బుక్ చేసుకోవడం జరిగింది" అని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన హామీ ఇచ్చారు. ఇ-క్యాబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

# నేపాల్ లో భూకంపం

- మొదటి పేజీ తరువాయి

(NEMRC) వెల్లడించింది. వారం రోజుల వ్యవధిలో నేపాల్‌లో భూకంపం రావడం ఇది రెండోసారి కావడంతో స్థానికులలో కొంత ఆందోళన నెలకొంది. భూకంప కేంద్రం రాజధాని ఖాట్మండుకు వాయువ్యంగా సుమారు 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాస్కి జిల్లాలోని సినువా ప్రాంతంలో కేంద్రీకృతమైనట్లు అధికారులు గుర్తించారు. ఈ భూకంపం కారణంగా కాస్కీతో పాటు సమీపంలోని తనహు, పర్వత్, బాగ్లుంగ్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో కూడా ప్రజలు స్వల్ప ప్రకంపనలు గుర్తించినట్లు సమాచారం. అయితే, ఈ తాజా భూకంపం వల్ల ఇప్పటివరకు ఎలాంటి ఆస్తి నష్టం గానీ, ప్రాణ నష్టం గానీ జరిగినట్లు తమ దృష్టికి రాలేదని అధికారులు స్పష్టం చేశారు. నష్టంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని వారు పేర్కొన్నారు. నేపాల్‌లో భూకంపాలు తరచుగా సంభవిస్తుంటాయి. సరిగ్గా వారం క్రితం, మే 14న తూర్పు నేపాల్‌లోని సోలుకుంభు జిల్లాలో 4.6 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఆ ఘటనలో ఎటువంటి నష్టం వాటిల్లలేదని అధికారులు తెలిపారు. అంతకుముందు, ఈ ఏడాది ఫిబ్రవరి 28న టిబెట్ సరిహద్దుకు సమీపంలోని సింధుపాల్‌చోక్ జిల్లాలో 6.1 తీవ్రతతో శక్తివంతమైన భూకంపం వచ్చిన విషయం తెలిసిందే. తరచుగా వస్తున్న భూ ప్రకంపనలతో నేపాల్ ప్రజలు అప్రమత్తంగా ఉంటున్నారు.

# వాళ్ల కంటే మిన్నగా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

**పెన్ పవర్ డెస్క్:** దేశ సరిహద్దుల్లో సైనికులు ఎంతటి అప్రమత్తతతో విధులు నిర్వర్తిస్తారో, రాష్ట్రంలో అంతర్గత భద్రత విషయంలో పోలీసులు కూడా అంతే జాగరూకతతో వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాలు ఉగ్రవాదులకు సున్నితమైన లక్ష్యంగా మారాయని, ఈ నేపథ్యంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగాన్ని, పరిపాలన సిబ్బందిని అప్రమత్తం చేస్తూ తాను లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. గన్నవరం విమానాశ్రయంలో జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో కోయంబత్తూరు, హైదరాబాద్‌లలో జరిగిన ఉగ్రవాద దాడులను ప్రస్తావిస్తూ, ఆ సంఘటనలు తలచుకుంటే ఇప్పటికీ గుండె తరుక్కుపోతుందని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో ఉగ్రవాదుల జాడలు కనిపించిన నేపథ్యంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని డీజీపీ గారిని లేఖ ద్వారా కోరాను. పాలనా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని ఉగ్రవాద జాడలున్న వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించాను" అని పవన్ వివరించారు. ముఖ్యంగా వలస వచ్చే వారి విషయంలో సరైన నిఘా ఉంచడం ద్వారా సంభవించబోయే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, తీర ప్రాంతంలో కూడా నిరంతర పర్యవేక్షణ, నిఘాను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. "గతంలో కాకినాడలో బయట వ్యక్తులు బోట్లలో వచ్చినట్లు కొన్ని వార్తలు వచ్చాయి. తీరంలో కొత్త వ్యక్తుల కదలికలు, వారి కార్యకలాపాలను నిశితంగా గమనించాలి. పోలీసులు అజాగ్రత్తగా ఉండకుండా అంతర్గత భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి" అని ఆయన హితవు పలికారు. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో రాష్ట్రంలో కొన్ని ఉగ్రవాద జాడలు కనిపించినట్లు తెలిసిందని, ఈ పరిణామాల దృష్ట్యా నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. అంతర్గత భద్రత విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని పోలీసులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# 'డీడీ నెక్స్ట్ లెవల్ చిత్రం'పై చట్టపరమైన చర్యలు

- మొదటి పేజీ తరువాయి

సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

**పచ్చదనం పెంపునకు పెద్దపీట**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తిరుమల కొండల్లో పచ్చదనాన్ని మరింతగా పెంచాలని టీటీడీ నిర్ణయించింది. ప్రస్తుతం 68.14 శాతంగా ఉన్న పచ్చదనాన్ని అటవీశాఖ సహకారంతో 80 శాతానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత దశలవారీగా నిధులు విడుదల చేయనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.1.74 కోట్లు, 2026-27లో రూ.1.13 కోట్లు, 2027-28లో రూ.1.13 కోట్లను అటవీశాఖకు అందజేయాలని నిర్ణయించింది.

**ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్**

తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, అమరావతి వేంకటేశ్వరస్వామి ఆలయం, నారాయణవనం కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, కపిలతీర్థం కపిలేశ్వరస్వామి ఆలయం, నాగాలాపురం వేదనారాయణస్వామి ఆలయం, ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయాల సమగ్రాభివృద్ధికి బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) రూపొందించాలని బోర్డు తీర్మానించింది. ఇందుకోసం ఆర్కిటెక్ట్‌ల నుంచి సాంకేతిక, ఆర్థిక ప్రతిపాదనలు స్వీకరించనుంది.

**విశ్రాంతి భవనాల పేర్ల మార్పు, క్యాంటీన్ల లైసెన్స్ ఫీజు**

తిరుమలలోని విశ్రాంతి భవనాల పేర్ల మార్పు విషయంలో స్పందించని ఇద్దరు దాతలకు చెందిన గృహాల పేర్లను టీటీడీయే మార్చాలని నిర్ణయం తీసుకుంది. ఇండియన్ ఆర్మీకి చెందిన సైనిక్ నివాస్ పేరు విషయంలో వారితో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే, తిరుమలలోని బిగ్ క్యాంటీన్లు, జనతా క్యాంటీన్ల లైసెన్సు ఫీజును నిర్ణయించే అంశానికి ఆమోదం తెలిపారు. భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు పేరున్న సంస్థలకు ఈ క్యాంటీన్లను అప్పగించాలని నిర్ణయించారు.

**స్విమ్స్‌కు అదనపు చేయూత**

రాయలసీమ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఆర్థిక సహాయాన్ని పెంచుతూ టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఏటా అందిస్తున్న రూ.60 కోట్లకు అదనంగా మరో రూ.71 కోట్లు ఇవ్వడానికి ఆమోదం తెలిపింది. స్విమ్స్‌లో ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది నియామకం చేపట్టాలని, 85 శాతం నిర్మాణాలు పూర్తయిన ఆంకాలజీ, పద్మావతి చిన్న పిల్లల ఆసుపత్రి భవనాల మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. శ్రీవారి వైద్య సేవలను కూడా విస్తృతం చేయాలని తీర్మానించారు.

**ఇతర కీలక నిర్ణయాలు**

ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాలను సందర్శించే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అక్కడ ఆధ్యాత్మిక, పర్యావరణ, మౌలిక సదుపాయాలను మరింతగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

టీటీడీలో పనిచేస్తున్న అన్యమతస్థులను బదిలీ చేయడానికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని, అవసరమైతే స్వచ్ఛంద పదవీ విరమణకు చర్యలు తీసుకోవాలని ఆమోదించారు.

తిరుమల ఆలయ భద్రత దృష్ట్యా యాంటీ డ్రోన్ టెక్నాలజీని వినియోగించాలని నిర్ణయించి, తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఒంటిమిట్టలో భక్తులకు అన్నదానం సేవలను మరింతగా పెంచాలని తీర్మానించారు.

తుళ్లూరు మండలం అనంతవరంలోని టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రూ.10 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.



# యోగా ఆంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా

# జిల్లాలో యోగాపై ప్రత్యేక కార్యక్రమాలు

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ. పెన్ పవర్ మే 20 :**జిల్లాలో అందరికీ యోగా పట్ల అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు గ్రామ స్థాయి వరకు నిర్వహించనున్న వివిధ కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు.

మంగళవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. కాకినాడ కమిషనర్ భావన, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, వివిధ శాఖల అధికారులు, యోగా అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. యోగా ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు నిర్వహించినున్న వివిధ కార్యక్రమాలు అమలుపై జిల్లా కలెక్టర్.. అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విశాఖపట్నంలో యోగా ఆంధ్ర-2025 కార్యక్రమం నిర్వహించనున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రజలందరికీ యోగా పట్ల అవగాహన, ఆసక్తి కలిగించే ఉద్దేశంతో ఈ నెలరోజుల పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన తెలిపారు. అవగాహన ర్యాలీలు, మారథాన్ పరుగు, రంగోలి, విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించడం ద్వారా చిట్ట చివరి వ్యక్తి వరకు యోగా చేరేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే కార్యక్రమాలకు నోడల్ అధికారిగా జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వాహక అధికారి, మున్సిపాలిటిలలో జరిగే కార్యక్రమాలకు కాకినాడ కమిషనర్ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. మండల, వార్డులలో జరిగే యోగా కార్యక్రమాలకు అవసరమైన ట్రైనర్లను ఏర్పాటు చేయాలన్నారు. మండల స్థాయిలో నిర్వహించే కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లా దేవాలయ శాఖ పరిధిలోని అన్ని దేవాలయాల్లోనూ ఈ నెలరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ నెల రోజుల పాటు జరిగే యోగాఆంధ్ర 2025 కార్యక్రమం విజయవంతం చేసేలా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, పాడా పీడీ ఎ.చైత్ర వర్షిణి, డీపీవో వి.రవికుమార్, డీఎస్డీవో బి.శ్రీనివాసకుమార్, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్..డీఎల్వీ రమేష్ బాబు, అన్నవరం ఈవో వి.సుబ్బారావు, ఆయుష్ వైద్య అధికారి డా.ఎంఎస్.ఆలీ, వివిధ యోగా అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# క్షేత్ర స్థాయి పర్యటనలో తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది





- జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి

**కొవ్వూరు, చాగల్లు, పెన్ పవర్, మే 20:**మండల స్టాక్ పాయింట్లు వద్ద ఉన్న సరుకుల స్టాక్ వివరాలను, రిజిస్టరు ప్రకారం నిర్వహిస్తున్నారో, లేదో, అదే విధంగా ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును క్షేత్ర స్థాయి పర్యటన సందర్భంలో ఖచ్చితంగా తనిఖీ చెయ్యాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు.

మంగళవారం చాగల్లు మండలం, ఉనగట్ల ఎమ్ ఎస్ ఎల్ పాయింట్, కొవ్వూరు పట్టణ ప్రాంతంలో ఉన్న చౌక ధరల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి. కలెక్టర్ వెంట ఆర్డీవో రాణి సుస్మిత, తహసిల్దార్ లు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పౌర సేవలు అందించే క్రమంలో క్షేత్ర స్థాయిలో ఆయా వ్యవస్థల పనితీరుపై జిల్లా స్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఆమేరకు చాగల్లు మండలం ఉన్నకట్ల గ్రామంలోని మండల స్టాక్ పాయింట్ నిర్వహణ విషయంలో స్టాక్ నిర్వహణ, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించడం జరిగిందన్నారు. స్టాక్ పాయింట్ లో ఉన్న స్టాక్, రిజిస్టర్ ప్రకారం సరిగ్గా ఉందో లేదో క్షుణ్ణంగా పరిశీలన చేసి నివేదిక అందచేయాలని ఆర్డీవో రాణి సుస్మితను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కొవ్వూరు పట్టణంలోని పలు చౌక ధరల దుకాణాన్ని పరిశీలించిన కలెక్టర్. అనంతరం అక్కడ వినియోగదారులతో మాట్లాడడం జరిగింది. ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును పట్ల, మోటార్ డెలివరీ యూనిట్స్ ద్వారా ఇంటి వద్దనే సరుకుల పంపిణీపై వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చెయ్యడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ డివిజనల్ అధికారి రాణి సుస్మిత తనిఖీ చేసిన స్టాక్ వివరాలు తెలియ చేస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థ, ఐ సి డి ఎస్ ద్వారా ఎం ఎస్ ఎల్ పాయింట్ లో స్టాక్ స్పోర్టెక్స్ రైస్ 19245 సంచులలో 959.328 మెట్రిక్ టన్నులు, ఫోర్టిఫైడ్ రైస్ 14.244 మెట్రిక్ టన్నులు, చక్కెర 58.494 మెట్రిక్ టన్నులు, కందిపప్పు, పిడిఎస్, ఐసిడిఎస్ లు 11.882 మెట్రిక్ టన్నులు, పిడిఎస్ 2.427 మెట్రిక్ టన్నులు, పామ్ ఆయిల్ 1049 లీటర్ ప్యాకెట్, 7219 అర లీటర్ ప్యాకెట్ లు స్టాక్ మేరకు సరిపోయినట్లు తెలిపారు. ఆమేరకు కలెక్టర్ కు నివేదిక అందచెయ్యడం జరిగిందన్నారు. ఈ పర్యటన లో కలెక్టర్ వెంట ఆర్డీవో రాణి సుస్మిత, చాగల్లు తహసీల్దార్ అమ్మాజీ, కొవ్వూరు తహసిల్దార్ ఎమ్.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎంల భద్రతకు చర్యలు



జిల్లా కలెక్టర్ షణ్మోహన్.

**కాకినాడ. పెన్ పవర్ మే 20 :**ఈవీఎం, వీవీపాట్స్ (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్దనున్న ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ షణ్మోహన్..రెవిన్యూ, ఎన్నికలు అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈవీఎం గోదాము భద్రతకు చేపడుతున్న చర్యలను జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం, వీవీపాట్స్ భద్రతకు చర్యలు చేపట్టాలని రెవెన్యూ,ఎన్నికల శాఖల అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల ఈవీఎం గోదాము భద్రతను తనిఖీ చేసి, నివేదిక పంపిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట కాకినాడ అర్బన్ తహసీల్దార్ వీ.జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటి ఎం.జగన్నాథం ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్ వార్తకు స్పందన జాజిపాలెం గ్రామానికి

# విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన అధికారులు..





**అడ్డతీగల, పెన్ పవర్, మే20** అడ్డతీగల మండలం దాకోడు పంచాయితీ జాజిపాలెం గ్రామానికి విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారు అని మంగళవారం పెన్ పవర్ కథనానికి విద్యుత్ శాఖ స్పందించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు .అడ్డతీగ మండలం జాజిపాలెం కి విద్యుత్ సరఫరా ఇచ్చినట్లు విద్యుత్ శాఖ అడ్డతీగల ఏ ఈ సుదర్శన్ తెలిపారు . గత రెండు రోజులుగా ఆ గ్రామానికి విద్యుత్ సరఫరా లేదని పెన్ పవర్ పత్రికలో వచ్చిన కథనాలకు స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు అన్నారు. శని ఆదివారాలు రెండు రోజుల నుంచి వర్షాలు విపరీతమైన గాలుల కారణంగా ఢీ. కొత్తూరు. తిరుమలవాడ మీదగా దాకోడు వెళ్లే విద్యుత్తు లైను చెట్లు కొమ్ములు విరిగిపడి తగ్గిపోయాయి అన్నారు. కొమ్మలు పడి లైన్లు తెగిపోయిన చోట మళ్లీ కొత్త లైన్లు వేసి మంగళవారం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. డి.రామవరం సెంటర్ నుంచి వీరంపాలెం వెళ్లే లైన్ లో కూడా ఇదే విధంగా చెట్లు కొమ్ములు పడి లైన్లు తెగిపట్టడం వల్ల సరఫరా లేద తెలిపారు. వాటిని కూడా సరిచేసి ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని తెలిపారు.



# మరిడమ్మ సన్నిధిలో జడ్జి పూజలు



**పెద్దాపురం, పెన్ పవర్, మే 20:** భక్తుల పాలిట కొంగుబంగారంలా విరాజిల్లుతున్న పెద్దాపురం పట్టణంలో కొలువైన మరిడమ్మ అమ్మవారిని పెద్దాపురం కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గండిపోము బుల్లెమ్మ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వేద పండితుల బృందం ఆమెకు ఆశీర్వచనం చేసి ప్రసాదాన్ని అందజేశారు.

# వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి



**గంగవరం, పెన్ పవర్, మే 20:**

భారతీయ స్టేట్ బ్యాంక్ ఖాతాదారుల సేవ కేంద్రం ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఎస్బిఐ చీఫ్ మేనేజర్, ఇంటర్నల్ ఆడిటర్ కమలేష్ కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం ఆయన గంగవరం బ్రాంచ్ మేనేజర్ జగదీష్ కుమార్ తో కలసి స్థానిక ఖాతాదారుల సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సేవా కేంద్రంలో వినియోగదారులకు అందుతున్న సేవలపై ఆరా తీసారు. అన్ని రకాల రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సి ఎస్ పి సిబ్బంది రమేష్, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# కిర్లంపూడి ఎస్సై సతీష్ సేవలు అభినందనీయం





- పెద్దాపురం డిఎస్పి శ్రీహరిరాజు

**కిర్లంపూడి, పెన్ పవర్, మే 20:**కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ సేవలు అభినందనీయమని పెద్దాపురం డిఎస్పి శ్రీహరిరాజు అన్నారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు, గత నాలుగు నెలలుగా స్టేషన్ కు వచ్చిన కేసులను త్వరితగతిన పరిష్కరించడమే కాకుండా, జిల్లాలోనే అతి తక్కువ కేసుల నమోదు అయిన పోలీస్ స్టేషన్ గా గుర్తింపు రావడానికి కృషి చేసిన కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ తో పాటు, స్టేషన్ రైటర్ ఎన్.వి రమణ పలువురు స్టేషన్ సిబ్బందిని మంగళవారం పెద్దాపురం డిఎస్పి శ్రీహరిరాజు, జగ్గంపేట సిఐ వై ఆర్ కె శ్రీనివాస్ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీహరిరాజు మాట్లాడుతూ గత నాలుగు నెలల కాలంలో ఎస్సై జి.సతీష్ తో పాటు స్టేషన్ సిబ్బంది కలసి మండలంలో శాంతి భద్రతలను పరిరక్షించడమే కాకుండా, స్టేషన్ కు వచ్చిన కేసులను సత్వరమే పరిష్కరించి అతి తక్కువ కేసులు నమోదు కావడానికి ఎంతగానో కృషి చేసారన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై సతీష్ తో పాటు పలువురు స్టేషన్ సిబ్బందిని సన్మానించి, అభినందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రైటర్ ఎన్ వి. రమణ, అసిస్టెంట్ రైటర్ ఏవి.సుబ్బిరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ కె.శ్రీనివాస్ దొర, కోర్ట్ కానిస్టేబుల్ రాజాబాబు, కృపా, ప్రసాద్ పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్ పంటల ద్వారా అధికాదాయం



**గంగవరం ,పెన్ పవర్ ,మే 20:**
పామ్ ఆయిల్ సాగులో అంతర్ పంటల సాగు ద్వారా అది కాదాయం పొందవచ్చుని హిప్పర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ సునీత అన్నారు. మంగళవారం గంగవరంలో ఏర్పాటుచేసిన ఫామ్ ఆయిల్ తోట పరిశీలన కార్యక్రమంలో భాగంగా కుంజం కృష్ణ చేపట్టిన అంతర్ పంటల సాగు విధానాన్ని ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీవో ప్రకాష్, వెలుగు ఏపీఎం షణ్ముఖేశ్వరరావ్, ఎఫ్ పి ఓ సి సి గణపతి తదితరులు పాల్గొన్నారు.

# 5న ఉద్యోగుల సంఘం కౌన్సిల్ సమావేశం

**పెద్దాపురం, పెన్ పవర్, మే 20:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మూడవ కౌన్సిల్ సమావేశం జూన్ 5వ తేదీన విజయవాడలో నిర్వహించనున్నట్టు ఆ సంఘం నాయకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలన్నారు. దీనికి సంబంధించి ఛలో విజయవాడ పోస్టర్ ను పెద్దాపురం ఏపీజీఈఏ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు





ఎన్.వి.వి.ప్రసాద్, సంజయ్ కుమార్, సంజయ్, లోవరాజు, స్రవంతి, సతీష్ , అపర్ణ, వీరబాబు, విజయ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం, విద్యకు రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ సాయం

**కాకినాడ.పెన్ పవర్ మే 20 :** వైద్యం, విద్యకు రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ (1978) ఛారిటబుల్ ట్రస్ట్ సహాయపడుతుంది అందులో భాగంగా మంగళ వారం డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ ఆవరణలో రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ (1978) ఛారిటబుల్ బుల్ ట్రస్ట్ కార్యాలయంలో సుమారు ఒక లక్ష 25 వేల రూపాయలు విలువ చేసే సహాయాన్ని అందించారు.ఎంబీఏ చదువుతున్న విద్యార్థికి ల్యాప్ టాప్, డిగ్రీ చదువుతున్న నలుగురు విద్యార్థులకు స్కాలర్, మధు మేహ వ్యాధితో బాధపడుతున్న ఐదేళ్ల బాబుకు 3 నెలలకు సరిపడ మందులు, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఒక మహిళకు 3 నెలలకు సరిపడ్డ మందులు మొత్తం అన్ని కలిపి ఆ ఏడుగురుకి లక్ష ఇరవై ఐదువేలు రూపాయలు విలువ చేసే సేవా కార్య కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రముఖ ఆడిటర్, రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థి తాళ్లూరి శ్రీనువాసు చేతుల మీదుగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్య సేవలకు సంబంధించిన సేవా కార్యక్రమాలకు ప్రాముఖ్యత ఇస్తున్నామని, బాగా చదువుతున్న విద్యార్థులను వీలైనంత వరకు ట్రస్ట్ ద్వారా తమ పూర్వ విద్యార్థుల సహకారంతో కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఎన్ కళ్యాణి,ఎ సరళ తదితరులు పాల్గొన్నారు.




# కార్మికులను బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్ లు రద్దు చేయాలి

- జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ ఆందోళన
- జూలై 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని పిలుపు



**కాకినాడ,పెన్ పవర్ మే20 :**కార్మికులను బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్ లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం జిజిహెచ్ మాతాశిశు విభాగం వద్ద శానిటేషన్ వర్కర్స్ ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుండి భారత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్ లు గా మార్చి కేంద్ర బిజెపి పాలకులు కార్పోరేట్ లు, యాజమానుల కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే ఉన్న కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాల కొనసాగింపుగానే 29 కార్మిక చట్టాలు రద్దు చేసారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధిగా కార్మికుల పక్షాన నిలబడుతుందా, మోడీకీ వంతపాడుతూ కార్పోరేట్ ల పక్షాన ఉంటుందా తేలాల్సి ఉందన్నారు. మే 20 వ తేదీ జరగవలసిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జూలై 9 కి వాయిదా పడిన నేపథ్యంలో ఈ ఆందోళన చేపట్టామన్నారు.కేంద్ర ప్రభుత్వం తక్షణమే లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికులకైనా కనీస వేతనం 26,000రూ.అమలు చేయాలన్నారు.జూలై 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు జయప్రదం చేయాలన్నారు.జిజిహెచ్ శానిటేషన్, సెక్యూరిటీ వర్కర్స్ కి ఏప్రిల్ జీతం తక్షణమే చెల్లించాలని, ప్రతి నెలా 5 వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్. విజయ్ కుమార్, జె. శేషు, ఎస్. వాసు,డి.దుర్గా ప్రసాద్,ఎం. రవి,డి.జనార్ధన్,భాగ్యవతి, వసంత్ లతో పాటు జిజిహెచ్ మెస్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి అనపర్తి ఏడుకొండలు, సెక్యూరిటీ యూనియన్ నాయకులు సోమరాజు,ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్

**కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే "పిల్లి "**



**కాకినాడ.పెన్ పవర్ మే 20 :**పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు కూటమి ప్రభుత్వం అందిస్తుందని కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి పేర్కొన్నారు. వలసపాకల లోని తమ స్వగృహం లో "పిల్లి" దంపతులు పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు.కరప మండలం లో అరట్లకట్ట గ్రామానికి చెందిన యరమాటి లక్ష్మి కి రూ.25100లు, వేలంగి గ్రామానికి చెందిన పెంకె రామకృష్ణ కి 43,843లు,పెనుగుదురు గ్రామానికి చెందిన గుత్తుల వెంకట రావు కి రూ.32,889లు కాకినాడ రూరల్ మండలం లో

తూరంగి గ్రామానికి చెందిన చొక్కా ఎల్లయ్య కి రూ.20350లు, సూరాడ మల్లీశ్వరి కి రూ.40000లు ,గైగోలుపాడు గ్రామానికి చెందిన గంజా శ్రీనివాస్ కి రూ.33,752 లు, ఇంద్రపాలెం గ్రామానికి చెందిన అనుసూరి వెంకట రమణ కి రూ.64, 415లు, వాకలపూడి గ్రామానికి చెందిన కొండెల లక్ష్మి కి రూ.20,000లు మొత్తంగా లబ్ధిదారులకు రూ.2,80,349 ల చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా పిల్లి దంపతులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకునే వ్యక్తులు తప్పనిసరిగా ఒరిజినల్ బిల్లులు, సంబంధిత పత్రాలు సిద్ధం చేసుకుని తమకు గానీ,తమ పార్టీ నాయకులకు గానీ అందజేస్తే వాటిని సీఎంఓ కార్యాలయానికి పంపించి వారికి సీఎం రిలీఫ్ ఫండ్ వచ్చేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన బిజెపి నాయకులు



**గోకవరం, పెన్ పవర్,మే 20 :** ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ గా ఎన్నికైన రంపచోడవరం గ్రామానికి చెందిన సోళ్ల బొజ్జిరెడ్డిని ఆయన నివాసం వద్ద మంగళవారం పలువురు బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.కాకినాడ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి మట్టా మంగరాజు, ఏపీ బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు సత్తి వెంకటరెడ్డి, కాకినాడ జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు చిలుకూరి రామకుమార్, కాకినాడ జిల్లా ఉపాధ్యక్షులు కామినేని జయశ్రీ, ఉమ్మిడి వెంకట్రావు, ఉంగరాల ఆది విష్ణు, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి కన్వీనర్ వీకా బుల్లికొండల దొర, కుండ్ల కృష్ణారెడ్డి, కుండ్ల సాయి రామారెడ్డి ,కారం సీతా రామన్న దొర, నరమళ్ళ శ్రీనివాసరావు, దొడ్డబోయిన అప్పాజీ తదితరులు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిలుకూరి రామకుమార్, మట్టామంగరాజు, ఉమ్మిడి వెంకట్రావు, వీకా బుల్లి కొండలు దొర, ఉంగరాల ఆదివిష్ణు తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ భారతీయ జనతా పార్టీ పై అభిమానంతో ఉద్యోగానికి రాజీనామా చేసి పార్టీలో చేరి పార్టీకి విస్తృతమైన సేవలు అందించిన కష్టానికి ఫలితముగా ఈ రోజున రాష్ట్రస్థాయి పదవి బొజ్జిరెడ్డిని వరించిందని బిజెపిలో కష్టపడి పని చేసే వారికి ఏదో ఒక రోజున సరైనటువంటి ఫలితం వస్తుందని బొజ్జిరెడ్డికి ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవి ఇవ్వడం ద్వారా భారతీయ జనతా పార్టీ నాయకులకు కార్యకర్తలకు మంచి సంకేతాలను అందించిందని తెలిపారు, ఆదివాసి గిరిజన మహిళ ద్రౌపది ముర్మును రాష్ట్రపతి పీఠంపై కూర్చోపెట్టిన ఘనత బిజెపికి దక్కిందని , ప్రతి మారుమూల గిరిజన పల్లెల్లో సైతం స్వచ్ఛభారత్ పథకంలో మరుగుదొడ్ల నిర్మాణం చేసిన ఘనత కూడా నరేంద్ర మోడీ గారి ప్రభుత్వానికి దక్కిందని, గత ఐదు సంవత్సరాలుగా దేశంలోని 80 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా రేషన్ బియ్యం సరఫరా చేస్తున్న ఘనత కేంద్ర ప్రభుత్వానికే దక్కిందని , జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి రక్షిత మంచినీటి పథకాన్ని అమలు చేసిన ఘనత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి దక్కిందని గిరిజన సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి దక్కిందని తెలిపారు .

# విద్యుత్ టవర్ల ఆధునీకరణకు పవర్ కట్......

- విద్యుత్ అంతరాయం ఉదయం 11 గంటల నుండి సాయంత్రం5 గంటల మధ్య 15 రోజులపాటు ఒక గంట పాటు
- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, అమలాపురం, మే 20 :** నూతనంగా ఏర్పడిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాసుల విద్యుత్ డిమాండ్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నూతన సబ్ స్టేషన్ ఏర్పాటు ట్రాన్స్ఫార్మర్లు విద్యుత్తు టవర్లు లైన్లు ఆధునీకరణ వంటి పనుల నిర్వహణ నిమిత్తం జిల్లాలో రామచంద్రపురం డివిజన్, కొత్తపేట డివిజన్లోని ఆత్రేయపురం రావులపాలెం కొత్తపేట మండలాల్లో మినహా మిగిలిన మండలాలలో విద్యుత్ పవర్ కట్ ముందుగా నిర్దేశించిన గ్రామాలలో ఉంటుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు ఏపీ ట్రాన్స్కో, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించి విద్యుత్ టవర్లు ఏర్పాటు సందర్భంలో విద్యుత్ పవర్ కట్ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 90 టవర్లు వేయాల్సి ఉండగా ఇప్పటివరకు 60 టవర్లు నిర్మించినట్లు మిగిలిన 30 టవర్లు నిర్మాణానికి సంబంధించి రోజుకు రెండు చొప్పున నిర్మించనున్నట్లు తెలిపారు వీటిని నిర్మాణ సందర్భంలో విధించే విద్యుత్ అంతరాయ సమయాలను, గ్రామాలను ముందుగా తెలియజేయడం జరుగుతుందని ఆ మేరకు వినియోగదారుల సహకరించాలన్నారు.విద్యుత్ అంతరాయాలను ఉదయం 11 గంట నుండి 5 గంటల మధ్య సమయంలో విధించడం జరుగుతుందన్నారు.సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ కొత్త పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్న నేపథ్యంలో ఈ విద్యుత్ అంతరాయాలను ప్రకటిస్తారన్నారు.స్థానిక విద్యుత్ అవసరాలలో 20 శాతం మేర ఈ పనుల నిమిత్తం కోత విధించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎటువంటి విద్యుత్ అంతరాయాలు (పవర్ కట్లు) విధించలేదని ఆయన స్పష్టం చేశారు. ఏపీ ట్రాన్స్కో అధికారులు టవర్లు నిర్మాణ సందర్భంలో విధించే విద్యుత్ అంతరాయాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ముందుగాతెలియజేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.రొటేషన్ పద్ధతిలో ఎవరికి పెద్దగా ఇబ్బందులు లేకుండా ఒక సబ్ స్టేషన్లో ఉన్న నాలుగు పీడర్లు ఉంటే రోజు కొక పీడర్ చొప్పున ఒక గంట పాటు విద్యుత్ అంతరాయాన్ని విధించడం జరుగుతుందన్నారు.జిల్లా గ్రామీణ త్రాగునీటి సరఫరా విభాగానికి ఎటువంటి విద్యుత్తు అంతరాయాలను విధించరాదని 24/7 త్రాగునీటి అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండాలని ఏపీ ట్రాన్స్కో ఇంజనీర్లును ఆదేశించారు. సరాసరిన కేవలం అమలాపురం డివిజన్లో మాత్రమే 24 గంటల వ్యవధిలో కేవలం 3 గంటల పాటు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.ఏపీ ట్రాన్స్కో విశాఖపట్నం జోనల్ చీఫ్ ఇంజనీర్ బి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ జిల్లా స్థాయి అవసరాల దృష్ట్యా సబ్ స్టేషన్లు ట్రాన్స్ఫార్మర్లు విద్యుత్తు లైన్ ఆధునీకరణ వంటి పనుల నిమిత్తం విద్యుత్ అంతరాయాలను15 రోజులు పాటు విధించడం జరుగుతుందన్నారు.దీనికి విద్యుత్ వినియోగదారులు పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో ఎస్సీ ఎస్. రాజబాబు, గ్రామీణ నీటి సరఫరా,పారిశుద్ధ్య శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ సిహెచ్ ఎన్వి కృష్ణారెడ్డి,ఇరు విభాగాల ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యం పాలైన వైఎస్సార్సీపీ కార్యకర్తకు అండగా పెద్దేవం గ్రామ కమిటీ

**తాళ్ళపూడి, పెన్ పవర్, మే 20:** మండలంలోని పెద్దేవం గ్రామంలో 5వ వార్డుకి చెందిన వైసీపీ కార్యకర్త బొర్రా సూరిబాబు బ్రెయిన్ స్ట్రోక్ వల్ల అనారోగ్యం పాలయ్యారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్సీపీ కొవ్వూరు నియోజవర్గ ఇన్చార్జ్ తలారి వెంకట్రావు, పార్టీ తూర్పు గోదావరి జిల్లా మాజీ ప్రచార కమిటీ అధ్యక్షులు తోట రామకృష్ణ ల చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు 45,000 రూపాయలు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దేవం గ్రామ సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, వైఎస్ఆర్సీపీ నాయకులు కవల నాగేశ్వరరావు, మైలవరపు రాధాకృష్ణ, కోడి గంగారావు, చింతా వెంకటస్వామి, నామా ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.



# మత్స్యకార సంఘం మరొకటి వద్దంటూ ఆందోళన



**టీ నర్సాపురం, పెన్ పవర్,మే 20 :**టీ నర్సాపురం మండలం బొర్రంపాలెం లో మత్స్యకార సంఘానికి తెలియపరచకుండా రహస్యంగా మరొక మత్స్యకారు సంఘం ఏర్పాటు చెయ్యాలని చూస్తున్నారని తెలుసుకొని, ఒక సంఘం ఉండంగా మరొక సంఘం చేయవద్దంటూ స్థానిక మత్స్యకార సంఘ సభ్యులు ఆందోళన చేపట్టారు. గ్రామంలో గత 30 ఏళ్లుగా మత్స్యకార సంఘం కొనసాగుతుందని తెలుసు.అయితే పంచాయతీలో ఉన్న 14 మంది వార్డు సభ్యులలో 9 మందికి తెలియకుండా కొందరు వ్యక్తులు తప్పుడు తీర్మానాలు పొంది మత్స్యకార సంఘాన్ని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారంటూ సంఘ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు.వెంటనే దాన్ని విరమించాలని డిమాండ్ చేశారు. మరో మత్స్యకార సంఘం ఏర్పాటుకు తీర్మానం ఎలా చేశారంటూ పంచాయతీ కార్యదర్శి పగడం నాగేశ్వరరావును సెల్ ఫోన్ ద్వారా వివరణ అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ తీర్మానాన్ని రద్దు చేస్తామని వారికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం అక్కడికి చేరుకున్న ఈవోపీఆర్డి శ్రీనివాసులకు మత్స్య సంఘ నాయకులు,సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల రమేష్, గుండె చిన్న చిట్టియ్య, రాంబాబు, వెంకటేష్,శ్రీను, జక్కయ్య చిన్న వెంకటేశ్వరరావు, పోతురాజు, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన తల్లిబిడ్డ ఎక్స్ ప్రెస్ ఉద్యోగులు

- వేతన బకాయిలు,కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్




**కాకినాడ.పెన్ పవర్ మే 20 :** తల్లి, బిడ్డ ఎక్స్ ప్రెస్ ఉద్యోగులు రోడ్డెక్కారు. పనిచేస్తున్న కెప్టెన్ (డ్రైవర్) ల వేతన బకాయిలు, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈమేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.తల్లి, బిడ్డ ఎక్స్ ప్రెస్లో రాష్ట్ర వ్యాప్తంగా 500 వాహనాలలో దాదాపు 500 మంది కెప్టెన్ (డ్రైవర్లు)గా పనిచేస్తున్నారు.జిల్లాలో 25వాహనాలలో 25మంది పనిచేస్తుండగా అందులో 8వాహనాలు మూలాన పడ్డాయి. ప్రస్తుతం అరబిందో (ఎఇఎంఎస్) సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్యశాఖకు సేవలందిస్తున్నారు. అరబిందో యాజమాన్యం గత 7సం.లుగా నెలకు కేవలం రూ. 8800 వేతనాన్ని మాత్రమే యాజమాన్యం చెల్లిస్తున్నది. గత 4 నెలలుగా ఇచ్చే ఈ అరకొర వేతనాలను కూడా చెల్లించడం లేదు.సిటిసి పేరిట యజమాని కట్టాల్సిన పిఎఫ్ వాటాను కూడా ఉద్యోగుల నుంచే మినహాయిస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నది. ఆదివారం/వీక్లీఆఫ్, పండుగలు, చట్టప్రకారం అమలు చెయ్యాల్సిన సెలవులు ఏవికూడా అమలుచెయ్యడంలేదు. ఇంక్రిమెంట్లు లేవు. వీరంతా ఏజెన్సీ ద్వారా నియమించబడినా ప్రధాన యజమాని వైద్య, ఆరోగ్యశాఖ/ రాష్ట్ర ప్రభుత్వమే. చట్టప్రకారం చెల్లించాల్సిన వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ తదితర సౌకర్యాలు అమలు చేయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్యశాఖదే. అరబిందో యాజమాన్యం మారుతున్న నేపథ్యంలో ఉద్యోగుల క్రింది సమస్యలను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి, పరిష్కరించమని విజ్ఞప్తి చేస్తున్నారు. మంగళవారం ఒక రోజు సమ్మె చేశారు.ఇప్పటికైనా క్రింది సమస్యలు పరిష్కరించమని తదనుగుణంగా ఏజెన్సీకి తగు ఆదేశాలను ప్రిన్సిపల్ ఎంప్లాయర్ జారీ చెయ్యమని విజ్ఞప్తిచేస్తున్నామని సీఐటీయూ నాయకులు ఎంవీ. రమణ జిల్లా అధ్యక్షులు ఎస్.సాయికుమార్, కార్యదర్శి వి.మల్లికార్జున రావు తదితరులు అన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.

# జేఎన్టీయూకె మాజీ విసి అల్లం అప్పారావుకు బీజేపీ నివాళులు



**కాకినాడ.పెన్ పవర్ మే 20 :** జేఎన్టీయూకే తొలి వీసీ డా.అల్లం అప్పారావుకు ద్వితీయ వర్ధంతి సందర్భంగా బీజేపీ నేతలు నివాళులు అర్పించారు.బిజెపి కాకినాడ అసెంబ్లీ కన్వీనర్ మరియు బిజెపి రాష్ట్ర భవన కమిటీ సభ్యుడు ఇంజినీర్.గట్టి సత్యనారాయణ తన కార్యాలయంలో విశ్వవిద్యాలయ వ్యవస్థాపక ఉపకులపతి, ప్రఖ్యాత విద్యావేత్త ప్రొఫెసర్ అల్లం అప్పారావు (28.12.1949 %-% 20.05.2023) కు నివాళులర్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విశిష్ట సేవల ద్వారా, ప్రొఫెసర్ అల్లం అప్పారావు కాకినాడ జెఎన్టియుకేను స్థాపించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. దేశవ్యాప్తంగా అనేక విద్యా సంస్థలకు ఆయన మార్గదర్శక వెలుగుగా నిలిచారని,కంప్యూటర్ సైన్స్ రంగంలో ఆయన లోతైన జ్ఞానం,పరిశోధన పరిపాలనా నైపుణ్యం వేలాది మంది విద్యార్థులకుస్ఫూర్తినిచ్చిందన్నారు.ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు.

విద్య,పరిశోధన రంగాలకు ఆయన అందించిన అమూల్యమైన సేవలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు.

# వేసవి సెలవుల్లో పిల్లలు జాగ్రత్త



**జీలుగుమిల్లి, పెన్ పవర్, మే 20:** నియోజగవర్గ పరిధిలో ఉన్న తల్లి దండ్రులు పిల్లలకు వేసవి సెలవలు లో వారి పట్ల తగు జాగ్రత్తలు తీసుకొని ఎటువంటి హాని జరగకుండాచూసుకోవాలని
పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలియజేశారు. మంగళవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ
ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఇటీవలే జరిగిన పలు సంఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి పట్ల దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు.వేసవి సెలవుల లో విహార యాత్రలకు అలాగే పలు ప్రాంతాలు సందర్శనలకు వెళ్ళేటప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల సరైన జాగ్రత్తలు తీసుకొని వారి కదలికలను గమనిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఇటీవలే జిల్లా వ్యాప్తంగా వేరు వేరు సంఘటనలలో నిర్లక్ష్యం గా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 20 మంది కి చేరడం బాధాకరం అని అన్నారు,ముందస్తుగా వారిపట్ల బాధ్యతగా వ్యవహరించి ఉంటె ప్రాణ నష్టం తీవ్రత తగ్గేదని,కొన్ని రోజుల క్రితం బుట్టాయిగూడెం మండలం దొరమామిడి అలివేరు ప్రాజెక్టు లో ప్రమాదవుసాత్తు ఇద్దరు చిన్నారులు మృతి చెందిన ఘటన ఆయన్ని కలచి వేసిందని అన్నారు.ముందుగానే మెలుకువగా ఉండి పిల్లలు కదలికలు గమనించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రతి తల్లి దండ్రలకు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆర్థిక సహాయం.



**కె గంగవరం పెన్ పవర్ మే 20:** కష్టంలో ఉన్న ఒక కుటుంబానికి "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" అండగా నిలిచింది.రామచంద్రపురం పట్టణంలోని తొమ్మిదో వార్డు జల్లి పేటలో నివాసం ఉంటున్న యళ్ళ శ్రీదేవి (45) ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన సంగతి తెలిసిందే.ఆమె మరణంతో తీవ్ర శోకంలో ఉన్న ఆ కుటుంబానికి ఓదార్పు అందించి,సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా రూ.10 వేలు ఆర్థిక సహాయం స్థానిక తొమ్మిదవ వార్డు కూటమి నాయకులచే మంగళవారం ఆ కుటుంబానికి అందించారు.రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం స్థానిక కూటమి నాయకుల చేతులు మీదుగా ఆ కుటుంబానికి సహాయం చేయడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.కష్టకాలంలో ఉన్న తమ పట్ల ఓదార్పు, మనో ధైర్యం,సానుభూతి చూపించటంతో పాటు,ఆర్థిక సహాయం అందించిన "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్"కు యాళ్ల శ్రీదేవి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఆపదలో,కష్టాల్లో ఉన్న కుటుంబాల పట్ల మంత్రి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ నిత్యం చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పెట్టుబడి తగ్గించి అధిక దిగుబడులు సాధించాలి

**హార్టికల్చర్ ప్రాంతీయ విస్తరణ మండలి సమావేశంలో పలువురు శాస్త్రవేత్తల సలహా**



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్,మే20:** పెట్టుబడులు తగ్గించి అధిక దిగుబడులు సాధించడానికి శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయాలని పలువురు శాస్త్రవేత్తలు కోరారు. డాక్టర్ వైయస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీలో కోస్తా మండల పరిధిలో 2025 సంవత్సరాకి గాను ప్రాంతీయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం కృషి విజ్ఞాన కేంద్రం వెంకటరామన్న గూడెంలో మంగళవారం జరిగింది. కోస్తా మండలంలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్.టి.ఆర్, కృష్ణా గుంటూరు, పల్నాడు బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి ఉద్యా న శాఖ అధికారులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డా.వైయస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ గోపాల్, రిజిస్ట్రార్, డాక్టర్. బి. శ్రీనివాసులు, పరిశోధనా సంచాలకులు డాః. కె.టి.వి రమణ, విస్తరణ సంచాలకులు డాక్టర్. బి . గోవిందరాజులు, ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చరు వేంకటేశ్వర్లు, ఎ.పి. ఎం .ఐ.పి, ప్రాజెక్ట్ డైరెక్టరు పి.వి. రమణ, డిప్యూటి డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ జమదగ్ని, కోస్తా మండలంసహాయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ డి. వెంకట స్వామి, డాక్టర్.సి వెంకటరమణ పాల్గొన్నారు. డాక్టర్ డి.వెంకటస్వామి స్వాగత ఉపన్యాసం చేశారు. వెంకటేశ్వర్లు ఉద్యాన శాఖ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని కోత అనంతరం పండ్ల తోటల్లో నష్టాన్ని అంచనా వేయడం, తద్వారా నివారణ చర్యలు చేపట్టడం గురించి చర్యలు చేపట్టాలని తెలిపారు. మిరపలో సాగు ఖర్చు తగ్గించడం, టమాట, మిరపలో ప్రాసెసింగ్ టెక్నాలజీ పెంపొందిచడం పై శ్రద్ధ చూపాలని కోరారు. అరటి దిగుబడిలో రాయలసీమ ప్రాంతం కోస్తా జిల్లాలతో చూస్తే ముందు ఉందని, దానికిగల కారణాలు వెతకాలని కోరారు. విశ్వావిద్యాలయ ఉపకులపతి డాక్టర్. కె. గోపాల్ తరుపున డాక్టర్ బి. శ్రీనివాసులు రిజిస్ట్రార్, మాట్లాడు తూ రాష్ట్రంలో విదేశీ పంటల సాగుపై ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలని కోరారు. ఈ విదేశీ పంటల సాగు పై రైతులకు కావల్సిన సూచనలను, సలహాలను శాస్త్ర వేత్తలు అందించాలని ఆయిల్ పామ్ లో అంతర పంటగా సాగు చేసే కోకో లో కొత్తరకాలను తీసుకురా వాలని సూచించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ను ఆధారం గా చేసుకుని పురుగు, తెగుళ్ళు ఉధృతిని ఉనికిని కనిపెట్టడం, అవసరాన్ని బట్టి ఎరువులు, నీటి యాజమాన్యం చేపట్టాలని కోరారు. వాలాతా వరణ మార్పుల కు అనుగుణంగా పంటలలో పురుగు మరియు తెగుళ్ళు ఉనికిని ముందుగా సూచించడంపై పరిశోధనలను విస్తారంగా చేపట్టాలని కోరారు. ఎ.పి.యమ్. ఐ. పి , ప్రోజెక్ట్ డైరెక్టర్, పి .వి.రమణ మాట్లాడుతూ జిల్లాల వారీగా చేపట్టాల్సిన కొత్త టెక్నాలజిలను రైతులకు సూచించాలని కోరారు.

# కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటాలు చేయాలి







**ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమసుందర్ పిలుపు**

**తాడేపల్లిగూడెం , పెన్ పవర్, మే 20 :** కార్మిక హక్కుల పరిరక్షణ కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పిలువు ఇచ్చారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పలు కార్మిక కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు , గేటు సమావేశాలు జరిగాయి. మునిసిపల్ కార్యాలయం, సి.డబ్ల్యు.సి., ఎస్. డబ్ల్యు.సి. గోడౌన్ల వద్ద, మార్కెట్ యార్డ్ వద్ద, ఏరియా ఆసుపత్రి ఆస్పత్రి గేటు వద్ద కార్మికులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, సెంట్రల్ పే కమిషన్ ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, కనీసవేతనం 35 వేలు ఇవ్వాలనీ, ఉద్యోగాలను అక్రమంగా తొలగించే విధానాలను విడనాడాలని , కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని, విశాఖ ఉక్కు కార్మికుల సమస్యలను పరిష్కరించి వారి సమ్మెను నివారించాలని, ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలని డిమాండ్ చేస్తూ కార్మికులు నినాదాలు చేశారు. వివిధ సమావేశాల్లో ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ మే 20 న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జూలై 9 వ తేదీకి వాయిదా వేయడానికి దారితీసిన పరిస్థితులను వివరించారు. తర్వాతి సమ్మెకు సన్నద్ధం కావాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమసుందర్ మాట్లాడుతూ సార్వత్రిక సమ్మె జరుపనున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా పారిశ్రామిక సంస్థల్లో ఉద్యోగుల తొలగింపు విచ్చలవిడిగా సాగుతోందని , ప్రభుత్వాలు , యాజమాన్యాలు కార్మికుల , ఉద్యోగుల హక్కులను హరిస్తున్నాయని అన్నారు. సైనిక చర్యల నేపథ్యంలో సమ్మెను వాయిదా వేసినప్పటికీ , వివిధ రూపాలలో నిరసనలు , పోరాటాలు కొనసాగి స్తామని అన్నారు. పాక్ పై యుద్ధం పేరుతో ఒక వర్గం ప్రజలపై , జమ్మూ కశ్మీర్ ప్రజలపై దేశంలో సాగుతున్న విద్వేష ప్రచారాన్ని కార్మికవర్గం సహించదని, ప్రజలు ఐక్యంగా ఉండాల్సిన సమయంలో తోటి భారతీయులపై సాగుతున్న దుష్ప్రచారాన్ని తాము ఖండిస్తున్నామని అన్నారు.
ఏఐటీయూసీ ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు, ఏరియా కమిటీ కార్యదర్శి మందలపర్తి హరీష్, జిల్లా వ్యవసాయ కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త పీఆర్సీ ప్రకటించాలని, కనీసవేతనం 35 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ఏఐటీయూసీ నాయకులు అల్లం కుమారస్వామి, ముత్యాల జగదీష్ , కొడమంచిలి చంద్రరావు, కాటమరాజు, తాడికొండ కనకలక్ష్మి, మండేలా జయసుధ , పెనుమాక విజయ , ఏడిద నాని, కళింగ శ్రీనివాస్, రౌతు రాజేష్,
గోకా నాగరాజు, తాడేపల్లి వెంకటేష్ , యాలం నర్సన్న,, గాది అంజిబాబు, చర్ల వెంకటరెడ్డి, పాతాల నాగేశ్వరరావు, కుంచె ఏడుకొండల , మాదాసు సత్యనారాయణ, యాండ్ర ఆంజనేయులు, జయరాజు, మేళం నాగరాజు, విజయకుమార్, ప్రసాద్ అంబేద్కర్, సాగర్ బాబు , కుమారి, సురేష్, రాంబాబు , నాగేంద్ర, తదితరులు నాయకత్వం వహించారు.

## ఆలమూరు మండల టిడిపి ప్రధాన కార్యదర్శిగా సలాది

**ఆలమూరు, పెన్ పవర్ మే 20:** కొత్తపేట నియోజకవర్గంలోని ఆలమూరు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా పెదపళ్ల గ్రామానికి చెందిన సలాది నాగేశ్వరరావును ఎంపిక చేశారు. ఈ మేరకు సోమవారం కొత్తపేటలో జరిగిన తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కార్యక కార్యకర్తల హర్షధ్వానాలు మధ్య ప్రకటించారు. ఈయన తెలుగుదేశం పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తూ వస్తున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే బండారుకు వీర విధేయుడుగా గుర్తింపు పొందారు. అందుకనే సలాదికి ఈ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆయన పదవిని చేపడుతున్నారు. ఈ సందర్భంగా సలాది మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే బండారుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం పని చేస్తానని పార్టీ క్యాడర్ కు హామీ ఇచ్చారు.



## జనసేనలో చేరిక



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, మే 20:** స్థానిక శాసనసభ్యులు క్యాంపు కార్యాలయం వద్ద మాధవరం దళిత సంఘ యువ నాయకులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేన పార్టీ లోకి చేరారు. అడపా ప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 15, కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు.

## అధికారుల ఒత్తిడితో మృతి చెందిన అంగన్వాడి కార్యకర్త సత్యవతి కుటుంబానికి న్యాయం చెయ్యాలి..






**అడ్డతీగల ,పెన్ పవర్ మే20:** అడ్డతీగలమండలం గొంటువానిపాలెం సెక్టార్ కి సంబంధించిన లంగుపర్తి గ్రామం అంగనవాడి కార్యకర్తగా పనిచేస్తున్న సత్యవతి ఈనెల 9వ తారీఖున తన సెంటర్ లో మధ్యాహ్నం విధులను ముగించుకొని, అంగన్వాడి సెక్టర్ సూపర్వైజర్
వీరమ్మ ఆదేశాల మేరకు గ్రామ పెద్దల సంతకాల సేకరణ కొరకు వెల్లిన సందర్భంగా లో ఆ సమయంలో సూపర్వైజర్ వీరమ్మ సెంటర్ విజిట్ కి వెళ్లగా సెంటర్ మూసివేసారని ఫోటో తీసి ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయడంతో సిడిపిఓ కార్యాలయానికి రావాలని ఆదేశాలు రావడంతో ఆమె వెంటనే సిడిపిఓ కార్యాలయానికి వెళ్ళగా, సూపర్వైజర్ వీరమ్మ తీవ్రంగా తిట్టడంతో మనోవేదనకు గురై ఆమె ఎల్లవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు చికిత్స చేయించుకొని, ఇంటికి వెళ్లడం జరిగిందని, తెల్లవారేసరికి సత్యవతి మృతి చెంది ఉన్నదని కుటుంబ సభ్యులు తెలపగా ఆమె సత్యవతి మృతికి కార్యాలయం సిబ్బంది, సూపర్వైజర్ వీరమ్మే కారణమని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మట్ల.వాణిశ్రీ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శాంతి రాజు, అంగన్వాడి హెల్పర్స్ అండ్ యూనియన్ జిల్లా కార్యదర్శి
బి.నిర్మల అన్నారు.అధికారుల వేధింపులతో సత్యవతి మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకొని తక్షణమే సస్పెండ్ చేయాలని, సత్యవతి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో అడ్డతీగల తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో అడ్డతీగల తహసిల్దార్ డి.టి. ఆందోళన వద్దకు వచ్చి సానుకూలంగా స్పందించి వినతి పత్రాన్ని తీసుకున్నారు. ఈ సమస్యను పై అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించడం జరిగింది. సత్యవతి కుటుంబానికి సరైన న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని, సిఐటియు యూనియన్ హెచ్చరిక చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి.సిరిమల్లి రెడ్డి. జిల్లా కమిటీ సభ్యులు తీగల. శ్రీనివాస్, సంఘీభావంగా మాట్లాడి మద్దతు తెలియజేశారు. ఈ ఆందోళన కార్యక్రమం అడ్డతీగల ప్రాజెక్టు అధ్యక్షురాలు జి.బేబీ రాణి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో అడ్డతీగల ప్రాజెక్టు అధ్యక్షురాలు జి .బేబీ రాణి,
జి,పార్వతి, లక్ష్మి, ఎం,చంద్రకళ, ఆశ వర్కర్ యూనియన్ జిల్లా నాయకురాలు పి.లింగామని తదితర అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు.

## ఆలమూరు మండల టిడిపి అధ్యక్షునిగా సత్తిబాబు



**ఆలమూరు, పెన్ పవర్,మే 20:** కొత్తపేట నియోజక వర్గం ఆల మూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా అమలాపురం పార్లమెంటు తెలుగు రైతు అధికార ప్రతినిధి ఈదల సత్తిబాబును నియమించారు. తెలుగుదేశం పార్టీకి సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు నమ్మకస్తుడుగా ఉంటారు. అలాగే లంక గ్రామాలకు పార్టీ ఇన్చార్జిగా ఉంటూ అనేక పార్టీ సమస్య లను చాకచక్యంగా పరిష్కరిస్తూ వస్తున్నారు. వివాదరహితుడిగా ఉంటూ అన్ని వర్గాల వారిని కలుపుకొని పోవడంలో సత్తిబాబు దిట్ట. అందుకనే ఆయనకు కీలకమైన ఈ పదవిని అప్పగించారు. ఇప్పటివరకు మండల టిడిపి అధ్యక్షులుగా ఉన్న మెర్ల గోపాల స్వామి ఇటీవల జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పదవిని చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆలమూరుకు చెందిన సత్తిబాబుకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి నిరంతరం పని చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి కారకులైన ఎమ్మెల్యే సత్యానందరావుకు ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పిల్లలకు ఆంగ్ల కథలపై గ్రంధాలయంలో అవగాహన



**పెనుమంట్ర,పెన్ పవర్, మే-20:** మండలంలోని మార్టేరు శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయురాలు పి. సువర్ణ గౌరి మంగళవారం పిల్లలకు ఇంగ్లీష్ సంబంధించి విషయాలు, ఇంగ్లీష్ సంబంధించిన కథలు, మోరల్ స్టోరీస్ చెప్పడం జరిగిందని గ్రంధ పాలకులు పి.టి. యస్. కూమార్ తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలు చేత కూమార్ (చదవడం అంటే మాకెంతో ఇష్టం కార్యక్రమం), పిల్లల చేత దేశా నాయకులు చరిత్రలు, మరియు కథలు గ్రంధాలయంలో చదివించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో పిల్లలు
యమ్.మనోహర్, కె.ఝాన్సీ, టి. ధిరజ్, యస్, జస్మిత, టి. తరుణ్ కూమార్, జి. విమోగ్, టీ. లోకేష్ పార్ధు, యమ్ కార్తీక్ స్వరప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని మానవత మరియు గ్రంధాలయసిబ్బంది కలిసి నిర్వహించడం జరిగిందన్నారు.


## జీతాల బకాయిలు చెల్లించాలని వినతి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్,మే 20:** వైయస్సార్ యూనివర్సిటీ లో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందికి జీతాల బకాయిలు విడుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కు, భవన నిర్మాణ కార్మిక సమాఖ్య చైర్మన్ వలవల బాబ్జికి వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం సహకరించాలని కార్మిక సంఘ నాయకులు కోరారు.దఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు డి.సోమసుందర్, ఓ.వి.రాజు, మందలపర్తి హరీష్ , కళింగ లక్ష్మణరావు , తాడికొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు .

# త్యాగం చేసిన వారికి సాముచిత స్థానం






● మినీ మహానాడులో ఎమ్మెల్యే పితాని

**పెనుమంట్ర,పెన్ పవర్, మే-20:**టిడిపికి త్యాగాలు చేసిన వారిని గుర్తించి భవిష్యత్తులో వారికి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆచంట నియోజకవర్గం టిడిపి మినీ మహానాడు కార్యక్రమం స్థానిక కమ్మ సంఘం కళ్యాణ మండపంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కష్టపడిన వారికి గుర్తింపు నిస్తుందని రాబోయే కాలంలో యువతకు మరింత ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. గత వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అరాచకం కొనసాగితే తమ ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఆయన అన్నారు. గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, జే బ్రాండ్స్ ద్వారా ఖజానాను లూటీ చేశారని దీనిపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందని అన్నారు. రాష్ట్రం ప్రభుత్వానికి ఆర్థిక కష్టాలు ఉన్నా సంక్షేమ కార్యక్రమాలు ఎక్కడ ఆపకుండా కొనసాగిస్తుందని త్వరలోనే విద్యార్థులకు తల్లికి వందనం, రైతులకు భరోసా సాయం అందించడానికి అన్ని ఏర్పాట్లు చేసిందని అన్నారు. అర్హులైన వారికి ఇళ్ళ పట్టాలు పంపిణీ చేయటమే కాకుండా వారికి ఇల్లు కట్టించే బాధ్యతను కూడా తమ ప్రభుత్వం తీసుకుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూటమినేతలు పూర్తి అవగాహనతో కలిసి ముందుకు వెళుతున్నారని అన్నారు. త్వరలో జరగనున్న రాష్ట్ర మహానాడు ను కూడా విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పితాని పిలుపు నిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతోనే రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగిందని వారి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీకి బీసీలు ఎల్లప్పుడూ అండగా ఉన్నారని అన్నారు. మహానాడులో ఆపరేషన్ సింధూర్లో విజయం సాధించిన జవాన్లకు అభినందనలు తెలిపారు అదే విధంగా వీరమరణం పొందిన సైనికులకు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు రుద్రరాజు వెంకటరామరాజు, ఆచంట జడ్పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, కేత మీరయ్య,తమ్మినీడి ప్రసాద్, బడేటి బ్రహ్మాజీ, నక్క శ్యామల సోని తమనంపూడి శ్రీనివాసరెడ్డి, వెలగల బుల్లి రామిరెడ్డి, చింతపల్లి రామకృష్ణ వెలిచేటి బాబు రాజేంద్రప్రసాద్ గణపతినీడి రామ్మోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రధానోపాధ్యాయులకు, పది విజేతలకు ఘన సన్మానం

**పెనుమంట్ర,పెన్ పవర్, మే-20:**మండలంలోని వెలగలేరు "శుభమస్తు కళ్యాణ మండపం" లో నరసాపురం డివిజన్ లోని 10 మండలాలు నుండి 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థాయిలో ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులకు , అదే పాఠశాల స్థాయిలో 100 నుండి 90 % వరకు ఉత్తీర్ణత సాధించిన ప్రధానోపాధ్యాయులు కు ఆర్ జే డి కాకినాడ, జిల్లా విద్యాశాఖ అధికారి భీమవరం వారి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమము మధ్యాహ్నం 2.00 గ.లకు ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి ఉంగరాల నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. కావున విద్యార్థులు, ప్రధాన ఉపాధ్యాయులు తప్పక హాజరు కావలసినదిగా కోరారు.

## ఆడపిల్లల పట్ల వివక్షతపై అవగాహన



**పెనుమంట్ర, పెన్ పవర్, మే-20:**మండల కేంద్రం పెనుమంట్ర, మార్టేరు-05,06, భట్ల మగుటూరు అంగన్వాడీ కేంద్రాల్లో
మంగళవారం కిశోరి వికాసంపై వేసవికాల శిక్షణా కార్యక్రమం లో భాగంగా బాలికలకు ఆడపిల్లల పట్ల లింగ వివక్ష, భ్రూణ హత్యలు,అసమానతలు గురించి వివరించడం జరిగిందని సిడిపిఓ అంగర కృష్ణకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో , సూపర్వైజర్ లు టీ పోచమ్మ, ఎస్ వెంకటలక్ష్మి, పి వరలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్లు రద్దు చేయాలి




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, మే 20:**లేబర్ కోడ్ లు రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ ఐ ల్యాండ్ వద్ద నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను దేశంలో ఉన్న పెట్టుబడిదారులకు, కార్పొరేట్ల కు, విదేశాల్లో ఉన్న కార్పొరేట్లకు అనుకూలంగా నరేంద్రమోడీ ప్రభుత్వం దారాదత్తం చేసే విధంగా కార్మిక చట్టాలను నాలుగు కోడ్లు గా మార్చడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లు గా కుదిస్తూ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ నిర్ణయాన్ని దేశ వ్యాప్తంగా ఉన్న కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. గత 10 ఏళ్ళు నుండి పాలకులు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తున్నప్పటికీ కూడా నరేంద్ర మోడీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఈ విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు.కార్మిక చట్టాలు ప్రభుత్వాల దయా దాక్షిణ్యాలతో వచ్చినవి కావని,కార్మికులు పోరాటాలు చేసి తమ హక్కులను సాధించుకొని చట్టాలు రూపంలో చేసుకున్న ఈ చట్టాలను ఊడిగం చేసే విధంగా మీరు వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకిం చాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మె తాత్కాలంగా వాయిదా వేస్తూ జూలై 9 వ తేదీకి మార్చడం జరిగిందని అన్నారు.ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని వెంటనే సమ్మెను విరమించే విధంగా గాని, చట్టాలు మార్చే విధంగా కాకుండా కార్మికులకు అనుకూలంగా చట్టాలు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోకపోతే రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు,ఉద్యోగులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగు బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, సిఐటియు పట్టణ అధ్యక్షులు జవ్వాది శ్రీను, సత్తి కోదండ రామిరెడ్డి, దేశంశెట్టి సతీష్,
అయినాల సత్యనారాయణ,
నరమాల కృష్ణ, పట్టణ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## సంకడా సచివాలయంలో రికార్డుల పరిశీలన





**హ్యాబిటేషన్ల లిస్ట్ కలెక్టర్‌కి సమర్పణకు సూచన**
**ఎంపీడీవో ఉమామహేశ్వరరావు**

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మే 20:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం సంకడా సచివాలయాన్ని మంగళవారం సందర్శించిన ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అక్కడ ఉన్న అన్ని రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా రికార్డులు ఇంకా పూర్తిగా అప్డేట్ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం, 250 మందికి పైగా జనాభా ఉన్న హ్యాబిటేషన్ల జాబితాను సిద్ధం చేసి కలెక్టర్‌కు సమర్పించాల్సిందిగా సూచనలొచ్చాయని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు.ఈ జాబితా ఆధారంగా మినీ ఎస్‌డబ్ల్యూపీసీలు మంజూరు చేయనున్నట్టు తెలిపారు.సంకడా సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన ఎస్‌డబ్ల్యూపీసీ ప్రదేశాన్ని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారని, అక్కడ డ్రై అండ్ వెడ్ వేస్ట్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని సూచించినట్లు తెలిపారు.అలాగే వర్మీ కంపోస్ట్ ఉత్పత్తిని కూడా నాణ్యత పరంగా మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా పని చేసి పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో అన్నారు.

## ఎన్టీఆర్ కలలు నిజం చేద్దాం.



**అరకులోయలో మినీ మహానాడు వేడుకలు.**

**అరకులోయ పెన్ పవర్ 20:** నియోజకవర్గం మండల కేంద్రంలో పర్యాటక హరిత గోష్టి హెూటల్ ప్రాంగణంలో టిడిపి నియోజకవర్గం ఇన్చార్జ్ దొన్నుదొర ఆధ్వర్యంలో టిడిపి పార్లమెంటరీ స్థానిక సంస్థ గత ఎన్నికల పరిశీలకుడు హర్షవర్ధన్ అధ్యక్షతన మంగళవారం టిడిపి పార్టీ మినీ మహానాడు అంగరంగ వైభవంగా ఘనంగా టిడిపి శ్రేణులు నిర్వహించారు. టిడిపి పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రజలకు సంక్షేమ పాలన అందించే దిశగా పార్టీ బలోపేతం చేయాలని టిడిపి శ్రేణులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ యన్ టి ఆర్ కళలు నిజంచేదాం..... యన్.టి.ఆర్. ఆశయ సాధనాలను ముందుకు నడిపిద్దామన్నారు. టిడిపి పార్టీ బలోపేతం కోసం నియోజకవర్గం కార్యకర్తలు టిడిపి శ్రేణులు సమిష్టి కృషి చేయాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రలో గిరిజన ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధికి టిడిపి పార్టీ కట్టుబడి ఉందనీ. అరకులో ఇంజినీరింగ్ కళాశాల, డీ ఈడి కళాశాల కావాలని,సాగు తాగునీటి అవసరాల కోసం అరకులో మినీ రిజర్వాయర్ నిర్మించాలని, టిడిపి ప్రభుత్వం కట్టుబడివుందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధికి టిడిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని. టిడిపి ప్రభుత్వంతోనే ఏజెన్సీ రిజన్న ప్రాంతం అభివృద్ధి చెందుతుందని వారు స్పష్టం చేశారు. గిరిజనుల అభివృద్ధి అభ్యున్నతి కోసమే టిడిపి పార్టీ మహనీయుడు ఎన్టీఆర్ స్థాపించారని వారి ఆశయ సాధారణలను చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం లక్ష్యంగా నిర్మాణాత్మకంగా ఉన్నత లక్ష్యాలు సాధించే దిశగా పార్టీ కార్యకర్తలు పార్టీ నాయకులు అభిమానులు మహిళలు సమిష్టిగా కృషి చేయాలని మరింత పటిష్టంగా సమిష్టిగా టిడిపి పార్టీ కార్యక్రమాలు ముందుకు సాగించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిసిసి రాష్ట్ర చైర్మన్ శ్రవణ్ కుమార్, కోశాధికారి నాగేశ్వరరావు, సర్పంచ్ దాసు బాబు, బాబురావు, ఆరు మండలాల మండల అధ్యక్షులు మాజీ జెడ్పిటిసిలు మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు వివిధ హెూదాలో ఉన్న టిడిపి శ్రేణులు, సీనియర్ నాయకులు మహిళలు యువకులు పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కొవ్వూరులో నియోజకవర్గ మహానాడు- హాజరైన నియోజకవర్గంలోని నాయకులు





**కొవ్వూరు, పెన్ పవర్, మే 20:**కొవ్వూరు పట్టణంలోని లిటరరీ క్లబ్ లో జరిగిన కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ మహానాడును పెద్ద ఎత్తున నిర్వహించారు. నాయకులు టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణుల మృతికి సంతాపం తెలియజేసారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలపై తీర్మాణాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. తీర్మాణాలను జిల్లాస్థాయి మహానాడుకు పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పుట్టిందన్నారు. ప్రజల సంక్షేమం ఓ వైపు, రాష్ట్ర అభివృద్ధి మరోవైపుతో తనదైన ముద్ర వేసుకుంటుందన్నారు. టిడిపి సీనియర్ నాయకులు పెండ్యాల అచ్చిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నారని, అలాగే నియోజకవర్గంలో కార్యకర్తలు, అభిమానులు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.
కొవ్వూరు నియోజకవర్గ మహానాడులో టుమెన్ కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు సూరపనేని సూర్య భాస్కర రామ్మోహన్(చిన్ని), మద్దిపట్ల శివ రామకృష్ణ, నియోజకవర్గ అబ్జర్వర్, ఏఎంసి చైర్మన్, నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రీ సర్వే ప్రక్రియ జూలై 15 లోగ పూర్తిచేయండి



● జాయింట్ కలెక్టర్ డాక్టర్. ఎం. జె.అభిషేక్ గౌడ

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,మే 20:** భూములు రీ సర్వే ప్రక్రియ జూలై 15 తేది లోగ పూర్తిచేయాలని రెవిన్యూ అధికారులకు జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కార్ఫరెన్సు మందిరం నుండి 22 మండలాల రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులతో వారాంతపు రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ కార్య క్రమాలను పక్కాగా అమలు చేయాలని చెప్పారు. గ్రామసభలు నిర్వహించిన తర్వాత అందిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని, మ్యుటేషన్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. రిసర్వేలో భాగంగా సంబంధిత అధికారులు లాగిన్ అయి పెండింగ్ లేకుండా చూడాలని, ఎవరి లాగిన్ లో పెండింగ్ ఉంటె వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.గత వారం నుండి ఇప్పటివరకు నిర్వహించిన సర్వే,తీసుకున్న చర్యలపై ఆరా తీసారు.ప్రతి వారం సమీక్షకు ముందుగానే తహసిల్దార్లు సంబంధిత సిబ్బందితో సమీక్షించి సమీక్షకు పూర్తి వివరాలతో హాజరు కావాలన్నారు. రెవెన్యు సదస్సులలో అందిన విజ్ఞాపనలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.గృహనిర్మాణాలకు అందిన ధరఖాస్తులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మారు మూల ప్రాంతాలలో రేషన్ సరుకులు అందటం లేదన్న ఫిర్యాదులు అందుతున్నాయని, అదేవిధంగా డిఎంయు వాహన దారులు రేషన్ పంపిణీలో డబ్బులు కలెక్ట్ చేస్తున్నట్లు కూడా దృష్టికి వచ్చిందని, తహసిల్దార్లు నిఘా పెంచి పర్యవేక్షించాలని ఆదేశించారు. సెల్ టవర్లు పెరిగి సిగ్నల్ వ్యవస్థ మెరుగు పడినందున ప్రస్తుతం ఆఫ్ లైన్ లో ఉన్న ఎఫ్ పి లను ఆన్ లైన్ చేయాలని సూచించారు.ఈ సమావేశంలో పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్,డిఆర్ ఓ కె. పద్మలత, ఎస్డిసి ఎం. వి. ఎస్. లోకేశ్వరరావు, సర్వే సహాయ సంచాలకులు కె. దేవేంద్రుడు, 22 మండలాల తాహశీల్దారులు సర్వేయర్లు, వి ఆర్ ఓలు తదితరులు పాల్గొన్నారు.

## చలి వేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

- రస్తా కుంటుబాయి లో చలివేంద్రం ప్రారంభించిన తహసీల్దార్..



**కురుపాం, పెన్ పవర్,మే -20:**వేసవి దృష్ట్యా చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కురుపాం తాహసిల్దార్ రమణమ్మ అన్నారు. యస్ సొసైటీ ఆధ్వర్యంలో రస్తాకుంటు బాయి సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మజ్జిక చలివేంద్రాన్ని తహసీల్దార్ రమణమ్మ ప్రారంభించారు , ఆమె మాట్లాడుతూ ప్రయాణీకుల రద్దీ మరియు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రజలకు దాహం తీర్చటానికి చలి వేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయం అని ముఖ్యంగా ఈ వేసవి తీవ్రత లో శరీరంలో నీటి శాతం తక్కువ అవ్వకుండా తరచూ మంచి నీరు మజ్జిక తీసుకోవాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు. యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ మాట్లాడుతూ దాతల సహకారంతో చలి వేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వీటిని స్థానిక యువత బాధ్యతగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అరిక సునీత , మాజీ సర్పంచ్ పట్టిక మాసయ్య , పొడి పంచాయితి మాజీ సర్పంచ్ రంగా రావు , స్థానిక యువత , మహిళలు మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగుల విద్యార్థులను గుర్తింపు



**పద్మనాభం. పెన్ పవర్, మే 20 :**ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచా లకులు వారి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బడి బయట ఉన్నటువంటి 0 నుండి 18 సం.రం ల మధ్య వయస్సు కలిగిన 21 రకాల వైకల్యాలు గల 'దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు. బడిలో వారి నమోదు' కార్యక్రమంలో భాగంగా విశాఖ జిల్లా సమగ్ర శిక్షా అదనపు పథక సమన్వయాధికారి వారి ఆదేశాల ప్రకా రంగా పద్మనాభం మండలంలో కూడా ప్రత్యేక ఉపాధ్యాయుల ద్వారా మే నెల 13 వ తేదీ నుండి ఈ గుర్తింపు కార్యక్రమం ప్రారంభించబ డింది. ఈ కార్యక్రమం జరుగుతున్న తీరును సమగ్ర శిక్షా జిల్లా అదనపు పథక సమన్వయా ధికారి సిహెచ్. చంద్రశేఖర రావు పరిశీలిస్తూ, పద్మనాభం అంగన్వాడీ కేంద్ర పరిధిలో ఒకరిని కృష్ణాపురం గ్రామానికి చెందిన ఒకరిని గుర్తించి, బడిలో చేర్పించుటకు తీసుకోవలసిన చర్యలపై మండల విద్యాశాఖధికారి పి రమణ కు సూచనలు చేసారు. దివ్యాంగ విద్యార్థులకు మండల కేంద్రంలో గల భవితా కేంద్రాల ద్వారా అందజేయబడుతున్న వివిధ రకాలైన సేవలను, చదువుకోవటం వలన కలిగే ప్రయోజనాలను, ఫిజియోథెరపీ సేవలను, ప్రభుత్వం ద్వారా వచ్చే ఉపకార వేతనాలు, ట్రాన్స్ పోర్ట్, ఎస్కార్ట్, రీడర్, హెచ్ డి ఈ. గర్ల్ చైల్డ్ అలవెన్స్ లను ఇవ్వనున్నట్లు వారి తల్లిదండ్రులకు వివరించా రు . ఈ సర్వేలో ఇప్పటివరకు 5 మందిని గుర్తిం చటం జరిగింది. ఈ సర్వే జూన్ నెల 9 వ తేదీ వరకూ కూడా జరుగును.

ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా సమన్వ యాధికారిణి బి. గీత, సమగ్ర శిక్షా ఏపీ వో అప్పలనాయుడు, ప్రత్యేక ఉపాధ్యాయులు హెచ్. రాజ్ కుమార్. ఎం. శ్రీనివాసరావులు తది తరులు పాల్గొన్నారు.

## టిటిడి ఆధ్వర్యంలో హనుమజ్జయంతి ఏర్పాట్లు...!

ప్రోగ్రాం అసిస్టెంట్ చల్లా సత్యనారాయణ



**కొయ్యూరు పెన్ పవర్ మే 20 :** తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో హనుమజ్జయంతి వేడుకలకు పలు వేదికలను సిద్ధం చేసినట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ చల్లా సత్యనారాయణ తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో హనుమజ్జయంతి వేదికల వివరాలను ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈనెల 22న హనుమజ్జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం నుండి స్వామివారికి అభిషేకాలు ప్రత్యేక పూజలతో పాటు ధార్మిక ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మేరకు అల్లూరి అనకాపల్లి విశాఖ జిల్లాలో ఈ దిగువ వేదికలలో హనుమజ్జయంతి ఉత్సవాన్ని ఆయా ధర్మాచార్యులు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీలో గల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో రామరాజు దళపతి ఆధ్వర్యంలోనూ, అనంతగిరి మండలం మేడపర్తి గ్రామ ఆంజనేయ స్వామి ఆలయంలో ధర్మాచారి వంశీ తేజ ఆధ్వర్యంలోనూ, అనకాపల్లి జిల్లా దేవరపల్లి మండలం కాశీనగరం గ్రామంలో గల ఆంజనేయ స్వామి ఆలయంలో అక్కు నాయుడు ఆధ్వర్యంలోనూ , అనకాపల్లి జిల్లా సీతానగరం ఎస్సీ కాలనీలో గల ఆంజనేయ స్వామి ఆలయంలో రావాడ గణేష్ ఆధ్వర్యంలోను, విశాఖ అర్బన్ మండలం ఇసుకతోట శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో జిల్లా ధార్మిక కమిటీ ప్రతినిధి శ్రీనివాస్ ఆధ్వర్యంలోను, అలాగే పెందుర్తి మండలం పద్మనాభ నగర్ బంటాకాలనీ 92 వ వార్డులో గల శ్రీఅభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ధర్మాచారి సిహెచ్ వెంకట్రావు ఆధ్వర్యంలో హనుమత్ జయంతి వేడుకలను తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# రండి...జంఝావతిని సాధిద్దాం...!

- జంఝావతి సాధన సమితిలో పాలు పంచుకోండి
- రైతులు, రైతు మిత్రులు, రైతు, ప్రజా, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలకు ఆహ్వానం..
- నేడు పార్వతీపురంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి సర్వసభ్య సమావేశం
- ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతి కృష్ణమూర్తి నాయుడు..



**కురుపాం / పార్వతీపురం:పెన్ పవర్, మే -20.** అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యం వెరశి దశాబ్దాలుగా రైతులకు అందని ద్రాక్షలా ఊరిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లాలోని కొమరాడ మండలంలో గల జంఝావతి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో సాధించుకుందామని, దానికోసం ఏర్పాటు చేస్తున్న జంఝావతి సాధన సమితిలో పాల్గొనాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతి కృష్ణమూర్తి నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం పార్వతీపురంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు జాగారపు ఈశ్వర ప్రసాద్, జిల్లా అధ్యక్షులు మంగల దాలి నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి బలగ శంకరరావు తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన బుధవారం ఉదయం 10 గంటలకు పార్వతీపురం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఏపీ ఎన్జీవో హోంలో ఉత్తరాంధ్రాక్షర్యుల పరిరక్షణ సమితి సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో తొలుత జంఝావతి సాధన సమితిని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే జంఝావతి సాధన కోసం తమ సమితి పలు కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఇప్పుడు రైతులు, రైతు మిత్రులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పాటు మేధావులు పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, యువత, మహిళా ప్రతినిధులతో జంఝావతి సాధన సమితి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దాని ద్వారా భవిష్యత్ కార్యాచరణ చేపట్టి జంఝావతి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో సాధించడం జరుగుతుందన్నారు. జంఝావతి ప్రాజెక్టు గూర్చి అడిగే నాథుడు లేకపోవడంతో రాజకీయ పార్టీలు ఎన్నికల హామీగా జంఝావతిని ఉపయోగించుకుంటున్నాయన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో, కేంద్రంలో, ఒడిస్సాలో సానుకూల ప్రభుత్వాలు ఉండటంతో జంఝావతిని సాధించవచ్చు అన్నారు. దానికి అన్ని వర్గాల సహాయ సహకారాలతో సమితి అవసరమన్నారు. అనంతరం ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వార్షిక సర్వసభ్య సమావేశంలో రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి, మండల స్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. అలాగే ఆయా కార్యవర్గాల కార్యాచరణను చర్చించి తీర్మానం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాల్లో ఉన్న ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే జంఝావతి సాధన సమితిలో పాలు పంచుకోవాలనే ఆసక్తి ఉన్నవారు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. వివరాలకు 8555913959 కు సంప్రదించాలన్నారు.

## నూతన డిప్యూటీ మేయరుగా దల్లి గోవిందరాజు

విశాఖ జాయింట్ కలెక్టర్, అదనపు మెజిస్ట్రేట్ ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మయూర్ అశోక్





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మే 20 :**మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ గా కార్పొరేటర్ దల్లి గోవిందరాజు ఎన్ని కయ్యారని విశాఖ జాయింట్ కలెక్టర్, అదనపు మెజిస్ట్రేట్, ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మయూ ర్ అశోక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నిక ల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం మహా విశాఖ పట్నం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నిక మంగళవారం ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వ హించి డిప్యూటీ మేయర్ ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మాట్లాడుతూ మే 19వ తేదీ డిప్యూటీ మేయర్ ఎన్నికకు ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం జివి ఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో సభ్యులు సమావేశం అయినప్పటికీ క్వారమ్ లేకపోవడం వలన డిప్యూటీ మేయర్ ఎన్నిక మే 20వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించేందుకు వాయిదా వేసామని తెలిపారు. 20వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశ మందిరం లో ప్రత్యేక సమావేశం నిర్వహించి డిప్యూటీ మేయర్ ను ఎన్నుకోవడం జరిగిందన్నారు.జీవీఎంసీ డిప్యూ టీ మేయర్ గా దల్లి గోవిందరాజు ఎన్నికయ్యా రని తెలిపారు. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం జీవీఎంసీ మేయర్ ఎన్నికలకు సంబం ధించి కూటమి అభ్యర్థిగా బి-ఫారమ్ టికెట్ 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరాజు సమర్పించారని, దల్లి గోవిందరాజు ను డిప్యూటీ మేయరు అభ్యర్థిగా విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు పి.జి.వి.ఆర్ నాయుడు గణబాబు ప్రతిపాదించగా, ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు బలపరిచారని, ఎక్స్ అఫీషియో సభ్యు లు, కార్పొరేటర్లు మొత్తం 59 మంది హాజరు కాగా డిప్యూటీ మేయర్ ఎన్నికకు సరిపోయిన క్వారమ్ ఉన్నందున మరో అభ్యర్థి పోటీలో లేనందున డిప్యూటీ మేయర్ గా దల్లి గోవిం దరాజు ఎన్నికైనట్లు ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మయూర్ అశోక్ ప్రకటించారు.అనంతరం డిప్యూటీ మేయరు గా దల్లి గోవిందరాజు చే ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి ప్రమాణా స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కూటమి శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామక్రిష్ణ, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీ క్రిష్ణ శ్రీనివాస్ యాదవ్, విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేష్ బాబు, పి.గణబాబు, గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, కార్పొరేటర్లు, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు, అధి కారులు, సిబ్బంది నూతన డిప్యూటీ మేయర్ కు పుష్ప గుచ్ఛాలు అందించి ప్రత్యేక అభినం దనలు తెలిపారు

## 13 లక్షల నిధుల తో పాఠశాలభవన నిర్మాణం వేగవంతం చేయాలి



పాఠశాల యాజమాన్య కమిటీకి ఎంఈఓ నాగభూషణం సూచన

**కొయ్యూరు, పెన్ పవర్ మే 20:**
మండలంలోని నూక రాయి తోట ఎంపీపీఎస్ పాఠశాల భవన అదనపు తరగతి గది నిర్మాణానికి రూ. 13 లక్షల ఎస్ ఎస్ ఏ నిధులు మంజూరైనందున పాఠశాల భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలని యాజమాన్య కమిటీకి ఎంఈఓ నాగభూషణం సూచించారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులతో కలిసి ఆయన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- పాఠశాల భవన నిర్మాణాన్ని, వేగవంతంగా, నాణ్యతగా పూర్తిచేయాలని ఆయన కోరారు. దీనికి సకాలంలో నాణ్యతగా పూర్తి చేస్తామని కమిటీ అంగీకరించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ వంతల రమణ, వైస్ చైర్మన్ పాండు జ్యోతి, సిఆర్పి పరమేష్ పలువురు కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నియోజకవర్గం లో మినీ మహానాడు.





**గుమ్మలక్ష్మీపురం పెన్ పవర్ మే 20:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి ప్రతి పేదవాని కుటుంబానికి సంక్షేమ పథకాల అమలు చేయడమే కూటమి యొక్క లక్ష్యమని ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు.

మంగళవారం నాడు గుమ్మలక్ష్మీపురంలో శాసనసభ్యులు తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో కురుపాం నియోజకవర్గ మినీ మహానాడు పండుగ వాతావరణం నిర్వహించారు. ముందుగా స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడు,గుడ్డ, నీడ అందించాలని ఆశయంతో ఆనాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారు. పేద వర్గాల కోసం తెలుగుదేశం పార్టీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసాడని ఆమె అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజల కోసం నిరంతరం పరితపించే ఏకైక నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు. అన్న నందమూరి తారక రామారావు ఆశయాలతో తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతుందని, కార్యకర్తల సంక్షేమ కోసం ఆలోచించే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని, స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకొని మే 27. 28.29 తేదీలలో రాష్ట్ర స్థాయి మహానాడు నిర్వహించడం, నియోజకవర్గ మరియు జిల్లాస్థాయిలో మినీ మహానాడు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. నేను టిడిపి కార్యకర్తను అని గర్వంగా చెప్పుకునే పార్టీ తెలుగుదేశం పార్టీ అని అటువంటి తెలుగుదేశం పార్టీలో ఉంటూ ప్రజలకు సేవ చేయడం మనందరి అదృష్టమని తెలిపారు. మినీ మహానాడులో నియోజకవర్గం పరిధిలోని 14 అంశాలను తీర్మానం చేశారు. కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ పరిశీలకులు.ఆరేటి మహేష్ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారాని ఆమె అన్నారు.

## చోరీ సొత్తు రికవరీ మేళ, 81 మంది నేరస్థుల అరెస్ట్

రూ. 45,78,580/- విలువైన ఆస్తిని స్వాధీనం



**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విశాఖపట్నం, మే 20 :**ఏప్రిల్-2025లో, విశాఖపట్నం నగరంలో వివిధ ఆస్తి నేరాల విభాగాల కింద మొత్తం 123 ఆస్తి నేరాల కేసులు నమోదయ్యాయి. విశాఖపట్నం మెట్రోపాలిటన్ నగర పోలీసు కమిషనర్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ సూచనల మేరకు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు మరియు బృందాలు సాంకేతిక పద్ధతులను ఉపయోగిం చి, అన్ని కోణాల నుండి కేసులను దర్యాప్తు చేశాయి, ఏప్రిల్-2025లో పోలీసు కమిషనర్ సమర్థవంతమైన మార్గదర్శకత్వంలో మరియు డిసిసి (నేరాలు) పర్యవేక్షణలో 98 కేసులను గుర్తించాయి, వివిధ విభాగాలలో 81 మంది నేరస్థులను అరెస్టు చేశాయి మరియు రూ. 45,78,580/- విలువైన ఆస్తిని స్వాధీనం చేసుకున్నాయి. పైన పేర్కొన్న ఆస్తితో పాటు, రూ. 54,75,000/- విలువైన 380 మొబైల్ ఫోన్లు (అంటే 15 దొంగిలించబడిన మొబైల్స్ మరియు 365 తప్పిపోయిన మొబైల్స్) కూడా స్వాధీనం చేసుకున్నాయి. మొత్తం రూ. 1,00,53,580/- విలువైన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు.గుర్తించబడిన 98 కేసుల్లో, 1 దోపిడీ కేసు, 5 పగటిపూట హెచ్‌బి కేసులు, 5 రాత్రిపూట హెచ్‌బి కేసులు, 10 స్నాచింగ్ కేసులు, 54 మోటార్ సైకిల్ దొంగతనం కేసులు మరియు మిగిలిన 23 సాధారణ దొంగతనాలు కనుగొనబడ్డాయి.

## డిప్యూటీ మేయర్ కు గంటా అభినందనలు



**,స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం మే 20:**
డిప్యూటీ మేయర్ గా ఎన్నికైన దల్లి గోవింద రెడ్డిని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందించారు. జనసేన తరపున 62 వ వార్డు నుంచి గెలుపొందిన గోవిందరెడ్డి మంగళవారం కౌన్సిల్ హాల్లో జరిగిన ఓటింగ్ లో విజయం సాధించిన విషయం విదితమే. ఎన్నిక ప్రక్రియ పూ ర్తయిన తర్వాత తన వద్దకు వచ్చి కృతజ్ఞతలు చెప్పిన గోవిందరెడ్డికి ఈ సందర్భంగా గంటా శుభాభినందనలు తెలుపుతూ,జీవీఎంసీ అభి వృద్ధికి కృషి చేసి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

# చంద్రబాబు విజన్ కు దేశమంతా హారతులు






- లోకేష్స్ఫూర్తితో కోటి సభ్యత్వాల మార్కును సాధించడం రాజకీయ చరిత్రలో అరుదైన అంశం
- నేను చంద్రబాబు ప్రొడక్ట్.అలా చెప్పుకోవడానికి గర్వపడతా
- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

**భిమిలి, పెన్ పవర్, మే 20 :**చంద్రబాబు నాయుడి ప్రోత్సాహంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన నేను ఆయన ప్రొడక్ట్ అని చెప్పుకోవడానికి గర్వపడతాను" అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. పాలనా సంస్కరణలు, అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచిన చంద్రబా బు విజన్ కు దేశమంతా హారతులు పడుతు న్నారని పేర్కొన్నారు. ఢిల్లీ, బెంగళూరు, ముంబ యి, చెన్నై ఎక్కడకు వెళ్లినా.. చంద్రబాబు లాంటి విజనరీ లీడర్ ఉండడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల అదృష్టమని అక్కడి మిత్రులు చెబుతుంటారని అన్నారు. మధురవాడ వి కన్వెన్షన్ లో మంగళవారం జరిగిన భీమిలి నియోజకవర్గం మినీ మహానాడులో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలను ఎంతగానో ఇష్టపడతానని, పేద ప్రజలకు సంక్షేమాన్ని.. మహిళలకు ఆస్తి హక్కు, సమాన అవకాశాలు కల్పించిన యుగపురుషుడని కీర్తించారు. ప్రపం చంలోనే కార్యకర్తలకు సంక్షేమ నిధి ఏర్పాటు చేసిన మొట్టమొదటి రాజకీయ పార్టీ టీడీపీ అన్నారు. యువ నాయకుడు లోకేష్ ఇచ్చిన స్ఫూర్తితో కోటి సభ్యత్వాల మార్కును సాధించడం రాజకీయ చరిత్రలో అరుదైన అంశమని తెలిపారు. లక్ష సభ్యత్వాలతో రాష్ట్రంలో టాప్ 10 లో భీమిలి కూడా ఉండడం వెనుక గంటా రవితేజ కృషి ఎంతో ఉందని ప్రశంసించారు. అత్యధిక మెజారిటీ ఇచ్చిన భీమిలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. అనంత పద్మనాభస్వామి ఆలయానికి ఘాట్ రోడ్డు నిర్మాణం.. సింహాచలం దేవస్థానం నిర్మాణాల క్రమబద్ధీకరణ.. వంటి దీర్ఘకాలిక అంశాలను పరిష్కరిస్తానని తెలిపారు. అప్పులతో రాష్ట్రాన్ని అప్పజెప్పినప్పటికీ.. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను ప్రాధాన్య క్రమంలో నెరవేరుస్తూ వస్తున్నామని గంటా చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల భర్తీలో న్యాయం చేస్తామన్నారు. ఒక కార్యకర్తకు ఒక పదవి.. వంటి నిబంధనలను అనుసరించి ఎంపిక చేసిన కొత్త కమిటీలను తొందర్లోనే ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. రూ. 2 వేల పెన్షన్ ను రూ. 3 వేలు చేయడానికి వైసీపీ ప్రభుత్వం అయిదేళ్ల సుదీర్ఘ సమయాన్ని తీసుకుందని, కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 3 వేల పెన్షన్ ను రూ. 4 వేలు చేసిందన్న విషయాన్ని గుర్తు పెట్టుకుని మాట్లాడాలని ఆ పార్టీ నాయకులకు సలహా ఇచ్చారు.యువ నాయకుడు గంటా రవితేజ మాట్లాడుతూ టీసీ ఎస్, గూగుల్, అదానీ వంటి ప్రపంచ ప్రఖ్యాత సాఫ్ట్ వేర్ సంస్థలను భీమిలి నియోజకవర్గానికి తీసుకు వస్తున్న ఐటీ శాఖ మంత్రి లోకేష్.. ఆ సంస్థల ఉద్యోగాల్లో స్థానిక యువతకు ప్రాధాన్య మిచ్చేలా చూడాలని కోరారు. యువత భవిష్య త్ కోసం నిరంతరం ఆలోచించే లోకేష్ నాయక త్వంలో పని చేయడం అదృష్టమన్నారు. పార్టీ పరిశీలకుడైన డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ మాట్లాడుతూ తెలుగుదేశానికి భీమిలి కంచుకో టని, లక్షకు పైగా సభ్యత్వాలు నమోదు చేయడ మనేది సామాన్యమైన విషయం కాదన్నారు. 6 వ వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, కార్పొరేట ర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, పి.వి.నరసింహం, మొల్లి హేమలత, పిల్లా మంగమ్మ, గంటా అప్పలకొండ, లొడగల అప్పారావు, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, డి.ఎ.ఎన్.రాజు, కోరాడ రమణ, బి.ఆర్.బి. నాయుడు, జీవన్ కుమార్, గాడు అప్పలనా యుడు, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ సప్లై డైరెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నేత గొర్లే వీర వెంకట్



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మే 20:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ శివదత్ ను జనసేన పార్టీ జీకే వీధి మండల నేత గొర్లే వీరవెంకట్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేషన్ వ్యవస్థలో తలెత్తుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.రేషన్ వెన్ల రద్దు శుభపరిమాణం అని తెలిపారు.ఈ కేవైసీ ప్రక్రియ మా ప్రాతంలో వేగవంతంగా మరియు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, రేషన్ కార్డుల మార్పులపై జరుగుతున్న అవకతవకలను ఆపడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ అంశాలను ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అందుకు సివిల్ సప్లై డైరెక్టర్ శివ దత్ సానుకూలంగా స్పందించారు అని వీర వెంకట్ మీడియాకు తెలిపారు.

## పెంటకోట సముద్రంలో గల్లంతయిన విద్యార్థులు మృతదేహాలభ్యం





**పాయకరావుపేట పెన్ పవర్ మే 21 :** అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పెంటకోట సముద్రం లో గల్లంతయిన విద్యార్థులు మృతదేహాలు లభ్యమైనట్లు పాయకరావుపేట సీఐ అప్పన్న పేర్కొన్నారు. ఈ మేరకు వారు తెలిపిన వివరాలు ప్రకారం పాయకరావుపేట రాజీవ్ నగర్ కాలనీలో ఒకరి మెచ్యూర్ ఫంక్షన్ కు విచ్చేసిన వారు సముద్ర స్నానాలు ఆచరించుటకు పెంటకోట సముద్రం వద్దకు కుటుంబాలతో కలిసి వెళ్లినట్లు సుడిగాలి కెరటం ఒకటి కుటుంబ సభ్యులు చూస్తుండగానే దురదృష్టవశాత్తు లోపలికి ఒకరి తరువాత ఒకరు వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా కాకినాడ జిల్లా రాజువొమ్మంగి గ్రామానికి చెందిన విద్యార్థి పిల్లి అభిలాష్ పాయకరావుపేట పాత హరిజనవాడకు చెందిన విద్యార్థి గంపల తరీష్ గా గుర్తించడం జరిగిందని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించినట్లు ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ సముద్ర స్నానానికి వెళ్లిన మా పిల్లలను ఒక కెరటం ముందుగా ఒకరిని లాక్వెల్లగా అతని కాపాడే ప్రయత్నంలో రెండవ కెరటం రెండు పిల్లవాడిని లాక్కెళ్ళిపోయిందని వెంటనే స్థానిక మత్స్యకారులకు తెలియజేయగా అందరూ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని గజేతగాళ్లు లోపలికి వెళ్లి వెతికిన కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్షణాల వ్యవధిలో పోలీసులు మెరైన్ పోలీసులు సుమారు రెండు గంటలసేపు సముద్రంలో సహాయక చర్యలు చేపట్టిన పిల్లల ఆచూకీ కానీ రాలేదని కన్నీరు మున్నీరయ్యారు. అదేవిధంగా సహాయక చర్యలు వెంటనే చేపట్టాలంటూ అధికారులకు ఆదేశాలు ఇచ్చిన రాష్ట్ర హోం మినిస్టర్ వంగలపూడి అనితకు సహాయం అందించిన కుటుంబ సభ్యులకు పోలీసులకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చేతికి అంది వచ్చిన పిల్లలు కోల్పోయిన తమ కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎండీయూ ఆపరేటర్లకు మంగళం పాడిన ప్రభుత్వం - గిరిజనులకు మళ్లీ రేషన్ కష్టాలు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 20:**ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 9260 మంది ఎండీయూ ఆపరేటర్లు, 9260 మంది హెల్పర్లు తమ జీవనోపాధిని కోల్పోయే పరిస్థితిలో ఉన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. గూడెం కొత్త వీధి మండల వైసీపీ అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో రేషన్ సరఫరాలో మళ్లీ కష్టాలు మొదలయ్యాయని తెలిపారు. "గిరిజనులు చాలామంది రేషన్ బియ్యం తీసుకోవాలంటే 5 నుంచి 10 కిలోమీటర్లు నడిచి రేషన్ గోదాముల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో వారు రేషన్ తీసుకోవడమే మానేస్తున్నారు," అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రేషన్ వాహనాల ద్వారా ప్రజలు ఇంటి వద్దకే రేషన్ అందుకున్నారని, ఇది గిరిజన ప్రాంతాలకు ఎంతో ఉపయోగంగా మారిందని పేర్కొన్నారు. ఇలాంటి సంక్షేమ పథకాన్ని రద్దు చేయడం సరికాదని, ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థను కొనసాగించాలని గిరిప్రసాద్ డిమాండ్ చేశారు.

## రింతాడా సచివాలయం ఎదుట అంగన్వాడి మినీ టీచర్ల నిరసన



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, మే 20:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం రింతాడ పంచాయతీ సచివాలయం ముందు అంగన్వాడి మినీ టీచర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు.మినీ టీచర్లను మెయిన్ టీచర్లుగా మార్చాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడిన సీఐటీయూ మండల కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మినీ టీచర్లను మెయిన్ టీచర్లుగా చేస్తామని ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయలేదని విమర్శించారు. అలాగే కార్మిక హక్కులను కాలరాసే విధంగా ఉన్న నూతన లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి సోమలి అప్పలనరస, జి. దయ వెంకటి, బి. మీనాక్షి, కుమారి, సుభద్ర,కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై తిరంగా ర్యాలీ




- భారతదేశంపై కన్నెత్తి చూడని స్థితిలో పాకిస్తాన్ కు భారత సైనికులు బుద్ధి చెప్పారు.
- అల్లూరి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు మఠం శాంతకుమారి.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మే 20.**భారతదేశంపై కన్నెత్తి చూడని స్థితిలో పాకిస్తాన్ కు భారత సైనికులు బుద్ధి చెప్పారని అల్లూరి సీతారామరాజు జిల్లా బీజేపి అధ్యక్షురాలు మఠం శాంతకుమారి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం కూటమి నాయకులు తీరంగా ర్యాలీ నిర్వహించారు. దుర్గాదేవి ఆలయం నుండి నాలుగు రోడ్ల కూడలి మీదుగా పోలీస్ స్టేషన్ కూడలి వరకు తిరిగి నాలుగురోడ్ల కూడలి వరకు జాతీయ జెండాలను చేతబూని 'భారత్ మాతాకీ జై', పాకిస్తాన్ ఉగ్రవాదులు ఖబడ్దార్ అంటూ పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ.. సింధూరం తుడిస్తే ఎలా ఉంటుందో భారతదేశం చూపించిందని ఆమె అన్నారు. భారత్పై దాడి చేయాలనుకునే దుర్మార్గులకు ఇది గుణపాఠం కావాలని ఆమె వ్యాఖ్యానించారు. అనంతరం బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు పాంగి రాజారావు మాట్లాడుతూ.. భారత జవాన్లు కేవలం సరిహద్దుల వద్దే కాదు, దేశం గర్వించదగిన స్ఫూర్తిగా నిలుస్తున్నారని, వారి త్యాగాలను ఎప్పుడూ మరవకూడదన్నారు. దేశ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీ సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు ధోని నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.మత్యరాజు, బిజెపి, జనసేన మండల అధ్యక్షులు కె.సుబ్బరావు, రెయ్యల శ్రావణ్ కుమార్, బిజెపి రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యుడు ఎం.గోపాల పాత్రుడు, బిజెపి జిల్లా యువ మోర్చా అధ్యక్షులు గెమ్మెలి కొండబాబు, మాజీ మండల అధ్యక్షుడు వి.లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షుడు ఎం.సాధురాం, మండల ప్రధాన కార్యదర్శిలు వి.భగత్రామ్, మండల కార్యదర్శి నాగేశ్వరరావు, గిరిజన మోర్చా అధ్యక్షుడు వి.కర్రిబాబు, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి ఏ. శ్రీను, జనసేన మండల ప్రధాన కార్యదర్శి గొల్లరి సతీష్ కుమార్, కార్యదర్శి బి. సీతారాం, కూటమి నాయకులు ఆర్. నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీని మర్యాదపూర్వకంగా కలిసిన వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ నాగమణి



గూడెం కొత్త వీధి పెన్ పవర్ మే 20: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం మాజీ ఎంపీపీ సాగిన బాలరాజును వైస్ ఎంపీపీ సప్పగడ్డ ఆనంద్ మరియు గూడెం కొత్త వీధి ఎంపీటీసీ పసుపులేటి నాగమణి ఆయన స్వగ్రామమైన సిగినాపల్లి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మండలంలో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారానికి అధిష్టానానికి ఏ విధంగా తెలియజేయాలి అనే అంశంపై చర్చించారు.అలాగే పాడేరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి ఆదేశాల మేరకు, పార్టీ అభివృద్ధికి అందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఒక అభిప్రాయానికి వచ్చారు. మండల స్థాయిలో టీడీపీని బలోపేతం చేయడం, పార్టీ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లడంపై ఈ సందర్భంగా ప్రత్యేక చర్చ సాగినట్లు తెలిసింది.

## 10వ తరగతి సిబిఎస్ఇ గిరిజన విభాగంలో3 ర్యాంకు సాధించిన తేజస్విని

**ఉత్తమ పతిభ కనపరిచిన విద్యార్థినికి సన్మానం**

**వైయస్సార్సీపీ నాయకులు మోరు రవి**

**చింతపల్లి పెన్ పవర్ మే 20 :-** చింతపల్లి మండలం అన్నవరం పంచాయతీ. పనసలపాడు గ్రామనికి చెందిన. కొట్టికి రాధాకృష్ణ మూడవ కుమార్తె తేజస్విని విశాఖ మారకవలస ఏపీఆర్ రెసిడెన్షియల్ స్కూల్ లో 10 తరగతి సిబిఎస్ఈ రాష్ట్ర ఎస్టి విభాగంలో 3వ ర్యాంకు సాధించిన గిరిజన ముద్దుబిడ్డ గిరిజన ప్రాంతంలో కూడా చదువుకోడానికి పిల్లలకు ముందుండి నడిపించే తల్లిదండ్రులు ఉన్నారు చదువుకోడానికి పిల్లలు కూడా శ్రద్ధ చూపిస్తారని నిదర్శనంగా నిలిచినటువంటి తేజస్విని కృతజ్ఞతలు భవిష్యత్తులో మంచి ఆఫీసర్ గా రావాలని కోరడం జరిగింది. సాయి శక్తులు ఉన్నంతవరకు మంచి చదువు చదవాలని ఉందని ఆమె తెలియపరచడం జరిగింది. మా గిరిజన ప్రాంత మహిళా తల్లులకు యువతకు తోడుపాట అందించి గొప్ప ఐఏఎస్ ఐపీఎస్ ఆఫీసర్లు చేసే అంతవరకు కృషి చేస్తారని ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి నాయకులు మోరి రవి మరియు చిల్డ్రన్స్ అండ్



ఉమెన్ రైట్స్అల్లూరి సీతారామరాజు జిల్లా కో కన్వీనర్ కోరడమైనది

# ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడిని తన్నిన కాంగ్రెస్ నాయకుడు

**రాజన్న సిరిసిల్ల పెన్ పవర్:** తనకు చెప్పకుండా ఇందిరమ్మ ఇల్లు ముగ్గు పోశాడని ఆగ్రహంతో లబ్ధిదారుడిని కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కిషన్ తన్నిన వైనం వైరలయింది.
రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం రాళ్ళపేట గ్రామానికి చెందిన బాలసాని శ్రీనివాస్ గౌడ్ అనే వ్యక్తికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవ్వగా, ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోసుకున్నాడు.
తనకు చెప్పకుండా ముగ్గు పోశాడని ఆగ్రహంతో లబ్ధిదారుడితో గొడవ పడగా, ఒకరి జోలికి ఒకరు వెళ్లకూడదని గ్రామ పెద్దలు తీర్మానించారు.
దీంతో కాంగ్రెస్ నాయకుడు కిషన్ మరింత ఆగ్రహంతో రెచ్చిపోయి, శ్రీనివాస్ గౌడ్ ను కాలితో తన్ని దుర్భాషలాడాడు. ఊరిలో ఎవరు ఏ పని చేసినా తనకు చెప్పాలని, లేకపోతే ఎలాంటి పథకాలు రాకుండా ఆపేస్తానని ఇబ్బంది పెడుతున్నాడని గ్రామస్తులు వాపోతున్నారు.

# బుచ్చి లో రోడ్డు ప్రమాదం,ఇంట్లోకి దూసుకెళ్లి కాలువలో పడిన కారు.. తప్పిన ప్రాణాపాయం

**నెల్లూరు: పెన్ పవర్:**బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని బైపాస్ రోడ్డు కృష్ణ హాల్ సమీపం లో ఓ కారు ఇంటి ప్రహరీ గోడను ఢీకొని కాలువలో బోల్తా పడింది. ఇంటి యజమాని వృద్ధురాలైన శాలమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి తాను ఇంటి వరండాలో నిద్రిస్తుండగా కారు వేగంగా వచ్చి ప్రహరీ గోడను ఢీకొని కాలువలో పడిందన్నారు. కారు ఢీకొట్టడంతో ప్రహరీ గోడ తో పాటు కుళాయి పంపు కూడా ధ్వంసం అయిందని చెప్పారు. ప్రహారి గోడ రాళ్లు తన సమీపంలో పడటంతో భయభ్రాంతులకు గురయ్యానన్నారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమి కాకపోవడంతో స్థానికులు ఊపిరిపించుకున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన తీరుపై విచారిస్తున్నారు.. ఇటీవలే ఇదే రోడ్డు లో ఇదే తరహాలో రోడ్డు పక్కన ఉన్న ఇంటిని కారు ఢీ కొన్న ప్రమాదం లో 5 మంది వైద్య విద్యార్థులు, ఆ ఇంటి యజమాని మొత్తం ఆరు మంది దుర్మరణం పాలయ్యారు....ఇప్పుడు ఎలాంటి ప్రాణ నష్టం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.... రోడ్డు ప్రమాదం,ఇంట్లోకి దూసుకెళ్లి కాలువలో పడిన కారు..తప్పిన ప్రాణాపాయం??
నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని బైపాస్ రోడ్డు కృష్ణ హాల్ సమీపం లో ఓ కారు ఇంటి ప్రహరీ గోడను ఢీకొని కాలువలో బోల్తా పడింది. ఇంటి యజమాని వృద్ధురాలైన శాలమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి తాను ఇంటి వరండాలో నిద్రిస్తుండగా కారు వేగంగా వచ్చి ప్రహరీ గోడను ఢీకొని కాలువలో పడిందన్నారు. కారు ఢీకొట్టడంతో ప్రహరీ గోడ తో పాటు కుళాయి పంపు కూడా ధ్వంసం అయిందని చెప్పారు. ప్రహారి గోడ రాళ్లు తన సమీపంలో పడటంతో భయభ్రాంతులకు గురయ్యానన్నారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమి కాకపోవడంతో స్థానికులు ఊపిరిపించుకున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన తీరుపై విచారిస్తున్నారు.. ఇటీవలే ఇదే రోడ్డు లో ఇదే తరహాలో రోడ్డు పక్కన ఉన్న ఇంటిని కారు ఢీ కొన్న ప్రమాదం లో 5 మంది వైద్య విద్యార్థులు, ఆ ఇంటి యజమాని మొత్తం ఆరు మంది దుర్మరణం పాలయ్యారు....ఇప్పుడు ఎలాంటి ప్రాణ నష్టం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు....బుచ్చి లో రోడ్డు ప్రమాదం,ఇంట్లోకి దూసుకెళ్లి కాలువలో పడిన కారు..తప్పిన ప్రాణాపాయం?? నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని బైపాస్ రోడ్డు కృష్ణ హాల్ సమీపం లో ఓ కారు ఇంటి ప్రహరీ గోడను ఢీకొని కాలువలో బోల్తా పడింది. ఇంటి యజమాని వృద్ధురాలైన శాలమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి తాను ఇంటి వరండాలో నిద్రిస్తుండగా కారు వేగంగా వచ్చి ప్రహరీ గోడను ఢీకొని కాలువలో పడిందన్నారు. కారు ఢీకొట్టడంతో ప్రహరీ గోడ తో పాటు కుళాయి పంపు కూడా ధ్వంసం అయిందని చెప్పారు. ప్రహారి గోడ రాళ్లు తన సమీపంలో పడటంతో భయభ్రాంతులకు గురయ్యానన్నారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమి కాకపోవడంతో స్థానికులు ఊపిరిపించుకున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన తీరుపై విచారిస్తున్నారు..
ఇటీవలే ఇదే రోడ్డు లో ఇదే తరహాలో రోడ్డు పక్కన ఉన్న ఇంటిని కారు ఢీ కొన్న ప్రమాదం లో 5 మంది వైద్య విద్యార్థులు, ఆ ఇంటి యజమాని మొత్తం ఆరు మంది దుర్మరణం పాలయ్యారు....ఇప్పుడు ఎలాంటి ప్రాణ నష్టం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# ప్రకాశం పంతులుకు నివాళు లర్పించిన వైఎస్ జగన్

**తాడేపల్లి: పెన్ పవర్:**వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమం జరిగింది. , ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైయస్ జగన్ పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నేతలు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, శత్రుచర్ల పరీక్షిత్ రాజు, అలజంగి జోగారావు, తిప్పల నాగిరెడ్డి, మళ్ళ విజయ్ ప్రసాద్, వాసుపల్లి గణేష్, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# గన్నవరం లో భారీ వాన

**గన్నవరం:పెన్ పవర్:** కృష్ణాజిల్లా గన్నవరం లో ఈరోజు తెల్లవారుఝాము నుండి గాలి వాన బీభత్సం సృష్టించింది. నగరంలో ఎండ తీవ్రతతో ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నా సమయంలో వాతావరంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. గన్నవరం రహదారి ప్రాంతంలో నల్లటి మేఘాలు ఒక్కసారిగా కమ్మేసాయి. భారీ ఈదురు గాలులతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది దీంతో లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపై నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పలుచోట్ల విద్యుత్కు అంతరాయం ఏర్పడింది..

# 'సీబీఎన్ పాత్ వేస్ టు సక్సెస్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు

**అమరావతి:పెన్ పవర్:** 'సీబీఎన్ పాత్ వేస్ టు సక్సెస్' అనే పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. సీఎం చంద్రబాబు 75 ఏళ్ల జీవిత ప్రస్థానాన్ని గురించి వివరిస్తూ ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి డి.రాజేష్ కుమార్, రీచ్ ఎయిట్స్ ఈటీ %Ꮷ% సీ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ డీ.ఏ.రాజు సంయుక్తంగా ఈ పుస్తకాన్ని రచించారు. దీనిని సచివాలయంలో సోమవారం సీఎం చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో సీఎం చంద్రబాబు జీవితాంశాలు, విజన్, విజయ సూత్రాలు, అభివృద్ధి విధానాలు వంటి వివిధ అంశాలను గురించి పొందు పరిచారు. ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన వారిలో వీఎన్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ బన్ బాబు తదితరులు ఉన్నారు.

# మహానాడు విజయవంతం చేయాలి

కడపలో మహానాడు ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో పోలిట్ బ్యూరో సభ్యులు కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి పాల్గొన్నారు.కడపలో జరిగిన సమావేశంలో రాష్ట్ర మంత్రులు, జిల్లా ఇంచార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మహానాడు విజయవంతం కోసం శాఖలను ఏర్పాటు చేసి, ప్రతి శాఖకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించబడగా, ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి.
మహానాడును ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సమిష్టి కృషి అవసరం. ప్రతి ఏర్పాటును పకడ్బందీగా, గౌరవప్రదంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నారు.

# జగన్ అరెస్ట్ తప్పదా...



**కడప, మే 20, పెన్ పవర్:** ఏపీ లిక్కర్ స్కాం కేసు వైసీపీలో ప్రకంపనలు రేపుతోందా? కేసులో గత ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన ఉన్నతాధికారులు అరెస్టులు, రిమాండ్ బాట పడుతుండడం ఫ్యాన్ పార్టీలో గుబులు రేపుతోందా? ఇప్పటికే సిట్ పలువురు ముఖ్య నేతలను, ఉన్నతాధికారులను అరెస్ట్ చేసి విచారణ కొనసాగిస్తోంది. ఈ కేసులో గత ప్రభుత్వ హయాంలో సీఎంవోలో పనిచేసిన కీలక అధికారులంతా ఒక్కొక్కరుగా అరెస్ట్ అవుతుండడంతో వైసీపీలో గుబులు రేపుతోందట.జగన్ సీఎంవో కార్యదర్శిగా పనిచేసిన ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్ రెడ్డిని సిట్ అరెస్ట్ చేయడం ఈ కేసులో కీలక పరిణామంగా మారింది. అలాగే మాజీ సీఎం ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డితో పాటు భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పను కూడా సిట్ అరెస్ట్ చేసి విచారిస్తోంది. అయితే సిట్ విచారణలో ఈ ముగ్గురు కీలక నిందితులు ఏం చెప్పారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ప్రాథమిక విచారణలో తేలిన అంశాలన్నింటిని రిమాండ్ రిపోర్టులో పొందుపరిచినట్లు సిట్ అధికారులు చెబుతున్నారు. దీంతో ముందు ముందు మరిన్ని కీలక అరెస్టులు జరిగే ఛాన్స్ ఉందంటూ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.లిక్కర్ స్కాంలో అన్నీతానై వ్యవహరించిన ఏ1 రాజ్ కసిరెడ్డిని పోలీసులు ఎప్పుడో అరెస్టు చేశారు. ఆయన వాంగ్మూలంతో గత ప్రభుత్వంలో సీఎంవోలో కీలక అధికారులుగా పనిచేసిన రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయరెడ్డి, మాజీ సీఎం ఓఎస్డీ క్రిష్ణమోహన్ రెడ్డిని తాజాగా అరెస్టు చేశారు. అంతేకాకుండా ప్రభుత్వంతో సంబంధం లేని బాలాజీ గోవిందప్ప అనే ఆడిటర్, భారతీ సిమెంట్స్ పర్మినెంట్ డైరెక్టరును రిమాండుకు తరలించారు. ఈ ముగ్గురి అరెస్టుతో సిట్ నెక్స్ట్ స్టెప్ ఏంటి అన్న సస్పెన్స్ కొనసాగుతోంది. ముందుగా మాజీ ముఖ్యమంత్రి జగన్ ను అన్నివైపుల నుంచి చుట్టుముట్టాలని ప్రభుత్వం వ్యూహాత్మకంగా పథకం వేసిందని అంటున్నారు.లిక్కర్ స్కాంలో నిందితులుగా అభియోగాలు ఎదుర్కొంటున్న ఎంపీ మిథున్ రెడ్డి, రాజ్ కసిరెడ్డి, ధనుంజయరెడ్డి, క్రిష్ణమోహన్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి జగన్ కు అత్యంత సన్నిహితులు.. జగన్ తో మంచి అనుభందం ఉన్న మిథున్ రెడ్డిని ఇరుకునపెడితే జగన్ ను ఇబ్బంది పెట్టొచ్చని వ్యూహం ప్రభుత్వం అమలు చేస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి., లిక్కర్ స్కాంలో కమీషన్ల మొత్తం రాజ్ కేసిరెడ్డి ద్వారా ధనుంజయ్ రెడ్డి, క్రిష్ణమోహన్ రెడ్డికి చేరిందని వారిద్దరూ బిగ్ బాస్ కు అందజేశారని సిట్ లీకులిస్తోంది. అంటే మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రమేయం ఉందని పరోక్షంగా సిట్ ప్రచారం చేస్తోందని అంటున్నారు.ప్రస్తుతానికి జగన్ ను ఇబ్బంది పెట్టే సరైన ఆధారాలు లేకపోవడంతో కేసులో ఎక్కడా ఆయన పేరు ప్రస్తావించడం లేదని చెబుతున్నారు. కానీ, ఆయన చుట్టూ ఉన్నవారిని అరెస్టు చేయడం ద్వారా జగన్ ను టచ్ చేసే అవకాశాలు ఉన్నాయనే సంకేతాలు పంపుతున్నారని అంటున్నారు. స్కాంలో వచ్చిన ముడుపులు వేరే వారికి బదిలీ చేయడంలో ఏ1 రాజ్ కసిరెడ్డి కీలక పాత్ర పోషించారని ఆర్డర్ ఆఫ్సప్లై నిర్ణయాల్లో ఇతర నిందితులతో కలిసి ధనుంజయ్ రెడ్డి కీలకంగా వ్యవహరించారని సిట్ రిమాండ్ రిపోర్టులో పేర్కొంది.లిక్కర్ స్కాంలో ఏ1, తన సన్నిహితుల నుంచి ముడుపులు వసూలు చేసి చివరికు ఎవరికి చేర్చారో గుర్తించాల్సి ఉందని వెల్లడించింది. సిండికేట్ సభ్యుల సమావేశాల్లో పాల్గొని ముడుపులు సకాలంలో అందేలా చూశారని సిట్ గుర్తించిందట. ఈ కేసులో ఏ1 రాజ్ కసిరెడ్డి, ఏ2 వాసుదేవ రెడ్డి, ఏ3 సత్య ప్రసాద్, ఏ4 మిథున్ రెడ్డి, ఏ5 విజయ సాయిరెడ్డి కలిసి అనేక సమావేశాల్లో పాల్గొన్నారని..ఏ1 కసిరెడ్డి కార్యాలయానికి పదే పదే వెళ్లి ముడుపుల వసూళ్లు పర్యవేక్షించారని సిట్ రిమాండ్రిపోర్టులో పేర్కొంది.ఏపీ లిక్కర్ స్కాంలో ఒకవైపు కీలక నిందితులు ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిని విచారించిన సిట్..ఆ తర్వాత వీరిని విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరుపరచగా..కోర్టు వీరికి 14రోజుల జ్యుడిషియల్ రిమాండ్ ను విధించింది. వెంటనే వారిద్దరిని విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. అయితే వీరినుంచి మరిన్ని వివరాలు సేకరించాల్సి ఉందని.. ఇద్దరిని ఏడు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని రిమాండ్ రిపోర్టో సిట్ కోరింది తద్వారా వీరి నుంచి మరిన్ని కీలక విషయాలను రాబట్టేందుకు సిట్ వ్యూహాలను రచిస్తోంది.ఇలా ఒకవైపు సిట్ ప్రశ్నలవర్షం, మరోవైపు కోర్టుల్లో వీరికి ముందస్తు బెయిళ్లు లభించకపోవడంతో జైల్లోనే ఉండిపోవాల్సిన పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఒకవైపు సిట్ దర్యాప్తు కొనసాగుతుంటే మరోవైపు ఈడీ కూడా రంగంలోకి దిగింది. ధనుంజయరెడ్డి, క్రిష్ణమోహన్ రెడ్డిలను ఈడీ కూడా విచారించనున్నట్లు తెలుస్తోంది. ఈడీ విచారణలో బయటపడే విషయాలను బట్టి వీరి ఆస్తులతో పాటు బంధువులు, సన్నిహితుల ఆస్తులను కూడీ ఈడీ అటాచ్ చేసే అవకాశం స్పష్టంగా కన్పిస్తోంది.. ఈడీ విచారణలో ఎలాంటి విషయాలను బయటపెడతారో చూడాల్సి ఉంది.ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఇప్పటివరకు మొత్తం ఏడుగురిని సిట్ అరెస్ట్ చేసింది. ఈ ఏడుగురిలో ఆరుగురు నేరుగా ప్రధాన నిందితుడు ఏ1 అయిన కేసిరెడ్డితో సంబంధాలు ఉన్నవారుగా సిట్ ఇప్పటికే గుర్తించినట్లు తెలుస్తోంది. ఇక ధనుంజయరెడ్డి, క్రిష్ణమోహన్ రెడ్డిలు సిట్ కస్టడీ విచారణలో ఏం చెప్పబోతున్నారనేదే ఉత్కంఠగా మారింది. అయితే ఓవైపు సిట్ వేట, మరోవైపు రంగంలోకి దిగిన ఈడీ..మరోవైపు కోర్టుల్లో వీరికి చుక్కెదురు%ౌ%ఇలా ఎటువెళ్లినా నిందితులందరికి నిరాశే ఎదురవుతోంది.ఈ పరిణామాలు చూస్తుంటే%ౌ%లిక్కర్ స్కాంలో వైసీపీ నేతలు తప్పించుకునే దారులన్నీ మూసుకుపోయినట్లే అన్న టాక్ విన్పిస్తోంది. ఈ కేసులో వైసీపీ అధినేత జగన్ ఇక అష్టదిగ్భంధనంలో చిక్కుకున్నట్లే అన్న వాదనలు విన్పిస్తున్నాయి. కేసులో కీలకంగా ఉన్న ధనుంజయరెడ్డి, క్రిష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప ఈ ముగ్గురు చెప్పే విషయాలను బట్టి రాబోయే రోజుల్లో పార్టీ పెద్దల అరెస్ట్ లు ఉండొచ్చనే ఊహాగానాలు పార్టీవర్గాల్లో విన్పిస్తున్నాయి.

**జగన్ పైనే వేళ్లన్నీ.**

వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డిని అరెస్ట్ చేస్తారా? మద్యం కుంభకోణంలో తదుపరి అరెస్ట్ ఆయనదేనా? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల అనుమానంలో నిజం ఉందా? అంతటి సాహసం చంద్రబాబు చేస్తారా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. సెంటిమెంట్ అనే ప్రాతిపదికన ఏపీ రాజకీయాలు జరుగుతుంటాయి. కాంగ్రెస్ పార్టీ అకారణంగా జగన్మోహన్ రెడ్డిని జైలు పాలు చేయడంతోనే ఆయనపై ప్రజల్లో సానుభూతి వ్యక్తం అయింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటయింది. అధికారంలోకి రాగలిగింది. మొన్నటికి మొన్న చంద్రబాబును అరెస్టు చేసి జైల్లో పెట్టడం కూడా సింపతి వచ్చింది. మొన్నటి ఎన్నికల్లో టిడిపి కూటమి గెలుపునకు కారణమైంది. ఇటువంటి పరిస్థితుల్లో జగన్మోహన్ రెడ్డిని అరెస్టు చేస్తారా? అనే ప్రశ్న వినిపిస్తోంది.ప్రస్తుతం మద్యం కుంభకోణం ఏపీలో కుదిపేస్తోంది. ఈ కేసులో వరుసుగా కీలక వ్యక్తుల అరెస్టులు జరుగుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భారీగా మద్యం కుంభకోణం జరిగిందని కూటమి ప్రభుత్వం అనుమానించింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఫుల్ ఫోకస్ పెట్టింది. సిఐడి ప్రాథమిక విచారణ చేపట్టింది. కీలక ఆధారాలు లభించడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ను ఏర్పాటు చేసింది. ఈ ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన నేతలు, అధికారుల పేర్లు బయటపడ్డాయి. దీంతో అరెస్టుల పర్వం కూడా ప్రారంభం అయింది. ఇప్పటికే 8 మంది వరకు అరెస్ట్ అయ్యారు. తదుపరి
అరెస్టు జగన్మోహన్ రెడ్డి ది అని తెగ ప్రచారం నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం ఇదే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.మద్యం కుంభకోణంలో ప్రధాన సూత్రధారిగా రాజ్ కసిరెడ్డి ఉన్నారు. ఇదే విషయాన్ని ఇదే కేసులో ఏ 5 గా ఉన్న మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారు. దీంతో ప్రత్యేక దర్యాప్తు బృందం ఆయనకు నోటీసులు ఇవ్వడంతో విచారణకు హాజరయ్యారు. ఆధారాలతో పాటు కీలక వాంగ్మూలం కూడా ఇచ్చారు. రాజ్ కసిరెడ్డి తో పాటు ఆయన ప్రధాన అనుచరుడు అరెస్ట్ అయ్యారు. అంతకుముందు వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఏపీ బేవరేజెస్ ఎండిగా పనిచేసిన వాసుదేవ రెడ్డి సైతం అరెస్టయ్యారు. ఇటీవల వైసిపి హయాంలో సీఎంఓలో కీలకంగా వ్యవహరించిన ధనుంజయ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి ఓ ఎస్ డి కృష్ణమోహన్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. ఈ వరుస కీలక వ్యక్తులు అరెస్టు కావడంతో తదుపరి అరెస్ట్ జగన్మోహన్ రెడ్డి అని తెగ ప్రచారం జరుగుతోంది.కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. ఇంకా నాలుగేళ్ల పాలన ఉంది. జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా బదనం చేస్తేనే.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వీర్యం అవుతుందని ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. అందుకే జగన్మోహన్ రెడ్డిని అరెస్టు చేయడం ద్వారా మరోసారి ఆయన అవినీతిని బయట పెట్టవచ్చు అని కూటమి భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. జగన్మోహన్ రెడ్డి అరెస్ట్ కు ముహూర్తం ఖరారు చేశారని కూడా ప్రచారం జరుగుతోంది. ఈనెల 27 నుంచి మూడు రోజులపాటు కడపలో మహానాడు జరగనుంది. మహానాడుకు ముందే జగన్మోహన్ రెడ్డిని అరెస్టు చేస్తారని.. తద్వారా టిడిపి క్యాడర్లో ఫుల్ జోష్ వస్తుందని అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే జగన్మోహన్ రెడ్డిని అంత త్వరగా అరెస్టు చేయరని.. ముందు చుట్టూ ఉన్న నేతల చుట్టూ ఉచ్చు బిగిస్తారని మరో అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి

# ఇంజనీరింగ్ సీట్ల అమ్మకాలు షురూ

**హైదరాబాద్, మే 20,పెన్ పవర్:**
రాష్ట్రంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో మేనేజ్ మెంట్ కోటా సీట్లను ఆన్ లైన్లో భర్తీ చేయాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. ప్రైవేటు కాలేజీల్లో మేనేజ్ మెంట్ కోటా సీట్ల అమ్మకాలు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయి. ఎప్ సెట్ ర్యాంకు, విద్యార్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా స్టూడెంట్ల నుంచి కాలేజీల మేనేజ్ మెంట్లు డబ్బులు వసూలు చేస్తున్నాయి. ముందస్తు సీట్ల రిజర్వు పేరుతో 30 నుంచి 50 శాతం ఫీజును పేరెంట్స్ నుంచి తీసుకుంటున్నారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మొత్తం ఫీజు వసూలు చేసేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఒకవేళ ప్రభుత్వమే ఎప్ సెట్ బీ%-% కేటగిరి సీట్లను ఆన్లైన్ లో నింపితే.. పేరెంట్స్ కట్టిన డబ్బులు రిటర్న్ ఇచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి. దీంతో పేరెంట్స్ లో ఆందోళన మొదలైంది. ప్రభుత్వం బీ కేటగిరి సీట్ల భర్తీపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.కొన్నేండ్లుగా నిబంధనలకు విరుద్ధంగా ఎవరు ఎక్కువ డబ్బులిస్తే వాళ్లకే మేనేజ్ మెంట్ సీట్లను కాలేజీలు అమ్ముకుంటున్నాయి. ఈ దందాకు చెక్ పెట్టేందుకు హయ్యర్ ఎడ్యుకేషన్ అధికారులు రెడీగా ఉన్నా.. సర్కారు పర్మిషన్ లేకపోవడంతో వెనక్కి తగ్గారు. త్వరలోనే బీటెక్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో.. దీనిపై ప్రభుత్వం త్వరగా స్పష్టత ఇవ్వాలని పేరెంట్స్ కోరుతున్నారు. రాష్ట్రంలో 157 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా, వాటిలో లక్ష వరకూ సీట్లు ఉన్నాయి. దీంట్లో 70 శాతం సీట్లను ఈఏపీ సెట్ ర్యాంకుల ద్వారా భర్తీ చేస్తుండగా, మిగిలిన 30 శాతం సీట్లను మేనేజ్ మెంట్ కోటా కింద నింపుతారు. ఈ కోటాలోనే
నాన్ రెసిడెంట్ ఇండియన్ (ఎన్ఆర్ఐ) కోటా ద్వారా అడ్మిషన్లు కల్పిస్తారు. అయితే, ఎప్ సెట్ ద్వారా నింపే సీట్లన్నీ ప్రభుత్వమే నిబంధనల ప్రకారం.. విద్యార్థులకు వచ్చిన ర్యాంకుల ఆధారంగా రిజర్వేషన్లకు అనుగుణంగా నింపుతున్నారు. కానీ, మేనేజ్ మెంట్ కోటా (బీ కేటగిరి) సీట్లను మాత్రం మేనేజ్ మెంట్లు భర్తీ చేసుకునేలా ప్రభుత్వం అనుమతులు ఇస్తోంది. ఇది మేనేజ్ మెంట్లకు వరంగా మారింది. బీ%-% కేటగిరి సీట్లను ఎప్ సెట్ ర్యాంకు, జేఈఈ ర్యాంకు, ఇంటర్ మార్కుల ఆధారంగా భర్తీ చేయాలనే నిబంధనలు ఉన్నా దాదాపు ఏ కాలేజీ కూడా ఈ విధానాన్ని అమలు చేయడం లేదు. మేనేజ్ మెంట్ కోటా సీట్లకు కంప్యూటర్ సైన్స్, దాని అనుబంధ బ్రాంచులకు రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఫీజులు వసూలు చేస్తున్నారు. ఈ దందాకు చెక్ పెట్టాలని కొన్నేండ్లుగా పేరెంట్స్ విజ్ఞప్తులు చేస్తున్నారు. అయితే, గత బీఆర్ఎస్ ప్రభుత్వం దీన్ని పక్కన పెట్టగా.. రాష్ట్రంలో కొత్తగా వచ్చిన ప్రభుత్వంపై పేరెంట్స్, స్టూడెంట్లు ఆశలు పెట్టుకున్నారు. ఇంజినీరింగ్ కాలేజీల్లో మేనేజ్ మెంట్ కోటా, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీని ప్రభుత్వమే చేపట్టాలని పేరెంట్స్, స్టూడెంట్ యూనియన్ల నుంచి భారీగా డిమాండ్లు, వినతులు వస్తున్నాయి. ఈ డిమాండ్లకు అనుగుణంగా గతేడాది హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ అధికారులు.. బీ కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారానే భర్తీ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సర్కారుకు లేఖ రాశారు. ఎంబీబీఎస్ తరహాలో బీటెక్ సీట్లనూ ఆన్లైన్లో భర్తీ చేస్తామని స్పష్టంగా పేర్కొన్నారు. అయితే, అప్పట్లో దానిని ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ ఏడాది బీటెక్ లో కొత్త ఫీజులు అమలు కాబోతున్నాయి. ఇప్పటికే ఎప్ సెట్ ఫలితాలు విడుదలైనా, ఇంకా అడ్మిషన్ల నోటిఫికేషన్ రాలేదు. ఈ టైమ్లోనే బీ కేటగిరి సీట్ల భర్తీ విధానంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని పేరెంట్స్, స్టూడెంట్లు కోరుతున్నారు. ఆన్ లైన్లో మేనేజ్ మెంట్ సీట్లను నింపితే.. కాలేజీల అక్రమ దందాకు చెక్ పెట్టినట్లు అవుతుందని చెప్తున్నారు.

## రోడ్డుపై వడ్లు పోసి రైతుల ధర్నా

**మెదక్: పెన్ పవర్:** శివంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ముందు తూప్రాన్ నర్సాపూర్ రహదారిపై మొలకెత్తిన వడ్లు రోడ్డుపై పోసి రైతులు ధర్నాకు దిగారు. నెల రోజులుగా వడ్లు కొనుగోలు చేయడం లేదంటూ ఆందోళన, ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలంటూ డిమాండ్ చేసారు. రైతు తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సహకార సంఘం సీఈవో ను స్థానిక ఎమ్మెల్యే ఆదేశించారు.

## పేపర్ బోర్డు పేరుతో రియల్ దందా

**ఖమ్మం, మే 20, పెన్ పవర్:** పరిశ్రమల స్థాపనకు కారు చౌకగా ప్రభుత్వ భూములు పొంది నామమాత్రంగా పరిశ్రమలు స్థాపించినట్టు చేస్తూ ప్రభుత్వ భూము ల్లో అక్రమ వెంచర్లతో స్థిరాస్తి వ్యాపారం జో రుగా సాగుతోంది.భద్రాద్రి కొత్తగూడెం జి ల్లా చుంచుపల్లి మండలం, రామాంజనేయ కాలనీ పరిసర ప్రాంతంలో యదేచ్చగా ప్ర భుత్వ భూముల్లో అక్రమ వెంచర్లు గెలుస్తున్నాయి. సర్వే నెంబరు 137/1. 20 కుంటల ప్రభుత్వ భూమి కబ్జా చేసి ఈ భూమికి త ప్పుడు సర్వే నెంబర్ 137/2/%ూ% చూపి ప్రైవే ట్ పట్టా భూమి పేరుతో కాగితాలు సృష్టించారు.2004 సంవత్సరంలో విజయవాడ కు చెందిన నాగ వెంకట శ్రీలక్ష్మి ఈ భూ మిని కొనుగోలు చేసి, బండా రామిరెడ్డి వద్ద నుండి ఓ అట్టల ఫ్యాక్టరీ నిర్మాణం చేశారు. ఈ ఫ్యాక్టరీ కి ఎలాంటి అనుమతులు లేవని ఆరోపణలు ఉన్నాయి. మరో చోట ఉన్న శ్రీ పద్మాలయ పేపర్ బోరడ్స్ అనే ఫ్యాక్టరీ అ నుమతు లను చూపుతూ, ప్రభుత్వానికి చె ల్లించాల్సిన పన్నులకు వేగనామం పెట్టారని ఆరోపణలు వస్తున్నాయి.పద్మాలయ పేపర్ బోరడ్స్ పాల్వంచ మండలం దంతాల బోర గ్రామానికి చెందిన ఒక గిరిజనుడిని బినామీగా నమోదు చేసినట్లు సమాచారం. ఇటీ వల బినామీ గిరిజనుడికి, కర్మాగారం నిర్వహకులకు మనస్పర్ధలు వెలబడటంతో విష యం వెలుగు చూసింది.ఒకవైపు అనుమతు లు లేకుండా అట్టాల ఫ్యాక్టరీ నడుపుతూ, మ రోవైపు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమ వెంచర్లతో భూదందా సాగుతున్నట్లు తెలుస్తోంది.ఇంత జరుగుతున్న రెవెన్యూ, పంచాయతీ, పరిశ్రమల అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం తో పెద్ద మొ త్తంలో డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి.గతంలో ఈ స్థలంపై ఎల్ టి ఆర్ కేసులు నమోదైన ఎటు తెలుస్తోంది. జిల్లా కలెక్టర్ కల్పించుకొని చెంచుపల్లి మండలం ఇండస్ట్రియల్ పార్కు ఏరియాలో జరుగుతున్న భూధందా పై సమగ్ర విచారణ జరిపించి ప్రభుత్వ భూములను పరిర క్షించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

## రక్తం రహదారి ఘోర రోడ్డు ప్రమాదం

**వికారాబాద్: పెన్ పవర్:**వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగాపూర్ సమీపంలో నేషనల్ హైవే 163 పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని డిన్నర్ కు వెళ్లి వెళ్తున్న ఒక బస్సు, వెనుక నుంచి ఢీ కొట్టింది. బస్సులో సుమారు 60 మంది ఉన్నట్టు సమాచారం. నలుగురు బస్సులో ఇరుక్కుని మృతి చెందారు. స్థానికులు పోలీసులు మృతదేహాలను అతి కష్టంగా బయటకు తీసారు. పరిగి లో డిన్నర్ కు హాజరై తిరిగి తమ గ్రామానికి ట్రావెల్స్ బస్సులో వెళుతుండగా ఘటన జరిగింది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందన వెల్లి గ్రామానికి చెందినవారుగా గుర్తించారు. క్షతగాత్రులను మృతదేహాలను పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య

**పరిగి : పెన్ పవర్:**చందన వెల్లి గ్రామానికి చెందిన నలుగురు మృతి పట్ల చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. షాబాద్ మండలం చందన వెల్లి గ్రామ వాసులు శుభకార్యానికి హాజరై తిరిగి వస్తుండగా పరిగి మండలం రంగాపూర్ సమీపంలో నేషనల్ హైవే పై రాత్రి ప్రమాదవశాత్తూ ఘోర రోడ్డు ప్రమాదంలో గాయాల పాలై వికారాబాద్ లోని ఈషా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న వారి దగ్గరికి వెళ్ళి అయన , పరామర్శించారు. తరువాత
అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలన్నారు.

## కృత్రిమ అవాసాలను విడుదల చేసిన మంత్రి అచ్చెన్నాయుడు



**విశాఖపట్నం: పెన్ పవర్:**విశాఖలోని జాలారి ఎండాడ సము ద్రంలో రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృత్రిమ ఆవాసాలను విడుదల చేశారు. వీటి ఏర్పాటుతో మత్స్య సంపద వృద్ధి చెంది మత్స్యకారుల జీవనో పాధి మెరుగుపడుతుందని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్రలో మొదటి విడతగా 22 యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని, భవిష్యత్తులో ఇతర జిల్లాల్లోనూ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

## భారీ వర్షానికి బెంగళూరు అతలాకుతలం

**బెంగళూరు: పెన్ పవర్:**కర్ణాటక రాజధాని బెంగ ళూరులో వర్ష బీభత్సం సృష్టించిం ది.నగరవ్యాప్తంగా కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. పలు లోతట్టు ప్రాంతాలతో పాటు వాహనాలు నీట మునిగాయి. రోడ్ల పైకి నీరు చేరడంతో వాహనదారు లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నా రు. రహదారులపై నీళ్లు చెరువుల ను తలపించాయి. హెణ్ణూరు ప్రాం తంలోని ఓ అనాథాశ్రమంలోకి వర్షపు నీరు చేరడంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం దాకా మంచాల పైనుంచి దిగే పరిస్థితి లేదు. కేఆర్ పురం పరిధిలోని సాయి లేఅవుట్లో ప్రజలు రెండో రోజూ ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. కాలనీలోని పలు ఇళ్లలోకి నీరు చేరింది.నెలమంగళ మార్గంలో జాతీయ రహదారి సర్వీ స్ రోడ్లపై నాలుగు అడుగులకుపైగా నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

# వాట్సాప్ తో జరాభద్రం..

**హైదరాబాద్, మే 20, పెన్ పవర్:** ప్రస్తుత కాలంలో ప్రతి మొబైల్ లో వాట్సాప్ తప్పనిసరిగా ఉంటుంది. విద్యార్థుల నుంచి ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు అందరూ వాట్సాప్ తోనే చాటింగ్ చేస్తూ ఉంటారు. ఫ్యామిలీ, స్నేహితులు, ఉద్యోగులు ఇలా అందరూ ఆన్లైన్లో కలుసుకునే వేదికగా వాట్సాప్ ప్రధానంగా నిలుస్తుంది. వాట్సాప్ ద్వారా కేవలం సాధారణ మెసేజ్లు మాత్రమే కాకుండా కంపెనీకి సంబంధించిన విలువైన మెసేజ్లను కూడా పంపిస్తూ ఉంటారు. అయితే ఇలాంటి సమయంలో వాట్సాప్ వాడేవారు జాగ్రత్తగా ఉండాలని సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు. అయినా కొందరు సైబర్ నేరగాళ్లు రకరకాల పద్ధతిలో మోసాలు చేస్తున్నారు. తాజాగా వాట్సాప్ లో కొత్తరకం మోసం బయటపడింది. అదేంటంటే?వాట్సాప్ లో వినియోగదారుల ప్రవేశిక కోసం మాతృ సంస్థ మేధా ఎప్పటికప్పుడు సేఫ్టీ ఫీచర్స్ను అందుబాటులో ఉంచుతుంది. ఇప్పటికే ఎన్నో రకాల ఫీచర్స్ ను అందుబాటులోకి తెచ్చిన మెటా వినియోగదారుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కొత్తగా ఫీచర్స్ ను అందుబాటులోకి తీసుకొస్తుంది. తాజాగా వాట్సఅప్లో వినియోగదారులు మోసపోయే ప్రమాదం ఉందని గుర్తించిందిఇప్పటికే గుర్తుతెలియని మెసేజ్లను ఓపెన్ చేయవద్దని సాంకేతిక నిపుణులు తెలుపుతున్నారు. అలాగే. %ూజూ౧% వంటి మెసేజ్లు కూడా వినియోగదారుల ఖాతాలను ఖాళీ చేస్తాయని అప్రమత్తం చేసింది. అయితే తాజాగా కొత్త రకం మోసాన్ని బయటపెట్టింది. కొందరు సైబర్ నేరగాళ్లు ఒక ఇమేజ్ ని పంపిస్తారు. బైనరీ కోడ్ తో ఉన్నాయి ఇమేజ్ ని ఓపెన్ చేయగానే మాల్వేర్ మొబైల్ లోకి ప్రవేశిస్తుంది. ఆ తర్వాత వినియోగదారుడి ఖాతాకు సంబంధించిన సమాచారం సైబర్ నేరగాళ్లకు వెళ్లిపోతుంది. దీంతో ఓటీపీ వంటి మెసేజ్లు హ్యాక్ కు గురి అవుతాయి. అందువల్ల గుర్తుతెలియని ఫోన్ నెంబర్ నుంచి వచ్చే ఇమేజ్ ని ఓపెన్ చేయవద్దని సాంకేతిక నిపుణులు తెలుపుతున్నారు. ఇప్పటికే ఇలాంటి ఇమేజ్ ని ఉపయోగించి మోసపోయారని గుర్తించింది. అందువల్ల ఇకనుంచి అయినా జాగ్రత్తగా ఉండాలని వాట్సాప్ సైతం హెచ్చరిస్తోంది.అయితే వాట్సాప్ లో సేఫ్టీ కోసం ఎన్నో రకాల ఫీచర్స్ ఇప్పటికీ అందుబాటులోకి వచ్చాయి. అయినా కొందరు




వినియోగదారుల అవగాహన లేని తో చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి తరుణంలో వాట్సాప్ లో ఉపయోగించేవారు గుర్తుతెలియని గ్రూపులో గానీ గుర్తు తెలియని నెంబర్లో గాని చాటింగ్ చేయవద్దని చెబుతున్నారు. గుర్తుతెలియని నియమాలలో మినిమం మెసేజ్ పెట్టిన వారికి వాట్సాప్ ఇన్ఫర్మేషన్ వెళ్లిపోతుందని అంటున్నారు. అంతేకాకుండా మొబైల్ కి సంబంధించిన సమాచారం సైబర్ నేరగాళ్లు తెలుసుకునే ప్రమాదముంది.మరోవైపు వినియోగదారుల ఎంటర్టైన్మెంట్ కోసం ఎన్నో రకాల ఫీచర్స్ అందుబాటులోకి వస్తున్నాయి. అయితే వీటిని ఉపయోగించే విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలని అంటున్నారు. వీడియో లింకులతోనూ కొందరు ఓన్ ఇన్ఫర్మేషన్ తెలుసుకుంటున్నారు. తెలిసిన గ్రూపుల్లోనూ కొందరు ఇలాంటి రకమైన మెసేజ్లు ఉంచడం వల్ల అవగాహన లేకుండా వాటిని ఓపెన్ చేస్తున్నారు. ఇకనైనా ఇలాంటి మెసేజ్లు విషయంలో జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు.

# టర్కీ, అజర్ బైజాన్ లకు 75 శాతం పడిన పర్యాటకులు

**హైదరాబాద్, మే 20, పెన్ పవర్:**
జమ్మూ కాశ్మీర్లోని పహల్గామ్లో జరిగిన ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్తాన్కు మద్దతు ప్రకటించిన తుర్కియే, అజర్బైజాన్లపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. తుర్కియే పాకిస్తాన్కు డ్రోన్లు, ఆయుధాలు సరఫరా చేయడం, అజర్బైజాన్ భారత దాడులను ఖండిస్తూ పాక్కు సంఘీభావం తెలపడంతో ఈ రెండు దేశాలపై బహిష్కరణ ఉద్యమం ఊపందుకుంది. హెదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల పర్యాటకులు తమ వేసవి సెలవు ప్రణాళికలను రద్దు చేసుకుంటూ ఈ ఉద్యమంలో చురుకుగా పాల్గొంటున్నారు.వేసవి సెలవుల సీజన్లో తుర్కియే, అజర్బైజాన్లు తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు ఆకర్షణీయ గమ్యస్థానాలుగా ఉంటాయి. ఈ ఏడాది దాదాపు లక్ష మందికి పైగా పర్యాటకులు ఈ దేశాలను సందర్శించేందుకు ప్రణాళికలు రూపొందించారని అంచనా. అయితే, ఈ రెండు దేశాలు పాకిస్తాన్కు మద్దతుగా నిలవడంతో హైదరాబాద్లో కేవలం రెండు మూడు రోజుల్లోనే 10 వేల మందికి పైగా పర్యాటకులు తమ బుకింగ్లను రద్దు చేసుకున్నారని వాల్మీకి టూర్స్ అండ్ ట్రావెల్స్ వ్యవస్థాపకుడు హరికిషన్ వెల్లడించారు. ట్రావెల్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కూడా తుర్కియే, అజర్బైజాన్లకు కొత్త బుకింగ్లను నిలిపివేయాలని సూచించింది, దీంతో టూర్ ఆపరేటర్లు ఈ దేశాలకు సంబంధించిన ప్రమోషనల్ ఆఫర్లను ఉపసంహరించారు.

రద్దుల ఇదే కారణం..

హైదరాబాద్: గత వారంలో తుర్కియేకు 22%, అజర్బైజాన్కు 30% బుకింగ్లు రద్దయ్యాయి.

తెలుగు రాష్ట్రాలు: ఆంధ్రప్రదేశ్ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ తుర్కియే, అజర్బైజాన్లకు పర్యాటకులను పంపడం పూర్తిగా నిలిపివేసింది. ఏటా ఈ రెండు దేశాలకు 8 వేల మంది పర్యాటకులు వెళ్లేవారని అంచనా.

జాతీయ స్థాయి: మేక్మైట్రిప్, ఈజ్మైట్రిప్ వంటి ప్రముఖ ట్రావెల్ సంస్థలు తుర్కియే, అజర్బైజాన్లకు బుకింగ్లు 60% తగ్గినట్లు, రద్దులు 250% పెరిగినట్లు నివేదించాయి.

తుర్కియే, అజర్బైజాన్ ఆకర్షణలు..

తుర్కియే, అజర్బైజాన్లు చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి అందాలతో పర్యాటకులను ఆకర్షిస్తాయి. ఈ దేశాల్లోని కొన్ని ప్రముఖ ఆకర్షణలు.

తుర్కియేజి

ఇస్తాంబుల్: చారిత్రక హగీష్ సోఫియా మ్యూజియం, టోప్కపీ ప్యాలెస్, బ్లూ మసీదు వంటి ప్రదేశాలు పర్యాటకులకు మరపురాని అనుభవాన్ని అందిస్తాయి.

కపడోసియా: హాట్ ఎయిర్ బెలూన్ రైడ్లు, పురాతన గుహ నివాసాలు ప్రసిద్ధి.

షాపింగ్: ఇస్తాంబుల్లోని గ్రాండ్ బజార్లో 4 వేలకు పైగా దుకాణాలు ఉన్నాయి, ఇక్కడ సాంప్రదాయ కార్పెట్లు, ఆభరణాలు, డ్రైఫ్రూట్స్ లభిస్తాయి.

ప్రీ%-%వెడ్డింగ్ షూట్లు: బాస్ఫరస్ నది తీరం, పురాతన కోటలు సినిమా, వివాహ షూటింగ్లకు ఆదరణీయం.

అజర్బైజాన్

బాకు: పాత నగరం (ఇచెరిషెహెర్) యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలం. షిర్వాన్షాహ్ ప్యాలెస్, మైడెన్ టవర్ ప్రసిద్ధి.

హైదర్ అలియేవ్ సెంటర్: ఆధునిక ఆర్కిటెక్చర్కు ప్రతీక, జహా హదీద్ రూపొందించిన ఈ కట్టడం పర్యాటకులను ఆకట్టుకుంటుంది.

ఫైర్ టెంపుల్: జొరాస్ట్రియన్ సంస్కృతికి చిహ్నం, చారిత్రక ప్రాముఖ్యత కలిగిన స్థలం.

బడ్జెట్ ఫ్రెండ్లీ: ఒక వారం పర్యటనకు రూ.80 వేల నుంచి రూ.90 వేలు మాత్రమే ఖర్చవుతాయి, ఇది భారతీయులకు సరసమైన గమ్యస్థానంగా చేసింది.

బాయ్కాట్ ప్రభావం

2024లో దాదాపు 3.3 లక్షల మంది భారతీయులు తుర్కియే, 2.4 లక్షల మంది అజర్బైజాన్ను సందర్శించారు, ఈ రెండు దేశాలకు రూ. 6,900 కోట్లకు పైగా ఆదాయాన్ని అందించారు. ప్రస్తుత బహిష్కరణ ఉద్యమంతో ఈ దేశాల టూరిజం ఆదాయంపై తీవ్ర ప్రభావం పడనుంది. తెలుగు రాష్ట్రాల నుంచి ఏటా 8 వేల మంది పర్యాటకులు ఈ దేశాలకు వెళ్తారని, ఇప్పుడు ఈ సంఖ్య గణనీయంగా తగ్గనుందని టూర్ ఆపరేటర్లు అంచనా వేస్తున్నారు. అదనంగా, భారత వాణిజ్య సంస్థ %జూ×ు% తుర్కియే, అజర్బైజాన్లతో వాణిజ్య సంబంధాలను రద్దు చేయాలని 24 రాష్ట్రాల నాయకుల సమావేశంలో నిర్ణయించింది, దీంతో ఈ దేశాల ఆర్థిక నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది.తుర్కియే, అజర్బైజాన్ టూర్లను రద్దు చేసుకుంటున్న తెలుగు పర్యాటకులు ప్రత్యామ్నాయంగా ఆసియా దేశాలను ఎంచుకుంటున్నారు. వీటిలో వియత్నాం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఇతర గమ్యస్థానాల్లో దుబాయ్, మలేసియా, థాయ్లాండ్, ఇండోనేషియా ఉన్నాయి. కూకట్పల్లికి చెందిన ఓ ట్రావెల్స్ ప్రతినిధి మాట్లాడుతూ, "వియత్నాం బడ్జెట్ ఫ్రెండ్లీగా ఉండటమే కాకుండా, హనోయ్, హా లాంగ్ బే, హెూ చి మిన్ సిటీ వంటి ప్రదేశాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి" అని తెలిపారు.

తుర్కియే, అజర్బైజాన్ ప్రతిస్పందన

బహిష్కరణ ఉద్యమం నేపథ్యంలో తుర్కియే టూరిజం శాఖ భారతీయ పర్యాటకుల భద్రత, సంతృప్తికి కట్టుబడి ఉన్నామని, హెూటళ్లు, రెస్టారెంట్లు ఎప్పటిలాగే ఆతిథ్యం అందిస్తాయని ప్రకటించింది. అయితే, ఈ హామీలు పర్యాటకుల నిర్ణయాన్ని మార్చలేకపోయాయి. అజర్బైజాన్ నుంచి ఇప్పటివరకు స్పష్టమైన ప్రతిస్పందన లేదు, కానీ టూరిజం రంగంలో నష్టం స్పష్టంగా కనిపిస్తోంది.

# బంగ్లా. పాకిస్తాన్ లకు భారత్ షాక్



**ముంబై, మే 20, పెన్ పవర్:**
భారత్తో కయ్యానికి కాలుదువ్వుతున్న పొరుగుదేశాలకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దౌత్యపరంగా, ఆర్థిక పరంగా గట్టిగా బుద్ధి చెబుతోంది. మనకు పొరుగునే ఉన్న చైనా, బంగ్లాదేశ్, పాకిస్తాన్ వంటి దేశాలు.. నిత్యం భారత్ అంటే అక్కసు వెళ్లగక్కుతున్నాయి. భారత్కు వ్యతిరేకంగా ఈ 3 దేశాలు పరస్పరం సహకారం అందించుకుంటున్నాయి. షేక్ హసీనా ప్రధానిగా ఉన్నంతవరకు భారత్కు మిత్రదేశంగా ఉన్న బంగ్లాదేశ్.. ఆమె గద్దె దిగిపోవడంతో ఒక్కసారిగా శత్రుదేశంగా మారిపోయింది. ఇక చైనా, పాకిస్తాన్ అయితే గత కొన్ని దశాబ్దాలుగా భారత్తో వైరం పెట్టుకుంటూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ 3 దేశాలకు బుద్ధి చెప్పేందుకు భారత్ అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే బంగ్లాదేశ్, చైనా, పాకిస్తాన్ దేశాలకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి.భూమార్గం ద్వారా బంగ్లాదేశ్ నుంచి భారత్లోకి దిగుమతి అయ్యే వస్త్రాలను ఆంక్షలు విధించే నిర్ణయం కేంద్ర ప్రభుత్వం తీసుకోవడంతో దేశీయ వస్త్ర పరిశ్రమకు రూ.వెయ్యి 1000 కోట్ల నుంచి రూ.2 వేల కోట్ల మేర కొత్త అవకాశాలను తెచ్చిపెట్టే అవకాశం ఉందని భారత్ టెక్స్టైల్స్ పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ఈ నిర్ణయం కారణంగా దేశీయ, ఇంటర్నేషనల్ బ్రాండ్ దుస్తుల సప్లై చైన్ దెబ్బతినే అవకాశాలు ఉన్నాయనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. దీనివల్ల చలికాలంలో టీ-షర్ట్లు, డెనిమ్స్ దుస్తుల ధరలు 2-3 శాతం పెరిగే అవకాశం ఉందని సమాచారం.దీనికి సంబంధించి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్టీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. బంగ్లాదేశ్ నుంచి భూ సరిహద్దుల ద్వారా దుస్తులు, ఇతర ఉత్పత్తుల దిగుమతులను భారత్ నిషేధించింది. అయితే కోల్కతా, నవ షేవా పోర్టుల ద్వారా సరుకు రవాణాకు అనుమతి ఉంది. భారత్లోకి వచ్చే వస్తువులపై దిగుమతి సుంకం లేని కారణంగా బంగ్లాదేశ్ నుంచి పన్ను లేకుండానే దిగుమతి అయ్యే వస్త్రాలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కారణంగా దేశీయంగా టెక్స్టైల్స్ పరిశ్రమను ప్రోత్సహించి.. విదేశీ దుస్తులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. అదే సమయంలో చైనా నుంచి రహస్యంగా బంగ్లాదేశ్ మీదుగా భారత్లోకి మళ్లించబడుతున్న వస్తువులను కూడా అరికట్టవచ్చని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అయితే చైనా నుంచి భారత్లోకి నేరుగా రవాణా చేస్తే ప్రస్తుతం 20 శాతం దిగుమతి సుంకం విధిస్తున్నారు.భారత్ నుంచి ఎగుమతి అయ్యే నూలుపై ఏప్రిల్ నెలలోనే బంగ్లాదేశ్ పరిమితులు విధించిందని.. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్టైల్ ఇండస్ట్రీ (సీఐటీఐ) ఛైర్మన్ రాకేష్ మెహ్రా తెలిపారు. ఇది సాంప్రదాయకంగా భారత్ మొత్తం నూలు ఎగుమతిలో దాదాపు 45 శాతం ఉంటుంది. బంగ్లాదేశ్ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయానికి వ్యూహాత్మకంగా భారత్ తీసుకున్న బలమైన ప్రతిస్పందనగా కనిపిస్తోందని రాకేష్ మెహ్రా వెల్లడించారు. ఈ నిర్ణయం బంగ్లాదేశ్ దుస్తుల దిగుమతి వ్యయాన్ని పెంచుతుందని.. దీని వల్ల దేశీయ రెడీమేడ్ గార్మెంట్ ఉత్పత్తిదారులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని తెలిపారు. భారత్ నుంచి నూలు ఎగుమతి చేసేవారు తమ సరఫరాను దేశీయ మార్కెట్కు మళ్లించడానికి వీలు కలుగుతుందని.. తద్వారా డిమాండ్ గ్యాపును పూరించవచ్చని పేర్కొన్నారు.క్లాతింగ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఏఐ) అధ్యక్షుడు సంతోష్ కటారియా.. తక్కువ ధర కలిగిన బట్టలు భారతీయ రిటైల్ మార్కెట్లోకి అడ్డగోలుగా ప్రవేశిస్తున్నాయనే పరిశ్రమ దీర్ఘకాలిక ఆందోళనను ఈ చర్య పరిష్కరిస్తుందని.. ఇది దేశీయ తయారీదారులపై ముఖ్యంగా ఎంఎస్ఎంఈలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

# మహానాడుకు జూనియర్...




**కడప, మే 20, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడుకు సమయం ఆసన్నం అవుతోంది. ఈనెల 27 నుంచి మూడు రోజులపాటు మహానాడు కడపలో జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు ప్రతిష్టాత్మకంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పార్టీ ముఖ్య నేతలకు బాధ్యతలు అప్పగించారు. ప్రధానంగా కమిటీలు ఏర్పాటు చేశారు. భారీ విజయంతో అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి మహానాడు ఇది. అందుకే ఘనంగా నిర్వహించాలని ప్లాన్ చేశారు. అయితే ఈసారి చేసే రాజకీయ తీర్మానాలు కీలకంగా మారనున్నాయి. మరో నాలుగు దశాబ్దాల పాటు పార్టీ మనుగడ సాధించేలా కీలక నిర్ణయాలు తీసుకొనున్నారు. ముఖ్యంగా నందమూరి కుటుంబ సభ్యులను మహానాడులో భాగస్వామ్యం చేయనున్నారు. ఈసారి మహానాడుకు జూనియర్ ఎన్టీఆర్ ను పిలవాలని నిర్ణయం పార్టీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది.తెలుగుదేశం పార్టీకి మహానాడు పండుగ లాంటిది. ఆ పార్టీ ఆవిర్భావము నుంచి నందమూరి తారక రామారావు పుట్టినరోజు సందర్భంగా మహానాడు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఎన్టీఆర్ మరణానంతరం కూడా ఆయన జయంతి నాడు మహానాడు ను నిర్వహిస్తూ వచ్చారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి కడప జిల్లాలో మహానాడు ను నిర్వహించాలని నిర్ణయం తీసుకోనున్నారు. అయితే ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు కడప జిల్లాలో మహానాడు జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కూడా మహానాడు నిర్వహించాలని టిడిపి హై కమాండ్ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు కడపలో మహానాడు కోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులు, పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముఖ్య నేతలు హాజరు కానున్నారు.మరోవైపు నందమూరి హీరోలను భాగస్వాములను చేయాలని టిడిపి హై కమాండ్ భావిస్తోంది. అందులో భాగంగా చాలా కాలంగా పార్టీ వ్యవహారాలకు, కుటుంబ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న జూనియర్ ఎన్టీఆర్ ను మహానాడుకు ఆహ్వానించాలని నిర్ణయించినట్లు సమాచారం. అందుకు సంబంధించి నందమూరి బాలయ్య చొరవ తీసుకున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. 2009 ఎన్నికల్లో టిడిపి గెలుపు కోసం జూనియర్ ఎన్టీఆర్ ప్రచారం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర చేపట్టారు. అటు తరువాత పార్టీ కార్యక్రమాలతో పాటు మహానాడులోనూ పాల్గొన్నారు. 2014లో ఏపీలో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు ప్రమాణస్వీకారానికి హాజరయ్యారు. అటు తరువాత క్రమేపి పార్టీతో పాటు కుటుంబ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పూర్తిగా సినిమాలకే పరిమితం అయ్యారు.అయితే 2024 ఎన్నికలకు ముందు జూనియర్ ఎన్టీఆర్ పేరు తరచూ పార్టీలో వినిపించేది. జూనియర్ ఎన్టీఆర్ సేవలను వినియోగించుకోవాలని కేడర్ కోరేది. అయితే జూనియర్ ఎన్టీఆర్ పార్టీతో పాటు నందమూరి కుటుంబ సభ్యులకు దూరంగా ఉండేవారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోని కొందరు ముఖ్య నేతలు జూనియర్ ఎన్టీఆర్ తో సహితంగా ఉండడం%% వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలపై టిడిపి అంచనాలకు తగ్గట్టు జూనియర్ ఎన్టీఆర్ స్పందించకపోవడం టిడిపి శ్రేణుల్లో ఒక రకమైన ఆగ్రహానికి కారణమయ్యారు. అయితే 2024 ఎన్నికల్లో టిడిపి గెలిచిన తర్వాత చంద్రబాబుతో పాటు లోకేష్ కు జూనియర్ ఎన్టీఆర్ అభినందనలు తెలిపారు. అటు తరువాత జూనియర్ ఎన్టీఆర్ నటించిన ఆర్ఆర్ఆర్ చిత్రానికి ఆస్కార్ అవార్డు లభించడంపై జూనియర్ ఎన్టీఆర్ను అందరూ అభినందించారు. ఒక రకమైన సానుకూల వాతావరణం ఏర్పడిన ప్రస్తుత పరిస్థితుల్లో జూనియర్ ఎన్టీఆర్ మహానాడుకు పిలిస్తే బాగుంటుందన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తం అవుతోంది. అయితే పూర్తిగా సినిమాలపైనే ఫోకస్ పెట్టారు జూనియర్ ఎన్టీఆర్. మరి టిడిపి నుంచి ఆహ్వానం వెళ్తే ఎలా స్పందిస్తారో చూడాలి.

# వంద రోజులుగా జైల్లోనే వంశీమోహన్
# రాజకీయాలకు గుడ్ బై



**విజయవాడ, మే 20, పెన్ పవర్:** మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ ఇప్పట్లో జైలు నుంచి బయటపడే అవకాశం కనిపించడం లేదు. ఆయనపై వరుస పెట్టి కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ఒక కేసులో బెయిల్ లభిస్తే.. మరో కేసు నమోదు చేస్తున్నారు. దీంతో వల్లభనేని వంశీ మోహన్ రిమాండ్ ఖైదీగానే ఉండిపోవాల్సి వస్తోంది. మరోవైపు ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. శ్వాస తీసుకోవడానికి కూడా ఆయన ఇబ్బంది పడుతున్నారు. అందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వల్లభనేని వంశీ మోహన్ పరిస్థితిని తలచుకొని ఆయన అభిమానులు బాధపడుతున్నారు. అదే సమయంలో వల్లభనేని వంశీ మోహన్ రాజకీయంగా తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిణామాలను తలచుకొని ఆయన బాధపడుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా రాజకీయాల విషయంలో కీలక నిర్ణయానికి వచ్చారు. బెయిల్ లభించిన వెంటనే ఆయన ఓ ప్రకటన చేయడానికి సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. ఆ కామెంట్స్ పై పశ్చాత్తాపం.. గన్నవరం నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు టిడిపి అభ్యర్థిగా గెలిచారు వల్లభనేని వంశీ మోహన్. 2014లో తొలిసారిగా గన్నవరం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2019లో రెండోసారి ఆయనకే ఛాన్స్ ఇచ్చారు చంద్రబాబు. జగన్ ప్రభంజనంలో సైతం వల్లభనేని వంశీ మోహన్ టిడిపి అభ్యర్థిగా గెలిచారు. అయితే గెలిచిన కొద్ది రోజులకే ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. చంద్రబాబుతో పాటు లోకేష్ పై నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేసేవారు. ఆ వ్యాఖ్యల వెనుక జగన్మోహన్ రెడ్డి ప్రోత్సాహం ఉందన్నది బహిరంగ రహస్యం. అయితే ఇప్పుడు దానికి మూల్యం చెల్లించుకుంటున్నారు వల్లభనేని వంశీ మోహన్. సుమారుగా 100 రోజులపాటు జైల్లో ఉండి అనారోగ్యానికి గురయ్యారు. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఆశించిన స్థాయిలో న్యాయ సాయం అందడం లేదని ఆవేదనతో ఉన్నట్లు సమాచారం. పార్టీ కోసం తన వ్యక్తిగతంగా దెబ్బతిన్నానని.. నాడు తాను ఆ వ్యాఖ్యలు చేసి ఉండకూడదని ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నట్లు తెలుస్తోంది.గన్నవరం టిడిపి కార్యాలయం పై దాడి, అక్కడ పనిచేస్తున్న సత్య వర్ధన్ అనే వ్యక్తి కిడ్నాప్ వంటి కేసులు నమోదు చేశారు ఏపీ పోలీసులు. ఫిబ్రవరి 13న హైదరాబాదులో వల్లభనేని వంశీ మోహన్ ను అరెస్టు చేశారు. అప్పటినుంచి కేసు మీద కేసులు పెడుతూనే ఉన్నారు. మొత్తం ఆరు కేసులు పెట్టారు. అందులో ఐదు కేసుల్లో బెయిల్ లభించింది. అయితే ఇంతలో నకిలీ ఇళ్లపట్టాలకు సంబంధించి కేసు నమోదు చేశారు. దీంతో ఆయన రిమాండ్ మరో రెండు వారాలపాటు పొడిగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది. అయితే వల్లభనేని వంశీ మోహన్ విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఆశించిన స్థాయిలో సాయం అందడం లేదు. దీంతో ఆయన తీవ్ర మనస్తాపంతో ఉన్నట్లు తెలుస్తోంది. లాయర్లతో వంశీ మోహన్ భార్య స్వయంగా మాట్లాడుతూ సమన్వయం చేసుకుంటున్నారు. పార్టీ కోసం ఇంత చేస్తే.. అధినేత జగన్మోహన్ రెడ్డి పట్టించుకోకపోవడంపై వల్లభనేని వంశీ మోహన్ ఆవేదనతో ఉన్నట్లు తెలుస్తోంది.మరోవైపు గన్నవరం విషయంలో జగన్మోహన్ రెడ్డి ఒక నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి బాధ్యతలను దుట్టా రామచంద్ర రావు కుమార్తెకు అప్పగిస్తారని తెలుస్తోంది. ఈ నిర్ణయంతో వల్లభనేని వంశీ మోహన్ లో మరింత మనస్థాపం పెరిగినట్లు సమాచారం. తనకు మాట మాత్రం చెప్పకుండా నియోజకవర్గ బాధ్యతలు వేరొకరికి ఎలా అప్పగిస్తారని లోలోపల బాధపడుతున్నట్లు తెలుస్తోంది. అందుకే బెయిల్ పై విడుదలైన వెంటనే ఒక ప్రకటన జారీ చేయాలని వంశీ నిర్ణయించుకున్నట్లు సమాచారం. రెండుసార్లు తెలుగుదేశం పార్టీ గుర్తుపై గెలిచారు వల్లభనేని వంశీ మోహన్. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి తన ప్రభావాన్ని కోల్పోయారు. తన ఈ పరిస్థితికి జగన్మోహన్ రెడ్డి తీరు కారణమని వల్లభనేని వంశీ మోహన్ ఆరోపించే అవకాశం కనిపిస్తోంది. మొత్తానికైతే వల్లభనేని వంశీ మోహన్ లో రియలైజేషన్ కనిపిస్తోంది. తీవ్ర నిర్ణయం దిశగా ఆయన ఆలోచన చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# చాట్ జీపీటీ, ఏఐని ఓన్ చేసుకుంటున్న బాబు

**విజయవాడ, మే 20,పెన్ పవర్:** చంద్రబాబు. ఈ మాట వింటే గుర్తుకొచ్చే పేరు టెక్నాలజీ. దేశ ప్రధాని నరేంద్ర మోడీ లాంటి నేత చంద్రబాబు టెక్నాలజీకి జై కొట్టారు. అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రధాని.. తన స్నేహితుడు చంద్రబాబు టెక్నాలజీకి ఆధ్యుడు అని కొనియాడారు. గుజరాత్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబును చూసి చాలా నేర్చుకున్నానని చెప్పుకొచ్చారు. అయితే ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ నిర్మించిన ఘనత ఆయనదే. దీనిని ఆయన ప్రత్యర్థులు సైతం ఒప్పుకుంటారు. అయితే చంద్రబాబు తనకున్న ఈ బ్రాండ్ ను అన్ని సందర్భాల్లో వాడుకోగలరు. 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అని చెబుతున్నారు. డ్రోన్స్ రంగానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఇదంతా చంద్రబాబు ముందు చూపుతోనే చేస్తున్నారు.తాజాగా విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు ఏపీ సీఎం చంద్రబాబు. అక్కడ కూడా టెక్నాలజీ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. విజయవాడలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టెక్ ఏఐ కాంక్లేవ్ నిర్వహించారు. సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏ పనైనా సులువుగా చేసుకునే పరిస్థితి వచ్చిందని చెప్పుకొచ్చారు. గతంలో ఎక్కడ చూసినా రహదారులు గుంతలతో కనిపించేవారు. కానీ ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో రోడ్లను చక్కగా నిర్మించినట్లు చెప్పారు. మరోవైపు జాతీయ రహదారుల విస్తరణ విషయాన్ని కూడా ప్రస్తావించారు. సంపద సృష్టించాలి.. ప్రజలకు అందించాలి.. పేదరికం లేని సమాజమే లక్ష్యం అని తేల్చి చెప్పారు చంద్రబాబు. రైతు అనుబంధ రంగాల సేవలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కూడా చెప్పారు.అయితే చంద్రబాబు తన ప్రసంగంలో చివరి మాటగా టెక్నాలజీని ప్రస్తావించారు. ఏ సమావేశం అయినా తాను టెక్నాలజీ గురించి మాట్లాడకుండా ఉండలేనని కూడా చెప్పుకొచ్చారు. ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందన్నారు. దానిని సద్వినియోగం చేసుకోవడంలో భారతదేశ ముందు ఉండడం ఆనందంగా ఉందన్నారు. అందులోనూ తెలుగు ప్రజలు టెక్నాలజీని విరివిగా వాడుకుంటున్నారని చెప్పారు. సాంకేతిక యుగంలో సమర్థత పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో ప్రపంచంలోనే భారతీయులు ముందున్నారని చెప్పారు. అందులో తెలుగు ప్రజలు అధికంగా టెక్నాలజీని వాడుకొని అభివృద్ధి చెందుతున్న విషయాన్ని ప్రస్తావించారు. తద్వారా టెక్నాలజీకి తాను ఎంత ప్రాధాన్యం ఇచ్చానో.. తద్వారా ఎంత అభివృద్ధి జరిగిందో వివరించే ప్రయత్నం చేశారు. మొత్తానికి ఏ సమావేశం అయినా.. తన టెక్నాలజీకి కొంత భాగం చంద్రబాబు కేటాయించడం పరిపాటిగా మారింది.

# గ్రీవెన్స్ సెల్ లోనే లంచం... ఆత్మహత్యాయత్నం

**గుంటూరు, మే 20, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేసింది. వారంలో ఒకసారి ఇక్కడకు వచ్చి తమ సమస్యలను చెప్పుకుంటున్నారు. ఇలా వస్తున్న ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదనతో ప్రమాదకరమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. మరికొందరు అధికారులే షాక్ తినేలా ప్రవర్తిస్తున్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం కలెక్టరేట్‌కు ఓ యువతి వచ్చింది. తన భూమి కబ్జా అయిందని చెప్పింది. భువనేశ్వరి అనే యువతి తన సమస్యను వివరించే అర్జీతోపాటు తన చెవిదుద్దులను కూడా అధికారుల ముందు పెట్టింది. దీంతో అధికారులు షాక్ తిన్నారు. తన భూమి కబ్జాకు గురి అయిందని వాపోయారు. తన భూమి వివాదం కోర్టులో ఉండగానే కొందరు వ్యక్తులు వచ్చి కబ్జా చేశారని. అక్కడ ఇల్లు నిర్మిస్తున్నారని తెలిపింది. భూ వివాదంపై స్థానిక నాయకత్వాన్ని అధికారులను కలిసినా ఎవరూ న్యాయం చేయడం లేదని ఆ యువతి బోరుమన్నారు. డబ్బులు ఉన్న వారికే న్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. అందుకే ఉన్నతాధికారులైనా న్యాయం చేస్తారనే తన చెవి దుద్దులను తీసి ఇచ్చినట్టు చెబుతున్నారు. తనకు ఎవరి అండా లేదని అన్నారు. తాతయ్య తానే ఉంటున్నామని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. గుంటూరు జిల్లాలో కూడా కలెక్టరేట్ వద్ద మహిళ సూసైడ్ అటెంప్ట్ చేశారు. తన సమస్యలు చెప్పుకోవడానికి ఈ ఉదయం కలెక్టరేట్‌కు వెళ్లారు. తన స్థలం కబ్జాకు గురి అయిందని చాలా రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు. అందుకే ఇవాళ కలెక్టరేట్‌కు వచ్చిన ఆమె తన తెచ్చుకున్న పురుగుల మందు తాగేశారు. పురుగుల మందు తాగేసిన మహిళ తన భూమి కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులకు ఈ విషయం చెప్పేసి అక్కడే కూర్చుండిపోయారు. వెంటనే అధికారులు స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. స్పాట్‌కు వచ్చిన పోలీసులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. తాను అక్కడి నుంచి కదలబోనంటూ భీష్మించించారు. తన భూమిని కబ్జా చేసిన వాళ్ళపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొత్తానికి ఆమెను అధికారులు ఒప్పించి అక్కడి నుంచి ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో అక్కడ కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది.

# చిత్తూరు, విజయనగరం జిల్లాలకు కుంకీ ఏనుగులు

**తిరుపతి, మే 20, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌కు కుంకీ ఏనుగులు ఎంట్రీ ఇవ్వబోతున్నాయి.. రాష్ట్రంలో పంట పొలాలను నాశనం చేస్తున్న ఏనుగుల బెడద నుంచి రక్షించేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఏనుగుల్ని అదుపు చేయడానికి కర్ణాటక ప్రభుత్వం సహకారంతో ఆరు కుంకీ ఏనుగులు ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయి. ఈ మేరకు కర్ణాటక అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే క్లారిటీ ఇచ్చారు. ఈ నెల 21న బెంగళూరులోని విధానసౌధలో ఏనుగులను అప్పగించే కార్యక్రమం జరుగుతుందన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.కర్ణాటక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ రాష్ట్రాలతో స్నేహంగా ఉంటోంది అని మంత్రి ఈశ్వర్ ఖండ్రే అన్నారు. గతేడాది ఆగస్టు 8న పవన్ కళ్యాణ్ కుంకీ ఏనుగులు కావాలని కోరారని గుర్తు చేశారు. సెప్టెంబర్ 27న విజయవాడలో జరిగిన చర్చల్లో ఏనుగులను ఇచ్చేందుకు అంగీకరించారని.. ఇప్పుడు వాటిని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మైసూరు దసరా ఉత్సవాల్లో పాల్గొనే ఏనుగులను మాత్రం ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వడం లేదన్నారు. ఏపీ నుంచి ఏనుగులు కర్ణాటకలోకి రాకుండా అక్కడి ప్రభుత్వమే చర్యలు తీసుకుంటోంది అన్నారు.ఆంధ్రప్రదేశ్ (ఏపీ), కర్ణాటక ప్రభుత్వాలు కుంకీ ఏనుగుల విషయంలో ఒక ఒప్పందం చేసుకున్నాయి. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రే సమక్షంలో ఇరు రాష్ట్రాల అటవీ శాఖ అధికారులు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. కర్ణాటక నుంచి 8 ఏనుగులను ఏపీకి పంపడానికి ఈ ఒప్పందం కుదిరింది. చిత్తూరు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో ఏనుగుల వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను పరిష్కరించడానికి ఈ చర్య తీసుకున్నారు. ఈ సమస్యపై పవన్ కళ్యాణ్ ఇటీవల బెంగళూరు వెళ్లి కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రేతో చర్చించారు. కుంకీ ఏనుగులను పంపమని ఆయన కోరగా, వారు వెంటనే అంగీకరించారు. ఈ మేరకు ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగింది.చిత్తూరు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో ఏనుగుల సంచారం వల్ల వస్తున్న సమస్యలను పరిష్కరించడానికి కుంకీ ఏనుగులను తెస్తున్నామన్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. కర్ణాటక అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేతో మాట్లాడిన వెంటనే ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ప్రస్తుతం అటవీ శాఖ దగ్గర ఉన్న ఏనుగులు వయసు పైబడటంతో ఇబ్బందులు వస్తున్నాయని.. అందుకే అదనంగా కొన్ని కుంకీ ఏనుగులను పంపమని కర్ణాటకను కోరామన్నారు. వీటి ద్వారా ఏపీలోని చిత్తూరు, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లో ఏనుగుల దాడుల సమస్యను అరికట్టవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# రూమర్స్ కు గులాబీ చెక్

**హైదరాబాద్, మే 20,పెన్ పవర్:** గులాబీ పార్టీలో జరుగుతున్న పరిణామాలు రాజకీయంగా ఆసక్తి రేపుతున్నాయి. 2023లో పార్టీ ఓటమి పాలై అధికారం కోల్పోయాక పరిస్థితుల్లో క్రమంగా మార్పు వస్తుందన్న టాక్ విన్పిస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్ దాదాపు ఫామ్ హౌస్ కే పరిమితం కావడంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో అన్నీ తానై నడిపిస్తున్నారు కేటీఆర్. ఇదే సమయంలో కేసీఆర్ కుటుంబ సభ్యులైన మాజీ మంత్రి హరీష్ రావు..పార్టీలో పరిమితమైన పాత్ర పోషిస్తున్నారన్న చర్చ గులాబీ వర్గాల్లో నడుస్తోంది.ఇప్పుడు ప్రతిపక్ష పార్టీగా ఏ కార్యక్రమం నిర్వహించినా వాటన్నింటిలోనూ కేటీఆరే కనిపిస్తున్నారు. దీంతో హరీష్ రావు సాధ్యమైనంత వరకు తన నియోజకవర్గం సిద్దిపేటకు మాత్రమే పరిమితం అవుతున్నారట. దీంతో తనకు పార్టీలో తగిన ప్రాధాన్యం దక్కడంలేదని హరీష్ రావు అలకబూనారని, అందుకే పార్టీ కార్యక్రమాలకు అంటీ ముట్టనట్లు ఉంటున్నారనే ప్రచారం పార్టీ నేతల్లో జరుగుతోంది. అంతే కాకుండా కేటీఆర్ కు హరీష్ రావుకు మధ్య అంతరం పెరిగిందని, కేసీఆర్ కుటుంబంలో విభేదాలు చెలరేగాయన్న టాక్ సైతం పొలిటికల్ సర్కిల్స్ లో వినిపించిందిఈ క్రమంలోనే హరీశ్ రావు బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నారని, కొత్త రాజకీయ పార్టీ పెడుతున్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. దీంతో మా పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని హరీశ్ రావు మీడియా ముందుకు వచ్చి వివరణ ఇచ్చారు. ఈ క్రమంలో పార్టీ పగ్గాలు కేటీఆర్ కు అప్పగిస్తూ కేసీఆర్ నిర్ణయం తీసుకుంటే దానిని కట్టుబడి ఉంటానని హరీశ్ స్వయంగా ప్రకటించి ఊహాగానాలకు తెరదించే ప్రయత్నం చేశారు . అయినా ఎక్కడో తేడా కొడుతోందన్న చర్చ పార్టీ వర్గాల్లో సాగిందట. పైకి అలా చెబుతున్నారే కానీ..లోపల ఏదో జరుగుతోందన్న అనుమానాన్ని కొందరు నేతలు వ్యక్తం చేస్తున్నారట.దీంతో ఇక లాభం లేదనుకొని స్వయంగా కేటీఆర్ రంగంలోకి దిగారట. పార్టీలో జరుగుతున్న రూమర్స్ కు చెక్ పెట్టాలంటే బావ హరీష్ రావును కలవడమే మంచిదని ఆయన భావించినట్లు నేతలు చెబుతున్నారు. ఈ క్రమంలోనే హరీశ్ రావు నివాసానికి కేటీఆర్ వెళ్లి కలిశారని అంతా అనుకుంటున్నారు. హరీశ్ రావుతో దాదాపు రెండు గంటల పాటు సమావేశమైన కేటీఆర్..ఆయనతో ఏకాంతంగా సుమారు 45 నిమిషాల పాటు చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సుధీర్ఘ భేటీలో రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, బీఆర్ఎస్ లో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్తు కార్యాచరణ వంటి అంశాలపై సుధీర్ఘంగా చర్చించినట్లు గులాబీవర్గాల్లో చర్చ జరుగుతోంకొన్ని రోజులుగా జరుగుతున్న రూమర్స్ కు చెక్ పెట్టేందుకే కేటీఆర్..హరీష్ రావు ఇంటికి వెళ్లి కలిశారన్న టాక్ రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది. ఈభేటీ ద్వారా తమ మధ్య ఏ మాత్రం విభేదాలు లేవని, అంతా కలసికట్టుగానే ఉన్నామని, ఇకపై పార్టీ భవిష్యత్తు కోసం పనిచేస్తామని క్యాడర్ కు సందేశం ఇచ్చారని అంటున్నారు. మళ్లీ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఇలాగే కలిసి పనిచేస్తామని చెప్పకనే చెప్పారని, ఈ పరిణామంతో బీఆర్ఎస్ లో ఎలాంటి విభేదాలు లేవని, మరీ ముఖ్యంగా హరీష్ రావు ఏమాత్రం అసంతృప్తితో లేరని, కేటీఆర్ తో సఖ్యతగానే ఉన్నారనే మెస్సేజ్ వెళ్లిందని భావిస్తున్నారట.ఇదే సమయంలో ఎమ్మెల్సీ కవిత సైతం కాస్త సైలెంట్ అయిపోతారన్న టాక్ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. కొద్దిరోజుల క్రితం గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై విమర్శలు గుప్పించి కేసీఆర్ ను, పార్టీని ఇరకాటంలో పడేశారన్న విమర్శలను ఎదుర్కొన్న కవిత..ప్రస్తుతం అమెరికా పర్యటనకు వెళ్లారు. యూఎస్ నుంచి వచ్చిన తర్వాత దూకుడుగా వ్యవహరించవద్దని, పార్టీ లైన్ లో కేటీఆర్, హరీష్ లతో కలిసి పనిచేయాలని ఆమెకు కేసీఆర్ ఆదేశించినట్లు తెలుస్తోంది.మొత్తానికి హరీశ్ ఇంటికి కేటీఆర్ స్వయంగా వెళ్లి కలవడంతో పార్టీలో విన్పిస్తున్న గుసగుసలకు చెక్ పెట్టినట్లు అయిందన్న చర్చ నడుస్తోంది. ఈ భేటీతో ఇక పార్టీలో నెలకొన్న అనుమానాలకు, ఆందోళనలకు తెరపడినట్టేనని, ఇకనుంచి మరింత ఉత్సాహంతో పార్టీ కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేయాలని కేటీఆర్ డిసైడ్ అయినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## బెంగళూరు బ్యాడ్‌లక్.. RCB, సన్ రైజర్స్ మ్యాచ్‌కు వేదిక మార్చిన బీసీసీఐ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో మరో మ్యాచ్ రద్దు కాకుండా బీసీసీఐ జాగ్రత్తలు తీసుకుంది. ఇందులో భాగంగా శుక్రవారం (మే 23) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్ రైజర్స్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ ను బీసీసీఐ బెంగళూరు నుంచి లక్నోకి మార్చింది. బెంగళూరులోని ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా వేదిక మార్చాల్సి వచ్చింది. "రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరగాల్సిన ఐపీఎల్ మ్యాచ్ బెంగళూరులో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో లక్నోలోని భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఎకానా క్రికెట్ స్టేడియంకు మార్చారు" అని బీసీసీఐ మంగళవారం తమ అధికారిక ప్రకటనలో తెలిపింది.

బెంగళూరులో ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా నగరంలోని వివిధ ప్రాంతాలు జలమయమయ్యాయి. భారత వాతావరణ శాఖ ప్రకారం.. బెంగళూరులో రాబోయే ఐదు రోజులు వర్షాలు కురుస్తాయని అంచనా వేయబడింది. ఐపీఎల్ రీ స్టార్ట్ లో భాగంగా జరిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, కోల్ కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. భారీ వర్షం కారణంగా ఒక్క బంతి కూడా పడలేదు. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్ ఇచ్చారు. ఈ సీజన్ లో ఆర్సీబీ ఇప్పటికే ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించగా.. సన్ రైజర్స్ ప్లే ఆఫ్స్ నుంచి అధికారికంగా నిష్క్రమించింది. ఈ మ్యాచ్ సన్ రైజర్స్ కు నామమాత్రం అయినప్పటికీ ఆర్సీబీ సీరియస్ గా తీసుకుంటుంది. టాప్ 2 లో వారు స్థానం సంపాదించాలంటే ఈ మ్యాచ్ లో విజయం చాలా కీలకం. ఈ మ్యాచ్ తో పాటు బీసీసీఐ ప్లే ఆఫ్స్ కు వేదికలు ఖరారు చేసింది. ఇందులో భాగంగా క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచ్ లు పంజాబ్ లోని ముల్లన్పూర్ లో జరుగుతాయి. క్వాలిఫయర్ 2,ఫైనల్ కు అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరుగుతాయి. క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచ్ లు వరుసగా మే 29, మే 30 న జరుగుతాయి. జూన్ 1 న క్వాలిఫయర్ 2, జూన్ 3 న ఫైనల్ మ్యాచ్ లు జరగనున్నాయి.

## బుమ్రాకు నో ఛాన్స్.. గిల్, పంత్‌పై సెలక్టర్లు అసంతృప్తి.. టీమిండియా టెస్ట్ కెప్టెన్ అతడేనా..




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా టెస్ట్ కెప్టెన్ ఎవరనే విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. ఇంగ్లాండ్ టూర్ లో భాగంగా జూన్ 20 నుంచి భారత్ 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ కు త్వరలో స్క్వాడ్ ను ప్రకటించనున్నారు. రోహిత్ శర్మ అనూహ్యంగా టెస్ట్ ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించడంతో హిట్ మ్యాన్ స్థానంలో ఎవరిని కెప్టెన్ గా ఎంపిక చేయాలో సెలక్టర్లకు పెద్ద తలనొప్పిగా మారింది. వాస్తవానికి భారత జట్టుకు వైస్ కెప్టెన్ గా ఉంటున్న జస్ప్రీత్ బుమ్రాను కెప్టెన్ గా చేయాల్సింది. కానీ బుమ్రా ఫిట్ నెస్ సమస్యలు కారణంగా అన్ని టెస్ట్ మ్యాచ్ లకు అందుబాటులో ఉండడం లేదు. బుమ్రా సైతం టెస్ట్ కెప్టెన్సీ ఆఫర్ ను తిరస్కరించినట్టు సమాచారం. ఫిట్‌నెస్ సమస్యల కారణంగా పూర్తి సిరీస్‌లకు అతను అందుబాటులో ఉండటం సందేహాస్పదం కావడమే ఇందుకు కారణం అవుతోంది. తనను ఫుల్ టైమ్ కెప్టెన్‌గా పరిగణించకపోవడానికి కూడా ఇదే అడ్డంకిగా మారుతోంది. హిట్‌మ్యాన్ వారసుడిగా శుభ్‌మన్ గిల్ టెస్టు ఫార్మాట్‌లో కొత్త కెప్టెన్‌గా.. వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్‌కు వైస్ కెప్టెన్సీ అప్పగించాలని నిన్నటివరకు వార్తలు వచ్చాయి. అయితే తాజా సమాచార ప్రకారం వీరిద్దరికి టెస్ట్ కెప్టెన్సీ అప్పగించడానికి సెలక్టర్లు సిద్ధంగా లేనట్టు వార్తలు వస్తున్నాయి.

ఇటీవలే గిల్, పంత్ తో సెలక్టర్లు అనధికారిక చర్చలు జరిపారు. గిల్ విదేశాల్లో రికార్డ్ దారుణంగా ఉంది. కేవలం 25 యావరేజ్ తోనే పరుగులు చేశాడు. ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో గిల్ కనీసం ప్లేయింగ్ 11 లో చోటు దక్కించుకోలేకపోయాడు. దీంతో గిల్ పై సెలక్టర్లు అంతగా ఆసక్తి చూపనట్టు సమాచారం. ఇక రిషబ్ పంత్ ప్రస్తుతం పేలవ ఫామ్ లో ఉన్నాడు. ఈ వికెట్ కీపర్ బ్యాటర్ బోర్డర్ గవశక్ర ట్రోఫీలో ఫ్లాప్ షో చేయగా.. ప్రస్తుతం ఐపీఎల్ లో ఘోరంగా విఫలమవుతున్నాడు. దీంతో పంత్, గిల్ ను కాకుండా అనుభవజ్ఞుడు కేఎల్ రాహుల్ ను టీమిండియా టెస్ట్ కెప్టెన్ గా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. జూన్ 20 నుంచి ఇంగ్లాండ్, భారత్ జట్ల మధ్య 5 టెస్ట్ మ్యాచ్ ల సిరీస్ జరుగుతుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్స్ షిప్ 2025-27 సైకిల్ లో టీమిండియాకు ఇదే తొలి సిరీస్. ఈ సారి ఇండియా ఎక్కువగా యంగ్ ప్లేయర్లతోనే బరిలోకి దిగబోతుంది. ఇంగ్లాండ్ తో టెస్ట్ సిరీస్ కు ముందు ఇంగ్లాండ్ లయన్స్ తో యంగ్ ఇండియా రెండు ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ల సిరీస్ ఆడుతుంది. హెడ్డింగ్లేలో జూన్ 20 న తొలి టెస్ట్ మ్యాచ్ జరగనుంది. సిరీస్‌లోని మిగతా నాలుగు టెస్టులకు ఎడ్జ్‌బాస్టన్, లార్డ్స్, ఓల్డ్ ట్రాఫోర్డ్ ఓవల్ వేదికలు కానున్నాయి.

## పంజాబ్, గుజరాత్‌కు బంపర్ ఛాన్స్.. ఐపీఎల్ ప్లే ఆఫ్స్ వేదికలు ఇవే!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 ఫైనల్ ప్లే ఆఫ్స్ వేదికలు ఖరారైనట్టు సమాచారం. ఇండియా, పాకిస్థాన్ ఉద్రిక్తల పరిస్థితుల నేపథ్యంలో ఐపీఎల్ 2025కు బ్రేక్ పడడంతో షెడ్యూల్ తో పాటు వేదికలు కూడా మార్చాల్సి వచ్చింది. ఐపీఎల్ రీ స్టార్ట్ తర్వాత లీగ్ లో మిగిలిన మ్యాచ్ లకు వేదికలు ప్రకటించిన బీసీసీఐ.. ప్లే ఆఫ్స్ ఎక్కడ జరుగుతాయనే విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే వస్తున్న సమాచార ప్రకారం ఐపీఎల్ ప్లే ఆఫ్స్ కు బీసీసీఐ వేదికలను బీసీసీఐ ఫిక్స్ చేసిందట. ఇందులో భాగంగా క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచ్ లు పంజాబ్ లోని ముల్లన్పూర్ లో జరుగుతాయి. క్వాలిఫయర్ 2,ఫైనల్ అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరుగుతాయి. క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచ్ లు వరుసగా మే 29, మే 30 న జరుగుతాయి. జూన్ 1 న క్వాలిఫయర్ 2, జూన్ 3 న ఫైనల్ మ్యాచ్ లు జరగనున్నాయి. ఈ వేదికలు పంజాబ్, గుజరాత్ జట్లకు అనుకూలంగా మారనుంది. ప్రస్తుత సీజన్ లో రెండు జట్లు ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించాయి. టైటిల్ గెలవటానికి సొంతగడ్డపై మ్యాచ్ లు ఆడనుండడం కలిసొచ్చే అంశం. షెడ్యూల్ ప్రకారం ఐపీఎల్ 2025 ఫైనల్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ లో జరగాల్సి ఉంది. కోల్‌కతాలోని ప్రతికూల వాతావరణం కారణంగా ఐపీఎల్ ఫైనల్ ను షిఫ్ట్ చేయనున్నారు. మే నెలాఖరులో కోల్‌కతాలో భారీ వర్ష సూచన ఉంది. ఈ కారణంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం ఫైనల్‌కు ఆతిధ్యమివ్వబోతున్నట్టు సమాచారం. క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచ్ లు హైదరాబాద్ లో జరగాల్సి ఉండగా.. ముల్లన్పూర్ కు షిఫ్ట్ చేయనున్నారు. ఈ సీజన్ లో మరో వారం రోజుల పాటు లీగ్ మ్యాచ్ లు జరగనున్నాయి.

## పువ్వు...నవ్వు కోసం పేరు మార్చుకున్న స్టార్!

స్టార్ హీరోల స్క్రీన్ నేమ్...వాస్తవ పేరుకు ఏ మాత్రం సంబంధం లేకుండా ఉంటుంది. స్క్రీన్ నేమ్స్ అన్నవి చిత్ర పరిశ్రమ సక్సస్ లు ఆధారంగా ఇస్తుంటుంది. సాధించిన విజయాలు, అవార్డులు, రివార్డు లు, ప్రేక్షకుల ఆధరణ ఇలా కొన్ని అంశాలు కీలక పాత్ర పోషిస్తుంటాయి. చిరంజీవి శివ శంకర వర ప్రసాద్ అంటే ఎవరైనా నమ్ముతారా? నమ్మడం కష్టం. ఆయన ఒరిజినల్ అదైనా? అంతా చిరంజీవినే పిలు స్తుం టారు.

అంతెందుకు ఆయన వాస్తవ పేరు ఇంట్లో కుటుంబ సబ్యులకు కూడా పూర్తి అవగాహన ఉండక పొచ్చు. చిరంజీవికి మెగాస్టార్ అనే బిరుదు ఇచ్చింది యండమూరి వీరేంద్రనాద్. చిరంజీవి సక్సస్ లు చూసి ఇండ స్ట్రీ పెద్దలు సహా యండమూరి చిరంజీవిని అలా అభివర్ణించడంతో మెగాస్టార్ గా మారారు. తాజాగా విశ్వ నటుడు కమల్ హాసన్ ఒరిజినల్ పేరు కూడా తెరపైకి వచ్చింది. కమల్ హాసన్ అసలు పేరు పార్ధ సారధి. నాలుగేళ్ల వయసులోనే ఆ పేరును మార్చి కమల్ హాసన్ అని పెట్టారు.

ఈ పేరు పెట్టింది కమల్ తండ్రి శ్రీనివాసన్. ఎందుకు మార్చారో తనకు తెలియదని కమల్ అంటున్నారు. పేరులో పువ్వు..నవ్వు ఉంటే బాగుంటుంది అన్న ఆలోచనతోనే అలా మార్చి ఉటారని కమల్ భావి స్తున్నారు. కమలం పువ్వు...హహ అనే నవ్వుతో అనే నవ్వులోనే నా పేరు ఉందన్నారు. అలా పార్ధసారధి కమల్ హాసన్ గా మారారు. ప్రస్తుతం కమల్ హాసన్ థగ్ లైఫ్ లో నటిస్తున్నారు.అన్ని పనులు పూర్తి చేసుకుని జూన్ లో ఈచిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. రిలీజ్ అయిన ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో సినిమాపై అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. అలాగే శంకర్ దర్శకత్వంలో ఇండియన్ 3 కూడా పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. థగ్ లైఫ్ అనంతరం రిలీజ్ అవుతుంది.









On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com